www.andhrajyothy.com

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 5

శుక్రవారం | 4-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: సప్తమి రా.8.13 తదుపరి అష్టమి; నక్షత్రం: ఆర్ద్ర తె.5.20 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ.2.04-మ.3.38; దుర్ముహూర్తం: ఉ.8.37-ఉ.9.26, మ.12.42-మ.1.31; అమృతఘడియలు: రా.7.32-9.06; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 6.25

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్‌పై మిశ్రమ ప్రభావం 2

ఫార్మా రంగం మినహాయింపు పెద్ద ఊరట

మన ఎగుమతుల్లో 3వ వంతు ఫార్మాయే

ఆటోమొబైల్ విడిభాగాలపై గట్టి ప్రభావం

మనకిదే మంచి తరుణం

భారత్‌తో పోలిస్తే ఆసియాలోని

పలు దేశాలపై ట్రంప్ అధిక సుంకాలు

అక్కణ్నుంచి తరలివచ్చే ఎంఎన్‌సీలను

ఆకర్షించేందుకు మనకు అవకాశం

అమెరికాకు మాంద్యం?

ప్రతీకార సుంకాలతో అసలుకే ఎసరు!

గతంలోనూ ఇలాగే స్మూత్‌హాలీ పేరుతో

భారీగా సుంకాలు విధించిన అగ్రరాజ్యం

1930 నాటి మాంద్యానికి అదే కారణం

స్వదేశానికి వెళ్లొద్దు!

వెళ్తే తిరిగి వచ్చే చాన్స్ ఉండదు.. భారతీయ

ఉద్యోగులకు అమెరికా కంపెనీల హెచ్చరిక

ట్రంప్ ఆంక్షలపై ఆందోళనలో భారత టెకీలు

డాక్యుమెంట్లు వెంట తీసుకెళ్లాల్సిన పరిస్థితి



26 కాదు.. 27 శాతం

భారత ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకం

అన్ని దేశాలపైనా కనీసం 10 శాతం టారిఫ్.. విదేశీ ఆటోమొబైల్స్ ఉత్పత్తులపై 25%

ఫార్మా సెమీకండక్టర్స్, ఇంధన రంగాలకు సంబంధించిన ఉత్పత్తులకు మినహాయింపు

అమెరికా పన్నుచెల్లింపుదార్లు 50 ఏళ్లుగా దోపిడీకి గురయ్యారు.. ఇకపై అలా కుదరదు

మా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై అందులో సగమే వేస్తున్నాం: ట్రంప్

భారత్‌పై సుంకాల ప్రభావాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాం: కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటన

ట్రంప్ ప్రకటనతో అమెరికా మార్కెట్ల క్రాష్.. రూ.లక్షల కోట్ల మేర ఆవిరైన సొమ్ము

వాషింగ్టన్, ఏప్రిల్ 3: తమ దేశ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ప్రతి దేశంపైనా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ప్రతీకార సుంకాల' కత్తిదూశారు! తమపై 52 శాతం సుంకాలు విధిస్తున్న భారతదేశంపై తాము అందులో సగం, అంటే 26 శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. అయితే, ఆ తర్వాత వైట్‌హౌస్ వర్గాలు విడుదల చేసిన పత్రాల్లో.. భారత్‌పై విధించే సుంకం 27 శాతంగా పేర్కొనడం గమనార్హం. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వైట్‌హౌస్‌లోని రోజ్‌గార్డెన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ సుంకాల ప్రకటన చేశారు. "అమెరికన్ ప్రజలారా.. ఇది (ఏప్రిల్ 2) మీరు

మిగతా 2వ పేజీలో...

అక్కడ అంగుళం కూడా కొనకండి

మూడేళ్ల తర్వాత అధికారం మాదే.. ఆ భూములన్నీ వెనక్కి తీసుకుంటాం

400 ఎకరాల్లో ఎకో పార్కును ఏర్పాటు చేస్తాం

రేవంత్.. రియల్ బ్రోకర్‌లా కాదు, మనిషిలా ఆలోచించు

సంజయ్..తంబాకు నమలడం కాదు.. పర్యావరణం గురించి తెలుసుకో

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్, తలసాని

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పుడే చెబుతున్నా.. రేవంత్ వేసే బిస్కట్లకు ఆశపడకండి. ఆయన మాటలునమ్మి 400 ఎకరాల భూమిలో అంగుళం భూమికూడా కొనకండి. మూడేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది మేమే. అప్పుడు ఆ భూముల్ని వెనక్కి తీసుకుంటాం' అని కేటీఆర్ అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ భూముల్లో ఎకోపార్క్‌ను ఏర్పాటు చేయాలని తమ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారని వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ చెప్పిందని ఎవరైనా కొంటే డబ్బులు నష్టపోతారన్నారు. బాధ్యత గల సీఎంనన్న విషయం మరచి రేవంత్ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా

మిగతా 13వ పేజీలో...

బీఆర్ఎస్ ఐటీసెల్ ఇన్‌చార్జీలపై కేసులు

కంచ గచ్చిబౌలిపై ఫేక్ వీడియోలు సృష్టించారని ఎన్ఎస్‌యూఐ ఫిర్యాదు

కొణతం దిలీప్, క్రిశాంక్‌లపై కేసు నమోదు

హెచ్‌సీయూ వ్యవహారంపై సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాల యత్నం 13

మా ఆదేశాలు పాటించకపోతే..

సీఎస్ జైలుకే!

అక్కడి చెరువు దగ్గర నిర్మించే తాత్కాలిక జైలుకు వెళతారు



కంచ గచ్చిబౌలిలో చెట్లను తొలగించి అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటి? ప్రభుత్వం పర్యావరణ శాఖ నుంచి అనుమతి తీసుకుందా? చెట్ల నరికివేత కోసం అటవీ అధికారులనుంచి అనుమతులు పొందారా? రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో అధికారులను నియమించాల్సిన అవసరమేంటి? వారికి అడవుల గురించి ఉన్న అనుభవమేంటి? అక్కడ నరికిన చెట్లతో ఏం చేస్తోంది? వీటన్నిటిపై నివేదిక సమర్పించాలి. - సుప్రీం ధర్మాసనం



మీరు దానినే కోరుకుంటే మేం ఏమీ చేయలేం

వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది

కంచ గచ్చిబౌలి వ్యవహారంలో సుప్రీం వ్యాఖ్యలు

సీఎస్ అక్కడ పరిశీలించి 16లోపు నివేదిక ఇవ్వాలి

2-3 రోజుల్లోనే వంద ఎకరాల నరికివేతా!?

హైకోర్టు రిజిస్ట్రార్ నివేదికలో విస్తుపోయే అంశాలు

నెమళ్లు, జింకలు పారిపోయినట్లు ఫొటోలున్నాయ్

తదుపరి ఆదేశాలిచ్చే దాకా పనులొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల విషయంలో తమ ఆదేశాలు అమలు చేయకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా బాధ్యులవుతారని, జైలుకు వెళతారని సుప్రీం కోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. అక్కడే చెరువు సమీపంలో తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, దానినే కోరుకుంటే తాము చేసేదేమీ ఉండదని, ఎవరూ సహాయం చేయలేరని హెచ్చరించింది. ఇది తీవ్రమైన అంశమని, చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించింది. ప్రజా ప్రతినిధుల అనర్హత పిటిషన్లను విచారించడానికి సంసిద్ధమవుతున్న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్ ధర్మాసనం దృష్టికి కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని అమికస్ క్యూరీ, న్యాయవాది పరమేశ్వర్ గురువారం ఉదయం తీసుకెళ్లారు. దీనిని సుమోటోగా తీసుకుని అత్యవసరంగా విచారించాలని ప్రత్యేకంగా అభ్యర్థించారు. దానిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. వివాదాస్పద స్థలానికి స్వయంగా వెళ్లి.. పరిశీలించి.. మధ్యాహ్నం మూడున్నర

మిగతా 13వ పేజీలో...



2000 ఎకరాల్లో ప్రపంచస్థాయి ఎకో పార్క్!

ప్రభుత్వ భూమి 400 ఎకరాల్లోనే కాకుండా

హెచ్‌సీయూ 1600 ఎకరాల్నీ కలిపి ఏర్పాటు

సింగపూర్ నైట్ సఫారీ, న్యూయార్క్

సెంట్రల్ పార్కుల తరహాలో వసతులు

హైదరాబాద్‌కే తలమానికంగా నిర్మాణం

భాగస్వాములతో సంప్రదింపులకు యోచన

ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలో ప్రపంచంలోనే అతి పెద్ద పర్యావరణ పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందా!? అక్కడి 400 ఎకరాల్లోనే కాకుండా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విస్తరించిన 1600 ఎకరాలనూ కలిపి సింగపూర్‌లోని నైట్ సఫారీ, న్యూయార్క్‌లోని సెంట్రల్ పార్క్ తరహాలో 2000 ఎకరాల్లో అతి పెద్ద ఎకో పార్కును ఏర్పాటు చేయనుందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే జవాబిస్తున్నాయి ప్రభుత్వ వర్గాలు. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

మిగతా 13వ పేజీలో...

సుప్రీం మమ్మల్ని అడ్డుకోలేదుగా!?

కొత్త పిటిషన్లలోనూ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

13 విచారణ ఈనెల ఏడోతేదీకి వాయిదా

సుప్రీం స్టేతో హెచ్‌సీయూలో విద్యార్థుల సంబరాలు

ఆందోళన విరమిస్తున్నట్టు ప్రకటించిన సంఘాలు



25 వేలమంది టీచర్ల నియామకాలు రద్దు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మమత ప్రభుత్వానికి ఝలక్

నియామక ప్రక్రియంతా అవకతవకలేనన్న ధర్మాసనం

నోట్ల కట్టల జడ్జిని బదిలీ చేసినట్లు టీచర్లను చేయొచ్చుగా

ఇంతమందిని తొలగిస్తే పాఠాలు చెప్పేదెవరు?: మమత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: పశ్చిమబెంగాల్‌లోని మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ పరిధిలోని 25 వేల మందికిపైగా టీచర్లు, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు

మిగతా 2వ పేజీలో...



ఢిల్లీలో సోనియాతో మంత్రి పొన్నం, ఆది శ్రీనివాస్ తదితర తెలంగాణ కాంగ్రెస్ నేతలు

ప్రజా సంక్షేమానికి పునరంకితం కండి

రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సోనియా, రాహుల్ సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి పునరంకితం కావాలని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తెలంగాణ కాంగ్రెస్ నేతలకు సూచించారు. గురువారం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతల బృందం పార్లమెంట్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ బృందంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖా, ఎంపీలు కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ. కావ్య, అనిల్, విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాకూర్

మిగతా 12వ పేజీలో...

ఆమోదిస్తే.. 24 గంటల్లో

బీసీ కోటా అమలు

సంజయ్‌కు పొన్నం సవాల్

12

ప్రధాని అపాయింట్‌మెంట్

బీజేపీ తీసుకోవాలి

సీఎంతో పాటు కలిసి వస్తాం

బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం: మహేష్‌గౌడ్

సీఎం సంయమనం

పాటించలేరా?

గతంలో ఎమ్మెల్సీ కవిత విషయంలోనూ ఇలానే వ్యాఖ్యలు

అప్పట్లో చర్యలు తీసుకోకుండా తప్పు చేశామా?

సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం

ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఎం కాస్త సంయమనం పాటించలేరా? అని ప్రశ్నించింది. "గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విషయంలో ఇలాంటి ఘటన జరిగింది. ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా? గతంలో చర్యలు తీసుకోకుండా తప్పు చేశామా? సుప్రీంకోర్టు సంయమనం పాటిస్తున్నప్పుడు ప్రజాస్వామ్యంలోని ఇతర విభాగాలు కూడా అదే

మిగతా 14వ పేజీలో...



హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో జలమయమైన రోడ్లు

అకాల వర్షంతో అతలాకుతలం

పలు జిల్లాల్లో ఈదురుగాలులతో వడగండ్లు

తడిసిన ధాన్యం.. దెబ్బతిన్న వివిధ పంటలు

సంస్థాన్‌నారాయణపురంలో 9.7 సెం.మీ. వర్షం

పిడుగుపాటుకు నలుగురి మృతి.. గోడ కూలి ఒకరు

హైదరాబాద్‌లో గంటన్నర పాటు దంచికొట్టిన వాన

భారీ వర్షం ధాటికి చార్మినార్ నుంచి ఊడిన పెచ్చులు

అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి: సీఎం రేవంత్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో అకాల వర్షంతో పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. కొన్ని చోట్ల భారీ వర్షం కురియగా.. చాలా చోట్ల మోస్తరు వానలు పడ్డాయి. పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలకు వరి పంట నేలకొరగ్గా.. మామిడి, జొన్న, మొక్కజొన్నతో పాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం

మిగతా 3వ పేజీలో...



తగ్గేదే లే..! 14

నాపై ఆరోపణల్ని రుజువు చేస్తే రాజీనామా చేస్తా

లేకపోతే అనురాగ్ ఠాకూర్ చేయాల్సిందే

రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్

భారత్‌ది వికాసవాదమే..

విస్తరణ వాదం కాదు

థాయ్‌లాండ్‌తో సంబంధాలు 2

'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, సమ్మిళిత, చట్టబద్ధ వ్యవస్థ ఉండాలని ఆకాంక్ష

ఈశాన్య రాష్ట్రాలకు థాయ్‌తో మరింత సహకారం .. థాయ్ పర్యటనలో మోదీ వెల్లడి



బ్యాంకాక్‌లో బిమ్‌స్టెక్ సదస్సులో బంగ్లాదేశ్ సలహాదారు యూనస్‌తో మోదీ

ఈపీఎఫ్ విత్‌డ్రా మరింత సులువు

ఇకపై క్యాన్సిల్డ్ చెక్ అప్‌లోడ్ అవసరం లేదు

బ్యాంకు ఖాతాకు కంపెనీ ధ్రువీకరణ అక్కర్లేదు

క్లెయిమ్‌ల వేగవంతానికి ఈపీఎఫ్‌వో చర్యలు

2



బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లతో పశు వైద్య అధికారుల బృందం

3

బర్డ్‌ఫ్లూ సోకిన 10వేల కోళ్లను చంపేశారు

రంగారెడ్డి జిల్లా బాటసింగారంలో వైద్యాధికార్ల చర్య



మనకిదే మంచి తరుణం

- భారత్‌తో పోలిస్తే ఆసియాలోని పలు దేశాలపై ట్రంప్ అధిక సుంకాలు
- అక్కణ్నుంచీ తరలివచ్చే ఎంఎన్‌సీలను ఆకర్షించేందుకు మనకు చాన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ట్రంప్ ఆసియాలోని ఇతర దేశాలన్నింటికన్నా భారత్‌పై విధించిన సుంకాలే తక్కువ. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలోనూ ట్రంప్ సర్కారు చైనా ఉత్పత్తులపై రెండు విడతలుగా 20 శాతం సుంకం విధించింది. తాజాగా విధించిన 34 శాతంతో చైనా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు 54 శాతానికి చేరతాయి. కంబోడియాపై 49%, వియత్నాంపై 46%, మయన్మార్‌పై 44%, బంగ్లాదేశ్‌పై 37%, థాయ్‌లాండ్‌పై 36%, తైవాన్‌పైన, ఇండోనేసియాపై 32%, పాకిస్థాన్‌పై 29% సుంకాలు విధించారు. జపాన్, దక్షిణకొరియా, సింగపూర్, మలేసియా తదితర దేశాల సుంకాలు మనకన్నా తక్కువున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం సరైన వ్యూహంతో వ్యవహరిస్తే చైనా నుంచి ఇతర దేశాలకు తరలి రావాలనుకునే బహుళజాతి కంపెనీలను (ఎంఎన్‌సీ) భారత్‌కు ఆకర్షించేందుకు ఎంతో ఉపకరిస్తుందని భావిస్తున్నారు. గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక ప్రకారం భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే ఉత్పత్తుల్లో ఆసియాలోని ఇతర దేశాలతో సమానంగా 25శాతం సుంకాలు పడేది.. స్టీలు, అల్యూమినియం, ఆటోమొబైల్స్ ఉత్పత్తులపైనే. భారత్ నుంచి ఎగుమతయ్యే ఉత్పత్తుల్లో అత్యధికం.. ఫార్మా ఉత్పత్తులు. తాజా పెంపులో ట్రంప్ వాటిని మినహాయించారు. మిగిలిన ఉత్పత్తులపై 27% సుంకాలు పడతాయి. వాటి విషయంలో ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే మనమే మెరుగైన స్థితిలో ఉన్నందున ప్రభుత్వం మేకిన్ ఇండియాకు ఊతమిస్తే అమెరికాకు మన ఎగుమతుల వాటాను గణనీయంగా పెంచుకోవచ్చని జీటీఆర్ఐ నివేదికలో అభిప్రాయపడింది. టెక్స్‌టైల్ రంగంలో మనకు పోటీగా ఉన్న చైనా, బంగ్లాదేశ్‌పై సుంకాలభారం భారీగా పెరిగింది. ప్రస్తుతం ఈ దేశాల్లోని గ్లోబల్ బ్రాండ్లు తమ ఉత్పత్తిని భారత్‌కు తరలించే ఆలోచన చేసే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్ స్మార్ట్‌ఫోన్ రంగాల్లోనూ భారత్‌కు ప్రధాన పోటీదారులైన వియత్నాం, థాయ్‌లాండ్‌పై విధించిన సుంకాలు.. భారత్‌పై విధించిన సుంకాలకన్నా ఎక్కువ. భారత్‌లో ఇప్పటికే యాపిల్, శాంసంగ్ వంటివి పెట్టుబడులుపెట్టాయి. ఇప్పుడీ సుంకాల ప్రయోజనాలను అందుకుంటే మన ఎలక్ట్రానిక్స్ సప్లై చైన్‌ను మరింత మెరుగుపరచుకోవచ్చు. అమెరికాకు యంత్రాలు, ఆటోవిడిభాగాలు, బొమ్మల ఎగుమతుల్లో ప్రస్తుతం చైనా, థాయ్ ముందున్నాయి. ఇప్పుడీ అవకాశాన్ని వాడుకుంటే వీటిలో ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించి ఉత్పత్తి పెంచి ఈ దేశాలతో పోటీపడొచ్చని జీటీఆర్ఐ పేర్కొంది.

26% కాదు..27%

(మొదటిపేజీ తరువాయి)



చాలాకాలంగా ఎదురుచూస్తున్న విముక్తి దినం. అమెరికన్ పరిశ్రమలు పునర్జన్మించిన రోజుగా, మన భవితవ్యాన్ని మనం పొందిన రోజుగా, అమెరికాను మళ్లీ సుసంపన్నదేశంగా మార్చే ప్రక్రియను మొదలుపెట్టినరోజుగా చరిత్రలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుంది." అంటూ మొదలుపెట్టి వివిధ దేశాలు అమెరికాపై ఎంతెంత సుంకాలు విధిస్తున్నదీ వివరించారు. అమెరికాతో వాణిజ్యసంబంధాలున్న అన్ని దేశాలపైనా కనిష్ఠంగా 10 శాతం సుంకం విధించిన ట్రంప్.. తమపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలపై 10 శాతానికి మించి టారిఫ్‌లు విధిస్తున్నట్టు ప్రకటించారు. చైనాపై 34% (ఇప్పటికే విధించిన 20 శాతంతో కలిపి మొత్తం 54 శాతం), యూరోపియన్ యూనియన్ దేశాలపై 20 శాతం, వియత్నాంపై 46%, థాయ్‌ల్యాండ్‌పై 36%, కంబోడియాపై 49%, తైవాన్‌పై 32%, జపాన్‌పై 24%, బంగ్లాదేశ్‌పై 37%, పాకిస్థాన్‌పై 29%, శ్రీలంకపై 44%.. ఇలా పలు దేశాలపై భారీగా సుంకాలు విధిస్తున్నట్టు వెల్లడించారు. ఇన్నాళ్లుగా అధిక సుంకాలతో చాలా దేశాలు అమెరికాను దోచుకున్నాయని ఆరోపించారు. కానీ తాము మాత్రం చాలా దయగా వ్యవహరిస్తున్నామని.. ఆయా దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో సగం మాత్రమే విధిస్తున్నామని పేర్కొన్నారు. అమెరికా పన్నుచెల్లింపుదారులు 50 ఏళ్లకు పైగా ఈ దోపిడీకి గురయ్యారని, ఇకపై అలా జరగదని.. ఇన్నాళ్లుగా జరుగుతున్న ఈ అన్యాయానికి అడ్డుకట్ట వేసి, అమెరికా ప్రభుత్వానికి భారీగా ఆదాయం తెచ్చేందుకే ఈ సుంకాలను విధిస్తున్నట్టు ఆయన తెలిపారు. విదేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని కార్లపైనా 25 శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఫార్మా, సెమీకండక్టర్లు, ఇంధన రంగాలకు సంబంధించిన ఉత్పత్తులను పూర్తిగా మినహాయించారు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం (ఏప్రిల్ 5) అర్ధరాత్రి 12.01 గంటల నుంచి బేస్‌లైన్ సుంకం 10% అమల్లోకి వస్తుందని, ఆ తర్వాత దేశాలవారీగా విధించిన అదనపు సుంకాలు ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచీ అమలవుతాయని వైట్‌హౌస్ వర్గాలు వివరించాయి. అమెరికాకు అధికంగా ఎగుమతులు చేస్తూ, అక్కడి ఉత్పత్తులను తక్కువగా దిగుమతి చేసుకునే దేశాలపై ప్రభావం భారీగా ఉండేలా అమెరికా ఈ సుంకాలను విధించినట్టు ఆర్థిక నిపుణులు వెల్లడించారు.

స్నేహితుడేగానీ..

తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ఒక్కొక్క దేశం గురించి చెబుతూ వచ్చిన ట్రంప్.. ఇండియా పేరు రాగానే మోదీ గురించి ప్రస్తావించారు. భారత ప్రధాని (మోదీ) తనకు గొప్ప స్నేహితుడేగానీ.. భారత్ అమెరికాతో సరిగ్గా వ్యవహరించట్లేదని, ఇదే విషయాన్ని తాను మోదీతో కూడా చెప్పానని వెల్లడించారు. భారత్ తమపై 52 శాతం సుంకాలు విధిస్తోందని.. కానీ, అమెరికా కొన్ని దశాబ్దాలుగా భారత్ ఉత్పత్తులపై పెద్దగా సుంకాలే విధించట్లేదని పేర్కొన్నారు. భారత్‌పై ట్రంప్ ప్రకటించిన 26 శాతం సుంకం.. మొత్తం భారత ఉత్పత్తులపై విధించే సగటు టారిఫ్. ప్రత్యేకంగా ఏ రంగంపై/ఏ ఉత్పత్తులపై ఎంత సుంకం విధించేదీ వివరాలు తెలపలేదు. కాగా.. ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావం ఎంతమేరకు ఉంటుందనే అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు కేంద్ర వాణిజ్యశాఖ, ఆర్థిక శాఖ వెల్లడించాయి. దీనిపై దేశీ పరిశ్రమలు, ఎగుమతిదారులు, ఇతర భాగస్వాములందరితో చర్చలు జరుపుతున్నామని వాణిజ్య శాఖ ఒక అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించింది. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల నిమిత్తం అమెరికాతో కలిసి సన్నిహితంగా పనిచేసేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. ఇక.. ట్రంప్‌కు అమెరికా ముఖ్యమైతే, ప్రధాని మోదీ ప్రథమ ప్రాధాన్యం భారతదేశమేనని, ఈ నేపథ్యంలో సుంకాల ప్రభావాన్ని జాగ్రత్తగా అంచనా వేస్తున్నామని కేంద్ర మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు.

14 దేశాల సుంకాల్లో తేడాలు!

భారతదేశంపై 26% సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించగా... ఆ తర్వాత వైట్‌హౌస్ దీనికి సంబంధించి విడుదల చేసిన అనుబంధ పత్రంలో మాత్రం 27% సుంకం విధించనున్నట్టు ఉంది. ఒక్క భారత్ విషయంలోనే కాక.. మరో 13 దేశాల విషయంలోనూ ఈ తేడా కనిపించింది. ఉదాహరణకు.. దక్షిణకొరియాపై 25% సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించగా వైట్‌హౌస్ అనెక్సర్‌లో అది 26 శాతంగా ఉంది. ఇదే తరహాలో బోట్సువానా, కామెరూన్, మలావీ, నికరాగువా, నార్వే, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్, సెర్బియా, దక్షిణాఫ్రికా, థాయ్‌ల్యాండ్, వనువాటు, ఫాక్‌లాండ్ ఐలండ్స్‌పై సుంకాల్లో ఈ తేడాలు కనిపించాయి. అలాగే.. వివిధ దేశాల ఆధీనంలో ఉన్న భూభాగాలపై విధించే సుంకాలను కూడా తొలుత వైట్‌హౌస్ తమ చార్టుల్లో పొందుపరచింది. కానీ, తర్వాత విడుదల చేసిన అనెక్సర్‌లో ఆ భూభాగాల వివరాలే లేకపోవడం గమనార్హం.

రష్యాకు ఎందుకు వదిలేశారు?

అమెరికాతో వాణిజ్య బంధం ఉన్న అన్ని దేశాలపైనా సుంకాల పెంపును ప్రకటించిన ట్రంప్.. ఆ జాబితాలో రష్యా, ఉత్తరకొరియా, క్యూబా, మెక్సికో, కెనడా, బెలారస్ దేశాలను మాత్రం చేర్చలేదు. దీనికి కారణమేంటి? అంటే.. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్‌పై ఇప్పటికే పలు ఆంక్షలు విధించామని, ఆ దేశంతో వాణిజ్యం చాలా తక్కువగా ఉందని యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ చెప్పారు. అందుకే రష్యాను ఈ జాబితాలో చేర్చలేదన్నారు. అయితే.. ఉక్రెయిన్‌లో అరుదైన నిక్షేపాలను సొంతం చేసుకునే ఆలోచనలో ఉన్న ట్రంప్, అందుకు పుతిన్ సహకారం తీసుకునే యోచనలో ఉన్నారు కాబట్టే రష్యాపై సుంకాలు విధించలేదనే వాదన కూడా వినపడుతోంది. ఇక.. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ ఇప్పటికే 25% సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఉత్తరకొరియా, క్యూబా దేశాలపై ఇప్పటికే పలు ఆంక్షలున్నందున వాటిపైనా సుంకాలు విధించలేదని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి.

భారత్‌పై మిశ్రమ ప్రభావం

ట్రంప్ తన సుంకాల నుంచి ఫార్మా రంగాన్ని మినహాయించడం భారత్‌కు పెద్ద ఊరట. ఎందుకంటే మనదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఉత్పత్తుల్లో దాదాపు మూడోవంతు వాటా ఫార్మా రంగానిదే! అమెరికాకు అవసరమైన జనరిక్ ఔషధాల్లో 40 శాతం మనదేశం నుంచే ఎగుమతి అవుతాయి. ఆ ఉత్పత్తుల విలువ ఏకంగా 8.7 బిలియన్ డాలర్లు. అంటే దాదాపుగా రూ.75 వేల కోట్లకు పైమాటే. ఈ రంగాన్ని మినహాయించడమంటే మన ఎగుమతుల్లో మూడో వంతుపై ఎలాంటి సుంకాలూ లేనట్టే. తర్వాతి స్థానంలో రత్నాలు, ఆభరణాలు ఉంటాయి. అమెరికాకు మన ఎగుమతుల్లో దాదాపు 30% దాకా ఈ రత్నాలు, ఆభరణాలు ఉంటాయి. వీటిపై సుంకాలు పెంచినా.. వాటి విలువ ఎప్పటికప్పుడు పెరిగేదే కాబట్టి, ఎగుమతులు తగ్గినా ఆదాయం గణనీయంగా తగ్గకపోవచ్చని అంచనా. అయితే, ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించి ఈ రంగంలో అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇక.. ఆటోమొబైల్స్ విడిభాగాలపై ట్రంప్ విధించిన సుంకాల భారం మాత్రం భారత్‌పై బాగానే ప్రభావం చూపించవచ్చనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. అమెరికాకు మన ఎగుమతుల్లో 16 శాతం.. ఆటోమొబైల్ ఉత్పత్తులదే. ఏటా సగటున దాదాపు రూ.21 వేల కోట్ల విలువైన కార్ల విడిభాగాలు మనదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతాయి. అలాగే అమెరికాకు మన ఎగుమతుల్లో 7% వాటా టెక్స్‌టైల్స్ రంగానిది. ఏటా దాదాపు రూ.42 వేల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతాయి. తాజా సుంకాలతో ఈ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. కానీ.. ఈ రంగంలో మనకు పోటీ బంగ్లాదేశ్, వియత్నాం. వాటిలో వియత్నాంపై 46%, బంగ్లాదేశ్‌పై 37% సుంకాలను ట్రంప్ విధించారు. ఫలితంగా ఆయా దేశాల కంటే మన ఉత్పత్తులే చౌకగా అమెరికన్లకు అందుబాటులో ఉంటాయి. కాబట్టి మన టెక్స్‌టైల్ ఎగుమతులు పెరిగే అవకాశమే ఉంటుంది తప్ప తగ్గవు. మొత్తమ్మీద.. తాజా సుంకాల ప్రభావం భారత్‌పై మిశ్రమంగా ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

లోకం తీరు



అమెరికాకు మాంద్యం ముప్పు?

- ప్రతీకార సుంకాలతో అసలుకే ఎసరు!
- గతంలోనూ ఇలాగే స్మూత్‌హాలీ పేరుతో భారీగా సుంకాలు విధించిన అగ్రరాజ్యం
- 1930నాటి మాంద్యానికిదే కారణం

ట్రంప్ సుంకాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరోసారి మాంద్యం బారిన పడే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. దిగుమతుల నుంచి తన ఆర్థిక వ్యవస్థను రక్షించుకునే పేరుతో అమెరికా గతంలోనూ 'స్మూత్-హాలీ' పేరుతో ఇలాగే దిగుమతులపై పెద్ద ఎత్తున సుంకాలు విధించింది. 1930నాటి మహా ఆర్థిక మాంద్యానికి అదే ప్రధాన కారణమని ఆర్థికవేత్తలు చెబుతారు. ఇప్పుడు ట్రంప్ తన చర్యలతో అలాంటి మాంద్యానికి బీజాలు వేస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రతీకార సుంకాల విధింపు రోజును ట్రంప్ 'విమోచన దినోత్సవం'గా ప్రకటిస్తే ఆర్థికవేత్తలు మాత్రం 'మాంద్యం దినోత్సవం'గా పరిగణిస్తున్నారు. అమెరికా జీడీపీ వృద్ధి రేటు ఇప్పటికే పడకేసింది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 2% దిగువకు తీసుకురావాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు ఈ సుంకాలతో ఇది మరింత కోరలు చాచే ప్రమాదం కనిపిస్తోంది. అదే జరిగితే వడ్డీ రేట్ల తగ్గింపునకు అమెరికా ఫెడ్ రిజర్వు ఫుల్‌స్టాప్ పెట్టినట్టే. అమెరికా ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలు తోడవడంతో అమెరికా మరోసారి మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అదే జరిగితే ఆ ప్రభావం చైనా, భారత్, జపాన్, యూరప్ దేశాలపైనా పడే ముప్పుంది. 2008నాటి అమెరికా ఆర్థిక మాంద్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపేసింది. ట్రంప్ ప్రతీకార సుంకాలతో ఈ ఏడాది, వచ్చే ఏడాది ప్రపంచ ఎగుమతుల వృద్ధిరేటు 1.3శాతం మించకపోవచ్చని హెచ్ఎస్‌బీసీ రీసెర్చ్ హెచ్చరించింది. ట్రంప్ మన ఐటీ సేవల ఎగుమతులపై ప్రతీకార సుంకాలు విధించలేదు. అయితే వివిధ ఉత్పత్తులపై విధించిన సుంకాలతో అమెరికా మాంద్యంలోకి వెళ్లే ప్రమాదమో కనిపిస్తోంది. ఇది భారత ఐటీ పరిశ్రమను వణికిస్తోంది.

మన ఆస్తులు ప్రకటిద్దాం!

- చీఫ్ జస్టిస్ సహా సుప్రీంకోర్టు జడ్జిలందరి నిర్ణయం
- ఆ వెంటనే ఆదాయ వివరాలను ప్రకటించిన సీజే
- స్వచ్ఛందం అన్నప్పుడు పాటించని న్యాయమూర్తులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 : ప్రధాన న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టులోని న్యాయమూర్తులంతా తమ ఆస్తుల వివరాలను వెల్లడించాలని నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట భారీగా బయటపడిన నగదు కలకలం రేపుతున్న నేపథ్యంలో దేశ అత్యున్నత న్యాయస్థానంలోని జడ్జీలు ఇందుకు సిద్ధమయ్యారు. న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంచడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి తమ ఆస్తుల వివరాలు ప్రకటించారు. చీఫ్ జస్టిస్ సహా సుప్రీంకోర్టులో ప్రస్తుతం 30 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన వీరందరితో ఫుల్‌కోర్టు సమావేశం జరిగింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ప్రతి ఒక్కరూ తమ ఆస్తుల వివరాలు వెల్లడించాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. అంతకు ముందు... 1997లో చేసిన తీర్మానం ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందించాల్సి ఉంది. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను బహిర్గతం చేయాలంటూనే... దానిని తప్పనిసరి చేయకుండా, జడ్జిల ఇష్టానికే వదిలేస్తూ 2009లో ఒక తీర్మానం చేశారు. దీంతో చాలామంది న్యాయమూర్తులు తమ ఆస్తులను బహిర్గతం చేయలేదు. ఇప్పుడు ఎవరికీ ఆ మినహాయింపు ఉండదు. ప్రధాన న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టు జడ్జిలంతా తమ ఆస్తులను బహిర్గతం చేయాల్సిందే. ఆ వివరాలను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పెడతారు.

మరింత సులువుగా ఈపీఎఫ్ విత్‌డ్రా

- క్లెయిమ్‌ల ప్రక్రియ వేగవంతానికి ఈపీఎఫ్‌వో చర్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఉద్యోగులకు పెద్ద ఉపశమనం కలిగించింది. ఆన్‌లైన్‌లో నగదు విత్‌డ్రా విధానాన్ని ఇకపై మరింత సులభతరం చేసింది. ఆన్‌లైన్‌లో నగదు విత్‌డ్రా కోసం దరఖాస్తు చేసే సమయంలో క్యాన్సిల్డ్ చెక్ అప్‌లోడ్ చేసే ప్రక్రియను తొలగించింది. అదేవిధంగా బ్యాంకు ఖాతాను యాజమాన్యం ధ్రువీకరించవలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో దాదాపు 8 కోట్ల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరనుంది. క్లెయిమ్‌ల పక్రియను వేగవంతం చేయడానికి, ఉద్యోగులు, యజమానులకు సౌకర్యవంతంగా ఉండటానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ చర్యలతో క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ క్రమబద్ధీకరణతోపాటు, క్లెయిమ్‌ల తిరస్కరణలపై ఫిర్యాదులు కూడా తగ్గుతాయని తెలిపింది. యూఏఎన్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానం చేసే క్రమంలో ఆ బ్యాంకు ఖాతా వివరాల ధ్రువీకరణ పూర్తవుతుంది కాబట్టి అదనపు డాక్యుమెంట్లు ఇక అవసరం ఉండదని స్పష్టం చేసింది.

ఒకే రోజున 202 మంది ఎంపీల ప్రసంగం

- లోక్‌సభలో రికార్డు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: లోక్‌సభ గురువారం రికార్డు సృష్టించింది. శూన్య గంట (జీరో అవర్) సమయంలో ఏకంగా 202 మంది ఎంపీలు ప్రసంగించారు. జీరో అవర్‌లో ఎంపీలు ప్రజా ప్రాధాన్యం ఉన్న సమస్యలను ప్రస్తావించి ప్రసంగిస్తారు. సాధారణంగా గంట సమయాన్ని దీనికి కేటాయిస్తారు. అయితే స్పీకర్ ఓం బిర్లా అయిదు గంటలకు మించి సమయం ఇవ్వడంతో ఎక్కువ మంది సభ్యులు పాల్గొనడానికి అవకాశం కలిగింది. 2019 జూలై 18న ఇదే విధంగా సమయం పెంచడంతో 161 మంది సభ్యులు పాల్గొనగలిగారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ముగియనున్నాయి. కాగా, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఇద్దరు కేథలిక్ క్రైస్తవ ప్రీస్ట్‌లపై దాడికి నిరసనగా లోక్‌సభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. తొలుత సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ దీనిపై చర్చ జరగాలని పట్టుపట్టారు. ఇందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించకపోవడంతో నినాదాలు చేస్తూ వాకౌట్ చేశారు. అనంతరం పార్లమెంటు ఆవరణలో నిరసన తెలిపారు.

దీటుగా తిప్పికొడతాం

- అమెరికా ప్రతీకార సుంకాలపై చైనా
- ట్రంప్ నిర్ణయం సరికాదన్న వివిధ దేశాధినేతలు
- చర్చలకు సిద్ధం.. లేదంటే ప్రతిచర్య తప్పదు : ఈయూ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలపై ప్రపంచ దేశాలు తీవ్రంగా స్పందించాయి. ప్రతీకార సుంకాల నిర్ణయాన్ని అమెరికా తక్షణమే వెనక్కి తీసుకోవాలని చైనా పేర్కొంది. లేనిపక్షంలో తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అమెరికా చర్యలను దీటుగా తిప్పికొడతామని హెచ్చరించింది. ప్రతీకార సుంకాలపై ట్రంప్ ప్రకటన చేసిన కాసేపటికే వైట్‌హౌస్ యంత్రాంగంతో ఫోన్‌లో మాట్లాడిన చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ.. ప్రతీకార సుంకాల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. అమెరికా నిర్ణయం ప్రపంచ ఆర్థికాభివృద్ధిని ప్రమాదంలో నెట్టేలా ఉందని తెలిపింది. 'ప్రతీకార సుంకాల పేరిట అమెరికా తీసుకున్న నిర్ణయం ఏకపక్షంగా బెదిరింపులకు దిగడమే. ప్రతీకార సుంకాలు అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు అనుగుణంగా లేవు. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు' అని పేర్కొంటూ చైనా వాణిజ్య శాఖ ఓ ప్రకటన చేసింది. ట్రంప్ ప్రతీకార సుంకాలపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) తీవ్రంగా స్పందించింది. ట్రంప్ నిర్ణయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎదురుదెబ్బ అని ఈయూ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ అన్నారు. ప్రతీకార సుంకాల అంశంలో వైట్‌హౌస్‌తో చర్చలకు తాము సిద్ధమని.. చర్చలు విఫలమైతే ప్రతిచర్యలు కచ్చితంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈయూ ప్రతిచర్య ఏంటనేది నెలాఖరులోగా తెలుస్తుందని ఫ్రెంచ్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు అన్నారు. అమెరికా నిర్ణయానికి కెనడా దీటుగా బదులిచ్చింది. తాము ప్రతీకార సుంకాలు విధిస్తామని పేర్కొన్న కెనడా ప్రధాని మార్క్ కార్నే.. అమెరికా నుంచి దిగుమతయ్యే వాహనాలపై 25శాతం సుంకం వేస్తామని ప్రకటించారు. కాగా, ప్రతీకార సుంకాలపై అమెరికా నిర్ణయం ఆ దేశ ప్రజలకే నష్టం కలిగిస్తుందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ ప్రకటించారు. అమెరికా ప్రతీకార సుంకాలను జపాన్ కూడా తప్పుబట్టింది. అమెరికాలో అత్యధిక పెట్టుబడులు పెడుతున్న జపాన్‌పై కూడా సుంకాలు విధించడం ఏంటనీ? జపాన్ ప్రధాని షెగురు ఇషిబా ప్రశ్నించారు. ప్రతీకార సుంకాల విధింపుపై తాము అమెరికాతో మాట్లాడతామని తైవాన్ ప్రకటించింది. ప్రతీకార సుంకాల పేరిట అమెరికా మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం ఇరువర్గాలకు నష్టం కలిగిస్తుందని ఇటలీ, జర్మనీ దేశాలు పేర్కొన్నాయి. ప్రతీకార సుంకాలపై అమెరికాతో చర్చించి ఒప్పందాలు చేసుకుంటామని ఐర్లాండ్, స్వీడన్ ప్రకటించాయి.

స్వదేశానికి వెళ్లొద్దు!

- వెళ్తే తిరిగి వచ్చే అవకాశం ఉండదు
- భారతీయ ఉద్యోగులకు అమెరికా టెక్ కంపెనీల హెచ్చరికలు



వాషింగ్టన్, ఏప్రిల్ 3: వీసాలు, వలసలపై ట్రంప్ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్న నేపథ్యంలో గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ తదితర అమెరికా టెక్ కంపెనీలు తమ వద్ద పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులకు పలు జాగ్రత్తలు చెబుతున్నాయి. స్వదేశానికి వెళ్లి వచ్చే ప్రయాణాలను మానుకోవాలని, ఒకసారి వెళ్తే అమెరికాకు మళ్లీ వచ్చే అవకాశాలు ఉండబోవని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. అమెరికా టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగుల్లో అత్యధికులు భారతీయులే. ఏటా దాదాపు 65 వేల వీసాలను అమెరికా హెచ్1బీ ప్రోగ్రామ్ కింద లాటరీ పద్ధతిన మంజూరు చేస్తుంది. వీటిలో మెజారిటీ భారత్‌కు లభిస్తుండగా.. తర్వాత స్థానాల్లో చైనా, కెనడా ఉన్నాయి. వీసా ఉద్యోగులు ఎక్కువగా అమెజాన్, గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఆపిల్ సంస్థల్లో పనిచేస్తున్నారు. ట్రంప్ ఆంక్షలతో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో వాషింగ్టన్ పోస్ట్ కొందరు హెచ్1బీ ఉద్యోగులను ఇంటర్వ్యూ చేసింది. వీరిలో ఇద్దరు భారతీయులు.. తాము భారత్‌కు వెళ్లిరావాలన్న ప్రయాణ ఆలోచనను మానుకున్నామని, వెళ్తే తిరిగి రానిస్తారో లేదోనన్న ఆందోళనే దీనికి కారణమని తెలిపారని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. పుట్టుక ఆధారంగా ఇచ్చే పౌరసత్వానికి సంబంధించి ప్రభుత్వం పలు సవరణలు చేయనుందన్న వార్తలపై వీరు ఆందోళన వెలిబుచ్చారు. తమ పిల్లలు అటు అమెరికా, ఇటు భారత్.. పౌరులూ కాకుండా పోతారేమోనని పేర్కొన్నారు. అమెరికా పౌరులు కానివాళ్లందరినీ చట్టవిరుద్ధంగా నివసిస్తున్న వారిగానే పరిగణిస్తారన్న హెచ్చరికల దృష్ట్యా ఇళ్ల నుంచి ఎప్పుడు బయటకొచ్చినా అన్ని ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్తున్నామని కొందరు తెలిపారు. కాగా టెక్ కంపెనీలు తమ ఉద్యోగుల వీసా పొడిగింపు ప్రక్రియను వేగవంతం చేసే చర్యలు చేపట్టాయి.

గ్రీన్‌కార్డ్‌కు అసాధారణ జాప్యం

అమెరికా పౌరసత్వం (గ్రీన్‌కార్డ్) దక్కితే ఇలాంటి సమస్యలు దూరమవుతాయి. కానీ గ్రీన్‌కార్డ్ మంజూరుకు అసాధారణ జాప్యం నెలకొంటోంది. అనేక మంది భారతీయులకు గ్రీన్‌కార్డు కోసం దశాబ్దాలుగా వేచిచూస్తున్నారు. మార్కెట్లో 900కోట్ల డాలర్ల విలువైన కంపెనీగా ఇటీవలే వార్తల్లోకెక్కిన ఏఐ కంపెనీ 'పర్‌ప్లెక్సిటీ' సీఈఓ అరవింద్ శ్రీనివాసన్.. గ్రీన్‌కార్డు కోసం తాను మూడేళ్లుగా వేచిచూస్తున్నానని తాజాగా సోషల్ మీడియాలో ప్రకటించారు. కాగా ట్రంప్ తొలి దఫా పాలనలో వీసా తిరస్కరణలు 15 శాతం పెరిగాయి. ప్రస్తుత హయాంలోనూ ఇదే పరిస్థితి ఉండవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భారత్‌ది వికాసవాదమే.. విస్తరణ వాదం కాదు

- థాయ్‌లాండ్ పర్యటనలో ప్రధాని మోదీ



ప్రధాని మోదీకి త్రిపిటక గ్రంథాన్ని అందిస్తున్న థాయ్ ప్రధాని పటోంగ్‌టార్న్ షినవత్ర

బ్యాంకాక్, ఏప్రిల్ 3: భారత్ అభివృద్ధిని ఆకాంక్షించే వికాసవాదాన్ని నమ్ముతుందే తప్ప, విస్తరణవాదాన్ని కాదని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, పారదర్శక, సమ్మిళిత, చట్టబద్ధ వ్యవస్థ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. థాయ్‌లాండ్ పర్యటనకు వచ్చిన ఆయన గురువారం థాయ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రతో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఆమెతో జరిపిన చర్చల్లో భారత్-థాయ్‌లాండ్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉండాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు-థాయ్‌లాండ్‌ల మధ్య పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలు, విద్యా రంగాల్లో సహకారం పెంపొందింపచేసుకోవాలని నిశ్చయించినట్టు తెలిపారు. భారత్ అమలు చేస్తున్న 'లుక్ ఈస్ట్ పాలసీ', ఇండో-పసిఫిక్ విజన్‌లో థాయ్‌లాండ్‌కు ప్రత్యేక స్థానం ఉందని వివరించారు. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని, రెండు దేశాల భద్రత సంస్థల మధ్య వ్యూహాత్మక చర్చలు జరగాలని కూడా నిర్ణయించినట్టు ప్రధాని మోదీ వెల్లడించారు. తన పర్యటనను పురస్కరించుకొని థాయ్‌లాండ్ ప్రభుత్వం 18వ శతాబ్దంనాటి రామాయణ కుడ్యచిత్రాన్ని పోస్టల్ స్టాంప్‌గా విడుదల చేయడంపై మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని షినవత్ర బహూకరించిన త్రిపిటక 'స్వర గ్రంథాన్ని' స్వీకరించారు. మోదీ రాకను పురస్కరించుకొని థాయ్ రామాయణం 'రామకెయిన్'ను మనోహరంగా ప్రదర్శించారు. 6వ బిమ్‌స్టెక్- 'బంగాళాఖాత బహుళరంగ సాంకేతిక ఆర్థిక సహకార ఉపక్రమణం' (బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్) సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ కూటమిలో భారత్‌తో పాటు థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్‌లకు సభ్యత్వం ఉంది. సముద్రయానంపై ఒప్పందం చేసుకునేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో ప్రధాని మోదీ, బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ పక్కపక్కనే కూర్చోవడం గమనార్హం. కాగా, ఇటీవల సంభవించిన భూకంపంలో మరణించిన వారికి ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

25 వేలమంది టీచర్ల నియామకాలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. నియామక ప్రక్రియ మొత్తం మోసపూరితంగా, అవకతవకలతో కూడుకొని ఉందని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌ల సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. నియామక ప్రక్రియలో విశ్వసనీయత, చట్టబద్ధత లోపించాయని పేర్కొంది. పరిష్కరించడానికి సాధ్యంకానంతగా ఈ ప్రక్రియ మొత్తం కలుషితమైపోయిందని ఆక్షేపించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన కారణం ఏమీ తమకు కనిపించడం లేదని తెలిపింది. మోసపూరితంగా నియామకాలు పొందిన అభ్యర్థులు ఏళ్లతరబడి పొందిన జీతాలను వెనక్కి ఇవ్వాల్సిన అవసరం లేదని, అయితే, వారి నియామకాలను రద్దు చేస్తున్నామని ధర్మాసనం తేల్చిచెప్పింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసిన మమతా బెనర్జీ ప్రభుత్వం.. కళంకిత అభ్యర్థులు, కళంకితంకాని అభ్యర్థులను వేర్వేరుగా చూడాలని కోరగా.. నియామక ప్రక్రియ ప్రతి దశలోనూ మభ్యపెట్టే, కప్పిపుచ్చే చర్యలున్నందున ఎవరు కళంకితులో, ఎవరు కాదో నిర్ధారించడం కష్టంగా మారిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నియామక ప్రక్రియలో బెంగాల్ ప్రభుత్వం సృష్టించిన సూపర్‌న్యూమరరీ పోస్టులు ఈ వివాదానికి కేంద్రంగా మారాయి. 2016లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్షకు 23 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం ఖాళీలు 24,640 కాగా, 25,753 మందికి నియామక పత్రాలు జారీ చేశారు. దీంతో అక్రమ నియామకాల కోసమే అదనంగా సూపర్‌న్యూమరిక్ పోస్టులు సృష్టించారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఆ జడ్జి లాగా బదిలీ చేయొచ్చుగా: మమత

ఉపాధ్యాయ నియామకాలపై సుప్రీంకోర్టు తీర్పును వ్యక్తిగతంగా తాను అంగీకరించబోనని, అయితే, ఆ తీర్పును తన ప్రభుత్వం అమలు చేస్తుందని సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. నియామక ప్రక్రియను తిరిగి నిర్వహిస్తామని చెప్పారు. గురువారం కోల్‌కతాలో ఆమె మీడియాతో మాట్లాడుతూ బెంగాల్‌లో విద్యావ్యవస్థ కుప్పకూలాలని ప్రతిపక్ష బీజేపీ, సీపీఎం కోరుకుంటున్నాయా? అని ప్రశ్నించారు. మోసపూరితంగా నియామకాలు పొందిన కొంతమంది వల్ల అభ్యర్థులందరినీ శిక్షించడం ఎందుకని ఆమె ప్రశ్నించారు. 'ఇటీవల ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడినప్పుడు ఆయనను బదిలీతో సరిపుచ్చారు. మరి ఈ ఉపాధ్యాయులను ఎందుకు బదిలీతో సరిపుచ్చరు?' అని మమత అన్నారు.



యాదాద్రి జిల్లా తుర్కపల్లిలోని ఓ తోటలో రాలిన మామిడి కాయలు





కామారెడ్డి జిల్లా బాన్సువాడలో నేలకొరిగిన వరి.. హైదరాబాద్‌లోని మలక్‌పేట రైల్వే బ్రిడ్జి కింద వరద నీటిలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

అకాల వర్షంతో అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థాన్‌నారాయణపురంలో అత్యధికంగా 9.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ ఈదురుగాలులకు భువనగిరి-రాయగిరి రోడ్డులోని మాస్‌కుంట వద్ద చెట్లు కూలి రోడ్డు మధ్యలో పడిపోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట మండలాల్లో వడగండ్ల వర్షానికి మామిడికాయలు నేలరాలాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ధర్పల్లి మండలంలో గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోయాయి. కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, నస్రుల్లాబాద్ తదితర ప్రాంతాల్లో వడగండ్ల వర్షాలు కురువడంతో మొక్కజొన్న, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, పిట్లం, సదాశివనగర్, కామారెడ్డి, రామారెడ్డి మండలాల్లో ఈదురుగాలులకు వరి పంట నేలకొరిగింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో లోతట్టు కాలనీలు జలమయంగా మారాయి. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ మార్కెట్ యార్డులో మక్కలు, పొద్దు తిరుగుడు గింజలు తడిసిముద్దయ్యాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు కొత్తవాడలో చామగడ్డ పంట నీటమునిగింది. జిల్లాలో అనేక చోట్ల కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో విద్యుత్తు స్తంభాలు నేల కూలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ములుగు జిల్లాలో వానకు తోడు గాలులు వీయడంతో మామిడి తోటలకు స్వల్ప నష్టం జరిగింది. అక్కడక్కడ కోతకు సిద్ధమైన వి ఎర్రి పంట తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



అమీర్‌పేటలోని వరద ముంపులో..

పిడుగులు పడి నలుగురి మృతి

వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు నలుగురు మృతి చెందగా.. గోడ కూలి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. నాగర్‌కర్నూలు జిల్లా పదర మండల కేంద్రం శివారులోని కోడొనిపల్లికి చెందిన సుంకరి సైదమ్మ(35), వీరమ్మ(55)లు వేరుశనగ పంట పొలంలో కూలీ పనులకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో భారీ వర్షంతో పాటు పిడుగు పడటంతో అక్కడికక్కడే ఆ ఇద్దరు మృతి చెందారు. మరో కూలీ సుంకరి లక్ష్మమ్మకు తీవ్రగాయాలు కావడంతో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గద్వాల జిల్లా మానవపాడు మండలం చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన బోయ వెంకటేశ్వర్లు (40) పశువులు మేపేందుకు వెళ్లి పొలం వద్ద పిడుగుపాటుకు గురై మరణించాడు. అదే జిల్లా వడ్డేపల్లి మండలం బుడవరులో పశువులకు మేత వేసేందుకు వెళ్లిన హరిజన మహేంద్ర (20) కూడా పిడుగుపాటుకు బలయ్యాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామలో గోడ కూలి ఒకరు మరణించగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కొడంగల్ మండలం ఖాజా అహ్మద్‌పల్లిలో రైతు ఫకీరప్ప 30 గొర్రెలు, మేకలు పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి.

హైదరాబాద్‌లో గంటన్నర పాటు వాన..

ఇటు హైదరాబాద్‌లో దాదాపు గంటన్నర పాటు వాన దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరి జనం అవస్థలు పడ్డారు. రోడ్లపై కి.మీ. మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరూర్‌నగర్, హిమాయత్ నగర్, డబీర్‌పురాలో 8.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మలక్‌పేట రోడ్ అండర్ బ్రిడ్జి కింద వరదలో ఆర్టీసీ బస్సు ఆగిపోవడంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు బస్సు టాప్‌పైకి ఎక్కారు. ఇటు సరూర్‌నగర్ వద్ద మూసీ నదిలోని శివాలయానికి వెళ్లిన ఇద్దరు అక్కడే చిక్కుకున్నారు. అధికారులు స్పందించి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. బౌద్ధనగర్, హబ్సీగూడ, ఖైరతాబాద్‌ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. మింట్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ ముద్రణాలయంలోకి భారీగా వర్షపు నీరు చేరింది. సోమాజిగూడ రవాణా శాఖ కార్యాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడగా.. దాన్ని తొలగించారు. వర్షం ధాటికి చారిత్రక చార్మినార్ కట్టడంలో భాగ్యలక్ష్మి ఆలయం వైపున్న ఓ మినార్ పెచ్చులూడి కిందపడ్డాయి. అయితే సుందరీకరణ నేపథ్యంలో మినార్‌పై వేసిన ప్లాస్టర్ మాత్రమే ఊడిందని.. మరమ్మతులు కొనసాగుతున్నాయని అధికారులు వివరణ ఇచ్చారు. ఇక గ్రేటర్ వ్యాప్తంగా చెట్లు కూలాయని 28, వరద నీరు నిలిచిందని 48 ఫిర్యాదులు వచ్చాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. 2-3 గంటల్లోనే వాటిని పరిష్కరించామని వెల్లడించారు.



హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో స్తంభించిన ట్రాఫిక్

అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు సీఎం ఆదేశం



హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈదురుగాలులు, వడగండ్ల వానలు పడుతున్నందున జిల్లాల కలెక్టర్లు, పోలీసులు అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. వర్షాలు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిల్వకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు, విద్యుత్తు అంతరాయాలు లేకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కలెక్టరేట్లను బాంబులతో పేల్చేస్తాం!

- నాగర్‌కర్నూల్, మల్కాజిగిరి కలెక్టర్లకు బెదిరింపులు
- మావోయిస్టు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు పేరిట ఈ-మెయిల్స్
- బాంబు స్క్వాడ్‌లతో తనిఖీ.. ఏమీ లేదని నిర్ధారణ

నాగర్‌కర్నూల్, మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్, మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్లను బాంబులతో పేల్చేస్తామంటూ వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్స్‌తో ఒక్కసారిగా కలకలం రేగింది. కరీంనగర్‌కు చెందిన మావోయిస్టు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు పేరిట కలెక్టర్లకు ఈ-మెయిల్స్ వచ్చాయి. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ భవనాన్ని గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు పేల్చేస్తామంటూ కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఈ-మెయిల్ వచ్చింది. ఈ విషయాన్ని వెంటనే అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు తెలియజేశారు. తక్షణమే ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్‌లు బాంబు, డాగ్ స్క్వాడ్‌లను పంపగా.. కలెక్టరేట్‌లో అణువణువూ తనిఖీచేసి బాంబులకు సంబంధించిన ఆనవాళ్లు ఏమీలేవని నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అంతకు ముందు బాంబు విషయం కలెక్టరేట్ అంతా తెలియడంతో సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులుతీశారు. కలెక్టర్‌కు ఈ-మెయిల్ పంపిన ఐడీని సైబర్‌క్రైమ్‌కు అప్పగించామని, విచారణ జరిపి నిందితులను అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. కాగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అధికారిక మెయిల్‌కు కలెక్టరేట్‌ను పేల్చేస్తామంటూ బెదిరింపు మెసేజ్ వచ్చింది. అప్రమత్తమైన కలెక్టర్ శామీర్‌పేట పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కలెక్టరేట్‌కు చేరుకుని సిబ్బందిని బయటకు పంపి బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద వస్తువులేమీ కనిపించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. మెయిల్ అడ్రస్ తనిఖీ చేయగా మావోయిస్టు లక్ష్మణ్‌రావు పేరు చూపినట్టు సమాచారం. మెయిల్ చివర్లో 'అల్లాహు అక్బర్' అని కూడా ఉన్నట్లు తెలిసింది.

గురుకులాల్లో ప్రవేశానికి 38,278 మంది అర్హత

- గురుకుల సెట్ -2025 ఫలితాల వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ నిర్వహించిన పరీక్షా ఫలితాలను టీజీసెట్- 2025 చీఫ్ కన్వీనర్ డా వివిఎస్ అలుగు వర్షిణి గురువారం విడుదల చేశారు. గత ఫిబ్రవరి 23న జరిగిన ప్రవేశ పరీక్షకు మొత్తం 84,672 మంది విద్యార్థులు హాజరు కాగా 36,334 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కేటగిరీల విద్యార్థులు అర్హత సాధించారు. రాష్ట్ర గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి 51,408 సీట్లు ఉన్నాయి. ఇప్పటికే 1,944 ప్రత్యేక కేటగిరీ సీట్ల ఫలితాలు ప్రకటించినట్లు వర్షిణి తెలిపారు. మిగతా 13,130 సీట్ల ఫలితాలు దశలవారీగా ప్రకటిస్తామన్నారు.

10 రైళ్లకు టెర్మినళ్ల మార్పు

- సికింద్రాబాద్ స్టేషన్

అభివృద్ధి పనులతో ఎస్‌సీఆర్ నిర్ణయం

హైదరాబాద్‌సిటీ/హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టిన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) కీలక నిర్ణయం తీసుకున్నది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే మరో 10 రైళ్లను తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా ప్రత్యామ్నాయ రైల్వేస్టేషన్లకు మళ్లిస్తున్నట్లు పేర్కొంది. అందులో భాగంగా చర్లపల్లి, కాచిగూడ, హైదరాబాద్, మల్కాజిగిరి రైల్వేస్టేషన్లకు తరలిస్తున్నట్లు తెలిపింది. ఆయా రైళ్లు సదరు రైల్వే స్టేషన్ల నుంచి బయలుదేరతాయని పేర్కొంది. ఆ రైళ్లు వెళ్లే మార్గాల్లో వాటి స్టాపేజీలు యధాతథంగా ఉంటాయని ఎస్‌సీఆర్ సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.

చర్లపల్లి-దానాపూర్ మధ్య 26 ప్రత్యేక రైళ్లు

వేసవిసెలవుల్లో ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో చర్లపల్లి-దానాపూర్ మధ్య ఈ నెల మొదటి వారం నుంచి జూన్ చివరి వారం వరకు 26 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) గురువారం తెలిపింది. ఈ నెల 3 నుంచి జూన్ 29 వరకు దానాపూర్-చర్లపల్లి- దానాపూర్ (03225-03226) రైలు 26 సార్లు నడుస్తుందని పేర్కొంది. ఈరైళ్లు ఆరా, బుక్సర్, పండిట్ డిడి ఉపాధ్యాయ, ప్రయాగ్‌రాజ్ ఛెకి, మణిక్‌పూర్, సత్నా, జబల్‌పూర్, ఇటార్సి నాగ్‌పూర్, బల్లార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, రామగుండం, పెద్దపల్లి, కాజీపేట స్టేషన్లలో ఆగుతాయి.

చంపించింది భార్యే..

వివాహేతర బంధానికి భర్త అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలసి ఘాతుకం

- ఇద్దరి అరెస్టు.. పరారీలో మరో నలుగురు
- వీడిన హెల్త్ సూపర్‌వైజర్ హత్య మిస్టరీ
- కేసు వివరాలు వెల్లడించిన మానుకోట ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తమ వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భార్యే ప్రియుడితో కలిసి ఓ గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చి చంపించింది. ఈ నెల 1న అర్ధరాత్రి మహబూబాబాద్ జిల్లా అయోధ్య గ్రామపరిధిలోని భజనతండా సమీపంలో జరిగిన హెల్త్‌సూపర్ వైజర్ తాటి పార్థసారథి హత్య మిస్టరీ వీడింది. ఆయన భార్య స్వప్న, ఆమె ప్రియుడు వెంకట విద్యాసాగర్ కలిసి ఆయనను చంపించినట్టు పోలీసులు తేల్చారు. గురువారం ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. ఆ వివరాల మేరకు.. భద్రాచలంలోని జగదీశ్ కాలనీకి చెందిన తాటి పార్థసారథి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలోని జ్యోతిరావుపూలే పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే అద్దె ఇంట్లో ఉంటూ విధులకు హాజరవుతున్నారు. ఆయన భార్య స్వప్న, పిల్లలు భద్రాచలంలో ఉంటున్నారు. మరోవైపు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగికి చెందిన సోర్లాం వెంకట విద్యాసాగర్ కూడా భద్రాచలంలో ఉంటూ ఎటపాక మండలం నెల్లిపాకలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. స్వప్నకు, విద్యాసాగర్‌కు మధ్య తొమ్మిదేళ్లుగా వివాహేతర బంధం కొనసాగుతోంది. ఈ విషయంలో పలుమార్లు పార్థసారథి, స్వప్న దంపతుల మధ్య గొడవలు, పంచాయతీలు జరిగాయి. దీంతో పార్థసారథిని అడ్డుతొలగించుకోవాలని స్వప్న, విద్యాసాగర్ నిర్ణయించుకున్నారు. గతంలోనే ఓసారి హత్యకు విఫలయత్నం చేశారు.

సుపారీ ఇచ్చి.. ప్లాన్ చేసి..

తాజాగా మరోసారి పార్థసారథి హత్యకు పన్నాగం పన్నారు. కొత్తగూడెంకు చెందిన తెలుగూరి వినయ్‌కుమార్, శివశంకర్, ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాకకు చెందిన వంశీ, రాజమండ్రి జిల్లా జడ్డంగికి చెందిన కుసం లవరాజ్‌లకు హత్య కోసం రూ.5 లక్షలు సుపారీ ఇచ్చారు. పార్థసారథి ఈ నెల 31న సాయంత్రం తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లికి వెళుతుండగా.. వారు భజనతండ శివార్లలో కాపుకాసి దాడి చేశారు. వెంటపడి వేటాడి ఇనుప రాడ్లతో తలపై కొట్టి హత్యచేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. స్వప్న, విద్యాసాగర్‌లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్నవారిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు.

బాటసింగారంలో బర్డ్‌ఫ్లూ సోకిన

10వేల కోళ్లను చంపేశారు!



కోళ్లను చంపేస్తున్న పశువైద్యాధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామ పరిధిలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో బర్డ్‌ఫ్లూ సోకిన 10 వేల కోళ్లను గురువారం జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారుల బృందం చంపేసింది. అనంతరం వాటిని సంచుల్లో వేసి లోతుగా తవ్విన గుంతలో పాతిపెట్టారు. సదరు ఫామ్‌లో సుమారు 36 వేల కోళ్లు ఉండగా ఇప్పటికే కొన్ని బర్డ్‌ఫ్లూతో చనిపోయాయి. మిగిలిన 17,500 కోళ్లలో గురువారం 10వేల కోళ్లను అధికారులు చంపేశారు. మిగిలిన వాటిని శుక్రవారం చంపేసి పాతిపెట్టనున్నట్లు తెలిపారు. ఈ ఫామ్‌కు సమీపంలోని ఫామ్‌లలో కోళ్ల శాంపిల్స్ సేకరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాబుబేరీ మాట్లాడుతూ.. సమీపంలోని పౌల్ట్రీఫామ్ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని, ప్రతి రోజూ ఫామ్ చుట్టూ శానిటైజేషన్ చేయాలని సూచించారు. కోళ్లు మృత్యువాత పడితే వెంటనే తమకు సమాచారమివ్వాలన్నారు.

ఏపీలో ఆ కోళ్లు బర్డ్‌ఫ్లూతోనే చనిపోయాయి: కేంద్రం

అమరావతి, (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కాకినాడ జిల్లా చెందుర్తి, పిఠాపురం ఫారాల్లోని కోళ్లు బర్డ్‌ఫ్లూ వైరస్ వల్లే చనిపోయినట్లు నిర్ధారణ అయింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏపీకి అధికారిక సమాచారం వచ్చింది. ఇదే విషయాన్ని కేంద్రం గెజిట్‌లో ప్రచురించింది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

సుంకాల ప్రకోపాలు

ప్రపంచంతో అమెరికా అధ్యక్షుడు చేస్తున్న వాణిజ్యయుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. జానపదచిత్రాల్లో ఒకరు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగిస్తే ఎదుటివారు వారుణాస్త్రాన్ని వాడినట్టుగా ఉంది ఈ ప్రతీకార సుంకాల యుద్ధం. ఏప్రిల్ ఒకటిన తాను ఈ కార్యక్రమాన్ని చేపడితే ఏప్రిల్ ఫూల్ అనుకుంటారని సందేహం కలిగి ఈ కక్షతీర్చుకొనే కార్యక్రమాన్ని మర్నాటికి వాయిదావేశారు. ఆహాఓహో అంటూ చప్పట్లు కొట్టే ఓ బృందాన్ని పక్కనపెట్టుకొని, 'లిబరేషన్ డే' పేరిట ఇప్పుడు ఆయన నిర్వహించిన కార్యక్రమాన్ని చూస్తున్నవారికి ట్రంప్ ఎలా కనిపించారో తెలియదు మరి. దేశాల పేర్లన్నీ అక్షరక్రమంలో రాసుకొచ్చి, స్కూలు టీచరు మార్కులు వేస్తున్నట్టుగా ఒక్కోదేశానికీ సుంకాలశాతం నిర్ణయించారు. మిత్ర, శత్రు భేదం లేకుండా ప్రతీకారం తీర్చుకున్నారు. పేదదేశాలనూ మోదేశారు, పెంగ్విన్‌లు నివసించే దీవులమీద కూడా పదిశాతం వడ్డించారు.

గతపాలకుల కుట్రలు నిర్లక్ష్యం కారణంగా రోగానపడిన దేశాన్ని ఈ చర్యతో ఉద్ధరించానని ట్రంప్ చెప్పుకున్నారు. దేశం ఆర్థికంగా కళకళలాడుతుందని, పారిశ్రామికంగా పరుగులుపెడుతుందని, తయారీరంగం ఎదిగి ఉద్యోగ ఉపాధులు వెల్లివిరుస్తాయని గొప్పలకు పోయారు. ప్రత్యక్షయుద్ధాల తరువాత యావత్ ప్రపంచాన్ని తీవ్రంగా కుదిపేస్తున్న ఈ వాణిజ్యయుద్ధంలో అభివృద్ధిచెందుతున్న దేశాలు ప్రధానంగా బలికావచ్చు. ఆపరేషన్ ముగిసింది, రోగి మరింత ఆరోగ్యంగా ఉన్నాడని ట్రంప్ ఈ కార్యక్రమం అనంతరం గొప్పలకు పోయారు కానీ, అమెరికా ఆర్థికవ్యవస్థకు ఈ నిర్ణయం అత్యంత కీడు చేకూర్చబోతున్నదని విశ్లేషకుల అంచనా. అసత్యాలు, అర్థసత్యాలతో, పునరుజ్జీవం వంటిమాటలతో ఆయన ప్రజలను మభ్యపెడుతున్నారని, మాంద్యంవైపు దేశాన్ని నెట్టేస్తున్నారని విమర్శలు తీవ్రమైనాయి. ఈ సుంకాల శాతాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించారన్న ప్రశ్నలూ వినబడుతున్నాయి. సుంకాల్లో తేడా బట్టికాక, ప్రధానంగా ఆయాదేశాలతో ఉన్న వాణిజ్య లోటు ఆధారంగా ఈ రేట్ల నిర్ణయం జరిగినట్టు కొందరి అనుమానం. పరస్పర ఆధారిత ప్రపంచ ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తూ, అమెరికాను ఉన్నతంగా నిలబెడతానంటున్న ట్రంప్ తమను నరకంవైపు నడుపుతున్నాడని అమెరికన్లకు అర్థంకావడానికి కొంతసమయం పడుతుంది. వారికి కర్తవ్యం బోధపడేవరకూ మిగతా ప్రపంచం ట్రంప్ దూకుడు భరించక తప్పదు.

మోదీ మంచిమిత్రుడే కానీ, మనలను సరిగా చూడడం లేదంటూ ట్రంప్ ఎప్పటిలాగానే అదే ఆరోపణచేశారు. ఆయన ఏదో హడావుడిలో 26 అన్నారు గానీ, భారత్‌మీద 27శాతం టారిఫ్ విధించినట్టు వైట్‌హౌస్ తరువాత సరిదిద్దింది. చాలాదేశాల విషయంలో ఇదే గందరగోళం. ఇక, సుంకాలదెబ్బనుంచి మన ఫార్మారంగాన్ని మినహాయించడం అమెరికాకు అత్యవశ్యకం కావచ్చుగానీ, అత్యధిక ఎగుమతులు జరుపుతున్న ఇక్కడి జనరిక్ ఔషధరంగానికి ఊరటనిచ్చే అంశం. చైనా, వియత్నాం, థాయిలాండ్, బంగ్లాదేశ్ వంటి దేశాల మీద ట్రంప్ అత్యధికటారిఫ్‌లు విధించడం మనకు టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ తదితర కొన్ని కీలక రంగాల్లో ఆధిపత్యం పెంచుకోవడానికి కొత్త అవకాశమని కొందరి విశ్లేషణ. సెమీకండక్టర్లలో అగ్రగామిగా ఉన్న తైవాన్‌కు ట్రంప్ పెట్టిన వాతను మనకు అనుకూలంగా మార్చుకోవడం ఎలా? అన్న చర్చలూ నడుస్తున్నాయి. అయితే, లబ్ధి అందిపుచ్చుకోగలిగే స్థితిలో మనం ఉన్నామా అన్నది ప్రశ్న. మౌలిక సదుపాయాల్లో భారీ పెట్టుబడులు, గరిష్ఠ ఉత్పత్తి స్థాయి ఇత్యాది అంశాలమీద సదరు ప్రయోజనం ఆధారపడివుంటుంది.

ట్రంప్ టారిఫ్‌లతో అన్నిరంగాలు దెబ్బతింటాయని, ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అవుతుందని విపక్షనేత రాహుల్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, ఇంకా సాగిలబడుతూనే ఉంటారా, ఇకనైనా నిలబడతారా? అని ఓ ప్రశ్నవేశారు. ట్రంప్‌తో వ్యవహరించడం ఎలా? అన్నది మోదీని చూసి నేర్చుకోవాలని అమెరికా పెద్దలు, మీడియా వ్యాఖ్యాతలు ఇటీవలే ఓ వ్యాఖ్య చేశారు. ట్రంప్‌తో తొలిభేటీకి ముందే భారతదేశం ఇంధనాలు, ఆయుధాల కొనుగోలు వంటి పలు నిర్ణయాలతో ఆయనను ప్రసన్నం చేసుకుంది. విస్కీనుంచి విలాసవంతమైన కార్లవరకూ పన్నులు తగ్గించి మస్క్‌ను సైతం మచ్చిక చేసుకుంది. ముందుగానే వాణిజ్యచర్చలు ఆరంభించి, ఈ ఏడాది చివర్లోగా ద్వైపాక్షిక ఒప్పందానికి మార్గం సుగమం చేసుకుంది. ఆ ఒప్పందంలో మనం నిటారుగా నిలబడి స్వప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించగలమా అన్నది ప్రధానం. ప్రస్తుతానికి సుంకాల యుద్ధంనుంచి తప్పించుకోలేకపోయినా, త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయని, ఇతరత్రా ప్రయోజనాలు, అవసరాల రీత్యా భారత్‌తో ట్రంప్ లెక్కలు వేరుగా ఉంటాయని ఆశించాలి.

ధరిత్రికి ట్రంప్ తాపం!


'ఇది శక్తి పరివర్తన (శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధన వనరులపై ఆధారపడడానికి మారడం)కు సమయం కాదు, ఇది శక్తి జోడింపు (కొత్త ఇంధన వనరులు, సాంకేతికతల అభివృద్ధి)కు తరుణమిది' అని అమెరికా ఇంధన శాఖ కార్యదర్శికి క్రిస్ రైట్ ఉద్ఘాటించారు. గత నెల హ్యూస్టన్‌లో ఒక అంతర్జాతీయ ఇంధన సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. ఇంధన కంపెనీల అధిపతులు ఆ రంగ నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఆ వార్షిక అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న నాకు మన ప్రపంచం మారిపోయిందన్న వాస్తవం అవగతమయింది. అయినప్పటికీ వాతావరణ మార్పును తిరస్కరిస్తున్న విధానాలు ఎందుకు ప్రాబల్యం పొందుతున్నాయో అర్థం చేసుకోవలసి ఉన్నది. విధ్వంసకర వాతావరణ మార్పు ప్రభావాలను అరికట్టేందుకు శ్రద్ధ చూపకపోతే మానవాళి భవిష్యత్తు ఏమిటి? ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న విపత్కర వాతావరణ వాస్తవాలను గుర్తించకుండా ఊహాలోకంలో ఉండిపోతే ఎలా? ట్రంప్ ప్రభుత్వ ఇంధన విధానం అమెరికా, ఇతర సంపన్న పాశ్చాత్య సమాజాలలో గానీ, అభివృద్ధి చెందుతున్న దేశాల సమాజాలలో గానీ భారీ మార్పులకు దారితీయదు.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

అమెరికా విధానాలలో మార్పుకు కారణాలు ఏమిటి? మొదటిది అమెరికా ప్రభుత్వం 36 లక్షల కోట్ల డాలర్లకు పెరగడం. రక్షణ రంగంపై చేస్తున్న వ్యయాల కంటే వడ్డీ చెల్లింపులకే ఎక్కువగా ఖర్చు చేయవలసివస్తోంది! ఈ ఇబ్బంది నుంచి బయటపడేందుకు మార్గం పునః పారిశ్రామికీకరణే గానీ పారిశ్రామిక కార్యకలాపాలను, సామర్థ్యాన్ని తగ్గించుకోవడం ఎంత మాత్రం కాదని క్రిస్ రైట్ స్పష్టం చేశారు. ఈ కారణంగా ఆన్ షోర్ తయారీ (దేశంలోనే సరుకులను ఉత్పత్తి చేయడం)కి అగ్ర ప్రాధాన్యమిస్తున్నారు. మరి దేశంలో పెరిగే పారిశ్రామిక కార్యకలాపాలకు మరింత అధికంగా విద్యుత్ అవసరమవుతుంది. రెండో కారణం అనేక కొత్త రంగాలలో చైనా అగ్రగామిగా పురోగమించడం. సరఫరా గొలుసుల నుంచి విద్యుత్ వాహనాలను ఉత్పత్తి చేయడం, సౌర శక్తి ఉత్పాదనలోను చైనా తిరుగులేని రీతిలో అగ్రగామిగా ఉన్నది. కృత్రిమ మేధ రంగంలో ఆధిపత్య పోటీలో ఎట్టి పరిస్థితులలోను చైనాకంటే వెనుకబడి పోకూడదని ట్రంప్ ప్రభుత్వం సంకల్పించుకున్నది. మరి ఈ పోటీలో నెగ్గాలంటే ఇంధన సాంద్ర డేటా సెంటర్‌లను ఇంతకు ముందు కంటే మరింత వేగవంతంగా నిర్మించుకోవలసి ఉన్నది. అమెరికాలో ఇప్పుడు 5000 డేటా సెంటర్‌లు ఉన్నాయి. ఇవి అమెరికాలోని మొత్తం గ్రిడ్ –ఆధారిత విద్యుత్‌లో 3 శాతాన్ని వినియోగించుకుంటున్నాయి. ఈ విద్యుత్ వినియోగం త్వరలోనే మరింత భారీ స్థాయిలో పెరిగిపోయే అవకాశమున్నది. ఈ దశాబ్దం తుది సంవత్సరాల నాటికే డేటా సెంటర్‌లు వినియోగించుకునే విద్యుత్ 8 నుంచి 12 శాతం మేరకు పెరిగిపోయే అవకాశమున్నది. ఇందుకు విద్యుదుత్పత్తిని గణనీయంగా పెంచవలసిన అవసరమున్నది.



మానవాళికి వాతావరణ మార్పు విపత్తును నివారించాలంటే ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉండాలి. శిలాజ ఇంధనాలను అత్యధికంగా వినియోగించుకోవాలనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ విధానంతో ఆ లక్ష్యం నెరవేరడమనేది దాదాపుగా అసాధ్యం.

మరి విద్యుదుత్పత్తిని భారీ స్థాయిలో పెంచేందుకు వనరులు ఏమిటి? విద్యుత్ సరఫరాకు సౌర శక్తి, పవనశక్తి మొదలైన పునరుత్పాదక వనరులపై ఆధారపడే ప్రసక్తే లేదని ట్రంప్ ప్రభుత్వం తెగేసి చెప్తోంది. అమెరికాకు అవసరమైన విద్యుత్‌లో కేవలం 3 శాతాన్ని మాత్రమే పునరుత్పాదక వనరుల ద్వారా సమకూరుతుందని క్రిస్ రైట్ చెప్పారు. ఆ తరహా విద్యుదుత్పత్తికి భారీ పెట్టుబడులు పెట్టినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని కూడా ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో శక్తి పరివర్తన అనేది జరిగేది కాదని ఆయన ముక్తాయించారు. అయితే గత ఏడాది అమెరికాలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పాదన అధిగమించింది. అమెరికాకు అవసరమైన విద్యుత్‌లో 15 నుంచి 17 శాతం మేరకు పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా ఉత్పత్తి అవుతోంది.

ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టకముందు అధికారంలో ఉన్న జోబైడెన్ ప్రభుత్వం దూరదృష్టి లేకుండా వాతావరణ మార్పును నిరోధించేందుకు ప్రాధాన్యమిచ్చి అందుకనుగుణమైన ఇంధన విధానాలను అనుసరించిందని, ఈ కారణంగానే విద్యుత్ వ్యయం భారీగా పెరిగిపోయిందని ట్రంప్ ప్రభుత్వ అధికారులు విమర్శిస్తున్నారు. విద్యుదుత్పత్తికి శిలాజ ఇంధనమైన సహజ వాయువును గరిష్ఠంగా వినియోగించుకోవాలని ట్రంప్ ప్రభుత్వం సంకల్పించింది (బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని కూడా విరివిగా చేపట్టే ఆలోచన కూడా చేస్తున్నారు). మరి సహజ వాయువును విద్యుదుత్పత్తికి వినియోగించుకోవడమంటే హరిత గృహ వాయువుల ఉద్గారాలు పెరిగిపోవడం ఖాయం. అయితే కార్బన్ మోనాక్సైడ్ (పరిసరాలను కలుషితం చేసే వాయువు)లా కార్బన్ డై ఆక్సైడ్ కాదని కాలుష్యకారక వాయువు కాదని క్రిస్ రైట్ అన్నారు. ఒకటి మాత్రం వాస్తవం: అమెరికా ప్రణాళికలలో వాతావరణ మార్పును నిరోధించేందుకు ప్రాధాన్యం లేదు.

సహజ వాయువును పెద్ద ఎత్తున ఎగుమతి చేసే యోచనలో ట్రంప్ ప్రభుత్వమున్నది. దీని వల్ల భారత్ లాంటి దేశాలలో విద్యుదుత్పత్తికి బొగ్గు బదులు సహజ వాయువు వినియోగం అధికమవుతుందని, తద్వారా కాలుష్యకారక వాయు ఉద్గారాలు తగ్గతాయని, వాతావరణ మార్పును అరిట్టేందుకు దోహదం జరుగతుందని ట్రంప్ ప్రభుత్వ అధికారులు వాదిస్తున్నారు (బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిలో కంటే సహజవాయువు ఆధారిత విద్యుదుత్పత్తిలో ఉద్గారాలు తక్కువగా ఉంటాయి). సహజవాయువు ఉత్పత్తి, వినియోగం ద్వారా మిథేన్ ఉద్గారాలను తగ్గించేందుకు పెట్టుబడులు పెట్టే విషయం కూడా పరిశీలనలో ఉన్నది. అయితే ట్రంప్ ప్రభుత్వంలో వాతావరణ మార్పునిరోధాన్ని గట్టిగా పట్టించుకునే అధికారి ఒక్కరూ లేరు అన్నది వాస్తవం. అణు విద్యుదుత్పత్తిని ఇతోధికంగా పెంచే విషయమై అమెరికా మళ్లీ దృష్టి కేంద్రీకరిస్తోంది. ఉదజని విద్యుత్ (హైడ్రోజన్ పవర్)ను అభివృద్ధిపరుచుకునే ప్రణాళికలు ఏవీ సఫలం కాలేదు. దీంతో బ్రౌన్ ఎనర్జీపై ఆధారపడడానికి ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించుకున్నది.

ఇక్కడే అసలు సమస్య ఉంది. 2030 సంవత్సరం నాటికి తమ హరిత గృహ వాయువుల ఉద్గారాలను 50 శాతం మేరకు తగ్గిస్తామని అమెరికా హామీ ఇచ్చింది. ఆ హామీ సంగతి ఏమోగానీ అమెరికాలో ఆ ఉద్గారాలు మరింతగా పెరిగిపోయే అవకాశం స్పష్టంగా ఉన్నది. దీనివల్ల గ్లోబల్ కార్బన్ బడ్జెట్‌లో అమెరికా వాటా మరింతగా పెరిగిపోవడం ఖాయం. నిజానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని అమెరికా లాంటి దేశాలు సత్వరమే పూర్తిగా తగ్గించుకోవాలి. అందుకు మారుగా వాటి వినియోగాన్ని మరింతగా పెంచుకోవడానికి అమెరికా సంసిద్ధమయింది. మానవాళికి వాతావరణ మార్పు విపత్తును నివారించాలంటే ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉండాలి. అమెరికా బ్రౌన్ ఎనర్జీ విధానంతో ఆ లక్ష్య సాధన దాదాపుగా అసాధ్యం. ముంచుకువస్తోన్న ప్రమాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలనే నేను ఇది రాస్తున్నాను. వాస్తవాలను విస్మరించి గాలి మేడలు కట్టుకోకూడదు. చారిత్రకంగా గరిష్ఠంగా కాలుష్యకారక వాయు ఉద్గారాలకు, ఏటా హరిత గృహ వాయువుల ఉద్గారంలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న అమెరికా బ్రౌన్ ఎనర్జీ విధానం (శిలాజ ఇంధనాలను అత్యధికంగా వినియోగించుకోవడం) పర్యవసానాలు భయానకంగా ఉంటాయి.. మనం ఏమి చేయాలి?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఆ 'నల్లదనం'లో విశ్వ సౌందర్యం

'నాకు నాలుగేళ్ల వయసులో, నన్ను మళ్లీ గర్భంలోకి పంపించి, నలుపు రంగు తీసేసి తెల్లగా, అందంగా మార్చగలవా అని మా అమ్మను అడిగాను. నల్ల రంగులో పుట్టకపోవడమే మంచిది అన్న అభిప్రాయాలను వింటూనే నా జీవితంలో యాభై సంవత్సరాలు గడిపేశాను'– తన శరీర ఛాయపై ఒక అవమానకరమైన వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కేరళ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శారదా మురళీధరన్ ఒక సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్‌లోని వ్యాఖ్య అది. ఒక ఉన్నత పదవిలో ఉన్న ఆ విద్యావతి వ్యాఖ్య మన ప్రజాసంస్కృతిలో ఒక ప్రాముఖ్యం గల సందర్భం. కోట్లాది భారతీయ మహిళల (చాలా మంది పురుషుల) మనసులోని మూగవేదన, నిత్య జీవితంలో అనుభవిస్తున్న బాధలు, యాతనలను గుండె లోతుల్లోంచి వచ్చిన మాటల్లో శారద వ్యక్తం చేశారు. ఇటువంటి బాధాకర విషయాన్ని అంగీకరించేందుకు మీకు మనోబలం ఉండాలి. ఆ సత్యాన్ని బహిరంగంగా చెప్పేందుకు మీకు ధైర్యముండాలి. అందుకు మీకు విశేష అధికారం, మాట్లాడగల శక్తి, చెప్పిన దాన్ని వింటారనే భరోసా మీకు ఎంతైనా అవసరం. అటువంటి మానసిక క్లేశానికి గురయినవారు ఆ వ్యాకులత నుంచి విముక్తి పొందగలరనడానికి శారద వ్యాఖ్యలే తార్కాణం.

కచ్చితంగా 65 సంవత్సరాల క్రితం (మార్చి 1960లో) రామ్ మనోహర్ లోహియా 'స్కిన్ కలర్ అండ్ బ్యూటీ' (చర్మం రంగు, అందం) అన్న ఒక అసాధారణ వ్యాసాన్ని రాశారు. 'రంగు నిరంకుశత్వం'పై విమర్శకు పథనిర్దేశం చేసిన రచన అది. స్త్రీ అందాన్ని శ్వేత వర్ణంతో ముడిపెట్టే ఆలోచనా ధోరణులను బద్దలు చేసేందుకు లోహియా ఆ వ్యాసం ద్వారా ప్రయత్నించారు: 'ప్రేమించే మహిళ, ప్రేమించబడే మహిళ నల్లగా ఉన్నా లేదా తెల్లగా ఉన్నా నక్షత్ర కాంతిమయమైన ఆకాశం సౌందర్యంతో ప్రకాశిస్తుంది' అని ఆయన అన్నారు. సోషల్ మీడియాలో శారద పోస్టును, లోహియా వ్యాసంతో కలిపి చదివినప్పుడు తెల్ల చర్మం కోసం వెర్రి ఆరాటం అంత తేలికైన వ్యవహారం కాదని నాకు అర్థమయింది. చర్మం రంగు నల్లగా ఉన్నవారిపై దురభిప్రాయాలు మన కాలంలో ఇంకా ప్రబలంగా ఉన్న సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల స్వభావాన్ని అర్థం చేసుకునేందుకు తోడ్పడుతాయి. శరీర ఛాయపై ఈ చర్చలోని చాలా అంశాలను ఇటీవల ఒక విద్వత్ గ్రంథం 'The Routledge Companion to Beauty Politics' ప్రస్తావించింది. Maxine Leeds Craig ఆ గ్రంథం ప్రారంభ వాక్యాలలోనే ఆ అంశాలను ఇలా సంక్షేపించారు: 'అందం రాజకీయ సంబంధమైన వ్యవహారమే. విజేతలు కోరుకునే బహుమానమది. కురూపితనం అనేది సామాజికంగా ఉన్నతస్థాయిలో ఉన్నవారు తమ ఆధిక్యతను, తమకంటే తక్కువ వారు అని భావిస్తున్న వర్గాలపై ప్రయోగించే ఆయుధం'. సౌందర్యాత్మక తీర్పుపై ఇటువంటి రాజకీయ అభిప్రాయాన్నే లోహియా వ్యక్తం చేశారు: రాజకీయాలు సౌందర్యాత్మకతను ప్రభావితం చేస్తాయి; అధికారం సైతం, ముఖ్యంగా పోటీలేని అధికారం చాలా అందంగా కనిపిస్తుంది'.

'నల్లదనంపై దరభిప్రాయాలు' అని శషభిషలు లేకుండా తాను పేర్కొన్న దృగ్విషయంపై శారద వ్యాఖ్యలు స్పష్టంగా ఎత్తి చూపాయి. 'పక్షపాతం కేవలం నలుపునకు వ్యతిరేకంగా మాత్రమే కాదు...



akbar

రంగు నిరంకుశత్వానికి ప్రతిఘటన..వలసవాద, జాత్యహంకార, జెండర్, కుల ప్రాతిపదిక, ప్రాంతీయ పెత్తనం... మొదలైన రూపాలలోని అన్యాయాన్ని ప్రశ్నించేందుకు దారి తీస్తుంది. రంగు వివక్షను ధైర్యంగా ఎదుర్కోవడం విముక్తి రాజకీయాలకు అత్యావశ్యకం. నలుపులోని స్వాభావిక అందం, విభిన్న లక్షణాలను గుర్తించి, అభినందించడం, ప్రోత్సహించడం ద్వారా ఆ విమోచన పోరాటం ప్రారంభమవ్వాలి.

చర్మం నల్లగా ఉండడం గురించి, అదేదో సిగ్గుపడాల్సిన విషయంలా.. నలుపు కేవలం ఒక రంగు కాదు, నలుపు అనేది మంచిది కాదు, నలుపు చల్లని నిరంకుశత్వం, ఒక గాఢాంధకారం' అని ఆమె అన్నారు. ఎటువంటి రూపకాలంకారాలకు పోకుండా శుద్ధ నల్లదనాన్ని ఆమె అంగీకరించారు. సొంతం చేసుకున్నారు. 'నేను నల్లదనాన్ని తవ్వుతున్నాను' (ఐ డిగ్ బ్లాక్) అని ఆమె వ్యాఖ్యానించారు. ఇది అమెరికన్ నల్లజాతి ప్రజల పోరాట సంస్కృతి స్ఫూర్తితో చేసిన వ్యాఖ్య. అమానుష అణచివేతకు వ్యతిరేకంగా నిరసనలు ఎల్లప్పుడూ బాహ్య సమాజాల నుంచి ఉత్తేజం పొందడం కద్దు. అమెరికా నల్లజాతి ప్రజల నిరసనోద్యమాలను లోహియా పూర్తిగా సమర్థించారు. ఆ ఉద్యమకారులకు ఆయన స్నేహితుడు. అమెరికాలో జాతిపరమైన చీలికలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనలో పాల్గొని ఆయన అరెస్ట్ అయ్యారు. ఒక విరుద్ధ వాస్తవాన్ని వెల్లడించేందుకు ఆయన నేరుగా నీగ్రో (అప్పటికి ఇంకా వాడుకలో ఉన్న మాట)ను ప్రస్తావించారు: ఆఫ్రికా నీగ్రోలు యూరోపియన్ శ్వేత జాతీయులవలే ప్రపంచాన్ని పరిపాలించినట్టయితే స్త్రీ అందచందాలకు సంబంధించిన ప్రమాణాలు నిస్సందేహంగా భిన్నంగా ఉండేవి'. కవులు, వ్యాసకర్తలు నీగ్రో మృదువైన చర్మం గురించి సౌందర్యాత్మక పెదవులు, ముక్కు గురించి మాట్లాడేవారు'.

'నల్ల రంగులో పుట్టకపోవడమే మంచిది అన్న అభిప్రాయాలను వింటూనే నా జీవితంలో యాభై సంవత్సరాలు గడిపేశాను' అని శారద వ్యాఖ్యానించారు. 'నల్ల రంగులో ఉండే స్త్రీలు ఎలా వ్యాకులత, ఆత్మన్యూనతా భావంతో పెరుగుతారో' లోహియా మనకు గుర్తుచేశారు. ఒక సర్వవ్యాపక వాస్తవాన్ని గుర్తించేందుకు వారు చెప్పిన విషయాలు మనకు తోడ్పడుతాయి. సమాజంలో ప్రబలంగా ఉన్న అభిరుచులకు మార్కెట్‌లే మంచి కొలమానాలు. ముఖ్యంగా వివాహ వేడుకలకు సంబంధించిన వస్త్రాలు, ఆభరణాలు; అందాన్ని ఇనుమడించే ఉత్పత్తుల మార్కెట్లు అందుకు నిదర్శనాలు. భారతదేశ చర్మ సౌందర్య ఉత్పత్తులలో సగం స్కిన్ –వైట్నెర్సే కావడం గమనార్హం. వీటి విలువ వార్షికంగా 35 నుంచి 40 వేల కోట్ల రూపాయల మేరకు ఉంటుంది. ఇది ఏటా 6శాతం చొప్పున పెరుగుతుంది. అందంగా ఉన్నది ఏదైనా ఒక సానుకూలతను సంతరించుకుంటున్నది. నల్లదనానికి అన్నీ విరుద్ధాలే. నలుపుపై దురభిప్రాయాలు మన ప్రజాసంస్కృతిలో పూర్తిగా ఇంకిపోయి ఉన్నాయి. బ్లాక్ డేస్, బ్లాక్ బ్యాడ్జెస్... చివరకు రైతులు వ్యతిరేకించిన చట్టాలను నల్ల చట్టాలుగా పేరు పొందాయి. రంగు ప్రాతిపదిక అణచివేత సమగ్ర స్వభావాన్ని గుర్తించడం మనం వేయవలసిన తదుపరి అడుగు. నలుపుపై దురభిప్రాయాలు అధికారంలో వేళ్లూనుకున్న సాంస్కృతిక, సామాజిక వ్యవస్థలు, సంప్రదాయాలలో ఉన్నాయని లోహియా గుర్తించారు.

భారతీయ సమాజంలో ఈ వివక్ష మరో రెండు విధాలుగా కూడా వ్యక్తమవుతోంది: కుల అసమానతలు, దక్షిణ భారతావనిపై ఉత్తర భారతదేశ ఆధిపత్యం. అలా రంగు నిరంకుశత్వానికి ప్రతిఘటన వలసవాద, జాత్యహంకార, జెండర్, కుల ప్రాతిపదిక, ప్రాంతీయ పెత్తనం... మొదలైన రూపాలలోని అన్యాయాన్ని ప్రశ్నించేందుకు దారి తీస్తుంది. రంగుపరమైన వివక్షను ధైర్యంగా ఎదుర్కోవడం విముక్తి రాజకీయాలకు అత్యావశ్యకం. నలుపులోని స్వాభావిక అందం, విభిన్న లక్షణాలను గుర్తించి, అభినందించడం, ప్రోత్సహించడం ద్వారా ఆ విమోచన పోరాటం ప్రారంభమవ్వాలి. ఒక దశాబ్దం క్రితం నటి నందితాదాస్ 'బ్లాక్ ఈజ్ బ్యూటిఫుల్' అనే ఉద్యమాన్ని నిర్వహించారు. నలుపు రంగుపై ప్రజల చైతన్యశీలతను మార్చివేసేందుకు ఉద్దేశించిన ఆ సాహసోపేత ప్రయత్నం స్వల్పకాలం మాత్రమే కొనసాగింది.



■ యోగేంద్ర యాదవ్

తన నల్ల వారసత్వాన్ని ఘనంగా చెప్పుకునేందుకు శారద చాలా సంతోషిస్తున్నారు. 'నలుపు అనేది దేనినైనా గ్రహించగల రంగు. అది మానవ నాగరికతకు తెలిసిన అత్యున్నత శక్తి ప్రవాహం. ఇది అన్ని చోట్లా ఉంటుంది. అది కాటుక విశిష్టత, వానజల్లు వాగ్దానం'. ఈ నలుపు వేడుకలో లోహియా కూడా శారదతో పాటు తప్పక పాల్గొనేవారు: 'జీవితం, సృష్టి మార్మికత, మత్స్య నయనాల సొగసు, గజ గమనం, సంధ్యాసమయంలోని సౌందర్యం మొదలైనవి నల్ల చర్మపు మరింత శోభాయమానమైన అంశాలు' అని ఆయన అన్నారు. అటువంటి ఉత్సవం ఒక రాజకీయ ప్రతిఘటనా చర్య.

మరి ఈ ప్రతిఘటనా రాజకీయాల భవిష్యత్ ఏమిటి? లోహియా తన వ్యాసాన్ని రాసి ఆరున్నర దశాబ్దాలు గడచిపోయాయి; నటి నందితాదాస్ 'డార్క్ ఈజ్ బ్యూటిఫుల్' ఉద్యమాన్ని నిర్వహించి దశాబ్దంకు పైగా గడచిపోయింది. ఏమైనా మార్పు సంభవించిందా? లేదు. వాటి ప్రభావమేమీ లేదు. అయినప్పటికీ శారద తన బిడ్డల గురించి చేసిన ప్రస్తావనలో ఒక ఆశాభావం ఉన్నది: వారు తమ నల్ల వారసత్వాన్ని గొప్పగా భావించారు, చెప్పుకున్నారు. నేను అందాన్ని చూడని ప్రదేశాలలో వారు సౌందార్యాన్ని కనుగొన్నారు. నలుపు మహత్తర రంగు అని వారు భావించారు. దాని శోభకు వారు ఆనందపడ్డారు. ఆ రంగులో నేను సౌందర్యాన్ని చూసేందుకు నాకు తోడ్పడ్డారు. ఆ నలుపు అందమైనది. ఆ నలుపు ప్రకాశవంతమైనది. నేను ఆ నలుపును తవ్వుతున్నాను'. ఈ వ్యాఖ్యల ద్వారా ఆమె రంగుల ప్రమాణాలను సవాల్ చేశారు. అందాన్ని మూల్యాంకనం చేయడంలో ఒక 'సౌందర్యాత్మక విప్లవం' రావాలని లోహియా ఆకాంక్షించారు. అటువంటి విప్లవంతో 'రాజకీయ, ఆర్థిక విప్లవాల మాదిరిగా ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛా పవనాలు వీస్తాయని, మనుషులలో అంతరంగిక శాంతి ఏర్పడుతుందని' ఆయన విశ్వసించారు.

అటువంటి విప్లవానికి మార్గమేమిటి అన్నది స్పష్టంగా తెలియదు. అది కచ్చితంగా సంకుచిత పార్టీ ఆధారిత సంకుచిత రాజకీయ మార్గం కాదని మనకు తెలుసు. అటువంటి విప్లవాత్మక రాజకీయాలు సాంస్కృతిక రాజకీయాలు అవుతాయి. జన మాధ్యమాలు పోత్సహిస్తున్న 'అందం' సంస్కృతిని సవాల్ చేస్తాయి. బహుశా విదేశాలలో విద్యాభ్యాసం చేస్తూ జాతి వివక్షను, రంగు వివక్షను అనుభవించి, తిరిగివచ్చిన యువజనులు అటువంటి ప్రతిఘటనకు నాంది పలకవచ్చు. ఒక శతాబ్దం క్రితం నాటి విదేశీ విద్యావంతులైన యవజనులు జాతీయోద్యమాన్ని బహుముఖంగా అభివృద్ధిపరిచి బలోపేతం చేసిన విధంగా నేటి విద్యాధిక యువత అటువంటి విప్లవాత్మక రాజకీయాలకు మార్గదర్శకులు కావచ్చు. అప్పటివరకు 'అందం రాజకీయాల' పట్ల ప్రతిఘటన కోసం, సర్వజన హితకరమైన శోభస్కరమైన రాజకీయాలను పునరుద్ధరించుకోవడానికి మనం నిరీక్షిస్తూ ఉండాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

సోషల్ జస్టిస్ క్రెడిట్.. కాంగ్రెస్‌దే!

పార్టీ జాతీయ విధానంలో భాగంగా తెలంగాణలో కులగణన జరిపిన కాంగ్రెస్ పార్టీ బీసీలు 56.36శాతం ఉన్నట్టు లెక్క తేల్చింది. దానికి అనుగుణంగా వారికి విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన రెండు బిల్లులను అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించింది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మేరకు వారికి రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఎక్కడా తప్పటడుగులు వేయకుండా పకడ్బందీగా కులగణనకు పూనుకుంది. బీసీల కులగణన అన్ని రకాల పరిశీలనల్లో, న్యాయపరమైన అంశాల్లో నిలబడేలా డెడికేటెడ్ కమిషన్, డాక్యుమెంటేషన్ ద్వారా బిల్లులను ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీ రిజర్వేషన్‌ల పట్ల తన నిబద్ధతను చాటుకుంది. అలాగే భవిష్యత్తులో న్యాయపరమైన అడ్డంకులు ఎదురుకావద్దనే ఉద్దేశంతో వన్ మాన్ కమిషన్ ఏర్పాటు చేసి వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్ వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందంటూ కొందరు చేస్తున్న వాదన హాస్యాస్పదం అంటున్నారు కాంగ్రెస్ నేతలు. వర్గీకరణపై బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు వర్గీకరణ చేయలేదని ప్రశ్నిస్తున్నారు.

వర్గీకరణలో భాగంగా ఎస్సీల్లోని 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూప్–1లోని 15 ఉపకులాలకు ఒక శాతం, గ్రూప్–2లోని 18 ఉపకులాలకు 9శాతం, గ్రూప్–3లోని 26 ఉపకులాలకు 5శాతం రిజర్వేషన్లు ప్రకటించింది. ఇక్కడే కొందరు రాజకీయం చేస్తున్నారు. మాలలకు 5శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించసాగారు. అయితే, గ్రూప్–3లో ఇచ్చిన 5శాతం రిజర్వేషన్లు కేవలం మాలలకు మాత్రమే కాదని అందులోని 26 కులాలకు కలిపి 5శాతం రిజర్వేషన్లు ఇచ్చిన విషయాన్ని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరించి ప్రజల్ని ఏమారుస్తున్నారు. ఇక బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి ఢిల్లీకి పంపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రధాని మోదీతో చర్చించేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని నిర్ణయించి, ఆయన అపాయింట్‌మెంట్ కోరింది. కులగణన మొదలుకొని అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్‌ల బిల్లుల ఆమోదం వరకు, జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నియామకం నుంచి ఎస్సీ వర్గీకరణ వరకు కాంగ్రెస్ పార్టీ చూపిన చిత్తశుద్ధిని ఆయా వర్గాల ప్రజలు ఎన్నటికీ మరవబోరని ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఎవరెన్ని రాజకీయాలు చేసినా అల్టిమేట్ క్రెడిట్ కాంగ్రెస్ పార్టీదే అని ప్రతిపక్షాలు గుర్తెరగాలి.

– **సత్తు మల్లేష్,** కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్

ఆదివాసీల ఆత్మబంధువుకు ఓ నూలుపోగు

ఏడు పదుల జీవితం. 50 సంవత్సరాల రాజకీయ జీవితం. అయితేనేం ఉండేందుకు ఇల్లు లేని సగటు మనిషి ఆయన. తన ప్రజలున్న ఇల్లెందే ఆయన ఇల్లు. ఐదుసార్లు అసెంబ్లీ సభ్యత్వం, అవినీతి మకిలీ అంటని అరుదైన వ్యక్తిత్వం... వెరసి ఆయన పేరు గుమ్మడి నరసయ్య.

70 సంవత్సరాల క్రితం ఖమ్మం జిల్లా ఇల్లెందు తాలూకా టేకులగూడెంలోని పేద ఆదివాసీ (కోయ) కుటుంబంలో చుక్కమ్మ–లక్ష్మయ్య దంపతులకు నరసయ్య జన్మించారు. ఐదవ తరగతిలోనే ఆయన చదువు ఆగిపోయింది. తర్వాత తల్లిదండ్రుల వెంట కొంతకాలం వ్యవసాయం చేసిన ఆయన 1973లో వామపక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆదివాసీల సమస్యలపై పోరాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పట్ల ప్రభావితులై, ఆ పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆదివాసీల హక్కులు, పంటలకు గిట్టుబాటు ధరలు, తునికాకు రేట్లు, కూలి రేట్లు, జీతగాండ్ల జీతాలు పెంపుదలకై పోరాడి, సాధించారు. అటవీ భూములను సాగు చేయడానికి ప్రజలందరినీ సమాయత్తం చేసి ముందుకు కదిలారు. రైతు సమస్యలపై పోరాటాలు చేశారు.

1981లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో ఉసిరికాయలపల్లి నుంచి గుమ్మడి నరసయ్య సర్పంచ్‌గా విజయం సాధించారు. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ తరఫున ఇల్లెందు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 1985 ఆగస్టు సంక్షోభం తర్వాత, 1989లో జరిగిన ఎన్నికలలో గెలిచి, హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. సైకిల్ పైనే తిరుగుతూ ఆయన ప్రజలను ఓట్లు అడుగుతారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఎన్నికల సంఘం గుర్తింపు ఉన్న పార్టీ కాదు. కనుక ఆయన ప్రతిసారి స్వతంత్ర అభ్యర్థిగానే ఎన్నికల బరిలో దిగేవారు. అంటే ప్రతిసారి ఆయన ఎన్నికల గుర్తు మారుతూ ఉండేది. గుమ్మడి నరసయ్య ప్రజలకు అభ్యర్థిగా కంటే ఆదివాసీగా గుర్తుంటాడు. అందుకే ఆయన ప్రతిసారి గెలుస్తూనే ఉంటాడు.

ఖమ్మం జిల్లాలో ఇల్లెందు మొదటి నుంచి కమ్యూనిస్టు పార్టీలకు గట్టి పట్టున్న ప్రాంతం. సమస్యల పరిష్కారంతో ప్రజలకు చేరువై సీపీఐ, సీపీఎంల ఆధిపత్యానికి సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ గండి కొట్టింది. దాని ఫలితమే గుమ్మడి నరసయ్య వరుస విజయాలు. 1994 అసెంబ్లీ ఎన్నికలలో కొద్దిపాటి తేడాతో సీపీఐ అభ్యర్థి ఊకే అబ్బయ్య చేతిలో ఓడిపోయిన నరసయ్య, తిరిగి 1999 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. ఆ తర్వాత 2004లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిపై గెలుపొంది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన రికార్డును సొంతం చేసుకున్నారు.

గడచిన 50 ఏళ్లలో తెలంగాణను ప్రభావితం చేసిన కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి ఇలా ఎన్ని రాజకీయ పార్టీలు వచ్చినా గుమ్మడి నరసయ్య ఇల్లెందులో ఒక ఆదివాసీ నాయకుడుగా, ప్రజానాయకుడిగా, ప్రజల మనిషిగా నిలదొక్కుకున్నారు.



నిరంతరం ప్రజల కోసం తపించి, తన జీవితాన్ని వారికి అంకితం చేసిన నిరాడంబరుడు గుమ్మడి నరసయ్య. వర్తమాన కాలంలో ఆదర్శాలను ఆచరణలో చూపిన నిక్కమైన మనిషి. సమకాలీన రాజకీయ నాయకులకే కాదు రేపటి తరాలకు కూడా ఆయన ఆదర్శప్రాయుడు.

అందుకు కారణం నీతి–నిజాయితీలతో అవినీతికి అందనంత దూరంలో ఆయన నడుచుకోవడమే. అయితే 2009 నుంచి ఆయనకు ఎన్నికల రాజకీయాల్లో ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. ఇందుకు వ్యాపార రాజకీయాల పార్టీల కుట్రలే కారణం అంటారాయన. వరుస గెలుపులతో సాగిపోతున్న గుమ్మడి నరసయ్యను నిలువరించడానికి బూర్జువా రాజకీయ పార్టీలు ఇల్లెందు నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసి కుట్ర పన్నారంటారు. ఇల్లెందులోని సీపీఐ(ఎంఎల్) పార్టీకి పట్టున్న రెండు మండలాలను వైరా, పెనుబాక నియోజకవర్గాలకు మార్చి ఆ పార్టీని బలహీనపరిచారు. ఇందుకు బూర్జువా పార్టీలతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కూడా చేతులు కలిపాయి. దీంతో గుమ్మడి నరసయ్య 2009, 2014, 2018 ఎన్నికలలో వరుసగా ఓటమిని చవిచూశారు. అయితే ఆయన ప్రజా జీవితానికి మాత్రం దూరం కాలేదు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు ఏడు పదుల వయసులో కూడా ఎదురునిలిచి పోరాటాలు చేస్తున్నారు.

సింగరేణి బొగ్గు గనుల భూ నిర్వాసితుల కోసం, ఆదివాసీల హక్కుల కోసం, తెండు ఆకు సేకరించే వారికి మద్దతుగా ఆయన చేసిన కృషి ఎనలేనిది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా ఆయన తనదైన పాత్ర పోషించారు. నిరంతరం ఇల్లెందు ప్రజల గొంతుకగా నిస్వార్థ సేవ చేస్తూ గుమ్మడి నరసయ్య విస్తృతమైన ఖ్యాతి పొందారు. హైదరాబాద్ మహానగరంలో ఎమ్మెల్యే కోటా కింద తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చారు. తన కోసం నివసించడానికి నీడైనా లేకుండా అతి సాధారణంగా జీవిస్తున్నారు గుమ్మడి నరసయ్య.

గుమ్మడి నరసయ్య జీవితంపై పరమేశ్వర్ హివ్రాలే అనే దర్శకుడు బయోపిక్‌ను రూపొందిస్తున్నారు. ఆదివాసీల ఆత్మబంధువు, నిరంతరం ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నిరాడంబరుడు నరసయ్య. వర్తమాన కాలంలో ఆదర్శాలను ఆచరణలో చూపిన నిక్కమైన మనిషి. సమకాలీన రాజకీయ నాయకులకే కాదు రేపటి తరాలకు కూడా ఆయన ఆదర్శప్రాయుడు.

నాగర్ కర్నూలు జిల్లా కేంద్రానికి చెందిన సి.భాస్కర్ రావు ప్రతి ఏటా ఇచ్చే చింతలపల్లి నిర్మలాదేవి–చింతలపల్లి నారాయణరావుల 2025 సంవత్సరపు జీవనసాఫల్య పురస్కారాన్ని గుమ్మడి నరసయ్యకి ఈ నెల ఐదున నాగర్ కర్నూల్‌లో ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డు కింద వారికి 25 వేల రూపాయల నగదుతో శాలువా, జ్ఞాపికను అందజేస్తారు.

■ **హెచ్. రమేష్‌బాబు**

స్వతంత్ర పాత్రికేయుడు



రైతు నెత్తిపై విత్తన భారం

ఏటికేడు పెరుగుతున్న పత్తి విత్తనాల ధరలు

- అసలే పంట దిగుబడి రాక రైతుల కుదేలు
- పండినా గిట్టుబాటు ధరలేక కన్నీరు
- అప్పుల్లో కూరుకుపోతున్న అన్నదాతలు
- పెరిగిన ధరలతో రూ.80 లక్షల వరకు భారం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా రైతుల జీవితాలు మారడం లేదు. భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న రైతులకు ఇటీవల పెరిగిన పత్తి విత్తనాల ధరలు గుది బండలాగా మారాయి. ఒక వైపు పంట పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు కష్టాల్లో కూరుకుపోగా.. పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాక సతమతమవుతున్నారు. ఈ క్రమంలో పత్తి విత్తనాల ధరలు ఏటేటా పెరుగుతుండడంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డచందనంగా మారింది.

ధరల దడ

హనుమకొండ జిల్లాలో రైతులకు విత్తన భారం తప్పడం లేదు. మూడేళ్లుగా పత్తి విత్తనాల ధరలు పెరగడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతికూల వాతావరణం పరిస్థితులతో పత్తి పంట దిగుబడి లేక ఇబ్బంది పడుతున్న స్థితిలో మరోసారి పత్తి విత్తన ధరలు పెంచడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం కాత, పూత దశలోనే వర్షాలు ముఖం చాటేయ్యడంతో పత్తి పంటలో దిగుబడి సగానికి పడిపోయింది. అరకొర దిగుబడి వచ్చిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడులు రాక అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోయారు. ఈసారైనా వరుణుడు కరుణిస్తే కోటి ఆశలతో పత్తి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే ఈ క్రమంలో విత్తన ధరల రూపంలో ఆర్థిక భారం పడుతోందని పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

80వేల ఎకరాల్లో ఎకరాల్లో సాగు

హనుమకొండ జిల్లాలో 15 మండలాల పరిధిలో రైతులు ప్రధాన పంటగా పత్తి సాగు చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో సాగునీటి వసతులు లేకపోవడంతో వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు. ఈ కారణం తోనూ ఏటా పత్తిసాగు పెరుగుతోంది. గత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 80వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురిసిన కాత, పూత దశలో చేరుకోగానే వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో పంటలు దెబ్బతినడంతో సాధారణంగా ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి సగం కూడా రాలేదని రైతులు చెబుతున్నారు.



పెరిగిన విత్తన ధరలు

పత్తి విత్తన కంపెనీలు విత్తనాల ధరలను పెంచడంతో రైతులపై ఈ ఏడాది సుమారుగా 60 లక్షల నుంచి 80 లక్షల వరకు భారం పడనుంది. 500 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్‌పై రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం రూ.43 చొప్పున పెంచగా, గత ఏడాది విత్తన కంపెనీలు ప్యాకెట్‌పై రూ.11 పెంచుతూ విత్తన కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. మూడేళ్లుగా రైతులపై విత్తనాల పెంపు భారం పడుతోంది. వచ్చే వానాకాలం సీజన్‌లోనూ జిల్లాలో సుమారుగా 80 నుంచి 85 వేల ఎకరాల వరకు పత్తి సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన ఈ సీజన్‌లో సుమారు 2 లక్షలకు పైగా విత్తనాల ప్యాకెట్లు అవసరం ఉంటుందని, గత ఏడాది విత్తనాల ప్యాకెట్ ధర రూ.864 ఉండగా తాజాగా, పెంచిన ధరతో రూ.901కి చేరింది. ఐదేళ్లుగా విత్తనాల ధరలు క్రమంగా పెరుగుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్ల కిందట బీటీ-2 పత్తి విత్తనాల ధర రూ.710 ఉండగా, ప్రస్తుతం రూ.901కి చేరుకుంది. ఐదేళ్లల్లో ఒక్కో ప్యాకెట్‌పై రూ.191 పెరిగింది.

విత్తనాల ధరలు పెంచుతున్నారు..

మేడిపల్లి రమేష్, రైతు, కౌకొండ గ్రామం



భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేసే రైతులను ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. విత్తనాల ధరలు పెంచుతున్నారే తప్ప పంటలకు మాత్రం మద్దతు ధర పెంచడం లేదు. మందులు, కూలీలు ఇతరత్రా అన్ని కూడా ఎక్కువైపోయాయి.

క్వింటాల్‌కు రూ.10 వేలు చెల్లించాలి..

ఓదెల భాస్కర్, రైతు, కౌకొండ



పెరిగిన విత్తనాల ధరలు, కూలీల రేట్లను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పత్తి క్వింటాలకు ధర రూ.10వేలు చెల్లించాలి. అప్పుడే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ఏటా విత్తనాల ధరలను పెంచుతున్నారు. కూలీల రేట్లు, ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే చివరికి అప్పులే మిగులుతున్నాయి.



సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డితో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

సీఎం రేవంత్‌రెడ్డిది నిర్బంధ పాలన

- విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నిర్బంధ, నిరంకుశ పాలన సాగిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండలోని సుబేదారి పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయిన కేయూ విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. అక్కడే ఉన్న సీఐతో మాట్లాడి రెండు రోజులుగా విద్యార్థులను విడుదల చేయకుండా పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాక విద్యార్థులకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు బైరపాక ప్రశాంత్, గొల్లపల్లి వీరస్వామి, పస్తం అనిల్, రాసూరి రాజేష్, బి.నర్సింహరావు, బాషబోయిన సంతోష్, మొగిలి వెంకట్‌రెడ్డి, హకీం నవీన్, మాలోతు రాజేష్, మర్రి మహేష్, మంద నరేష్, ఎల్తూరి సాయికుమార్, కుమ్మరి శ్రీనాథ్, శివ, రంజిత్, వంశీ, వినయ్ తదితరులు పోలీసుల అదుపులో ఉన్నారు.

సహకార సంఘాలు ఆర్థిక వృద్ధిని సాధించాలి

- వ్యాపార మార్గాలను విస్తరించుకోవాలి
- శిక్షణ తరగతుల్లో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. సహకార శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు అవసరమైన మార్గాలను అన్వేషించాలన్నారు. కొత్త ఆలోచనలతో కూడిన వాటితో పాటు ప్రస్తుత వ్యాపారాలను విస్తరించుకోవాలన్నారు. ప్రణాళిక మేరకు కృషి చేస్తే తప్పక ఆర్థిక ప్రగతి సాధన ఉంటుందన్నారు. సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలాగా పనిచేస్తే మంచి లాభాలను ఆశించవచ్చని సూచించారు. సాధారణ సేవా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తూ రైతుల అభిమానాన్ని చూరగొనాలని పేర్కొన్నారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందచేయాల్సి ఉందన్నారు. డీసీసీ బ్యాంక్ టర్నోవర్ రూ.870కోట్ల నుంచి రూ.2,229 కోట్లకు చేరడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 19 శాఖలుగా డీసీసీ బ్యాంకును 32 శాఖలకు విస్తరించినట్లు తెలిపారు. నందనంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్ వ్యాపార వృద్ధిని సాధిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ ఎం.డి. కేవీఎన్ అన్నపూర్ణ, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లాలోని డీసీవోలు సంజీవరెడ్డి, నీరజ, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వాల్యనాయక్, వెంకటేశ్వర్లు, సర్దార్‌సింగ్‌తోపాటు డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు జగన్‌మోహన్‌రావు, హరిప్రసాద్, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రస్టేషన్‌లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు

- హెచ్‌సీయూ పక్కనున్న భూములపై అనవసర రాజకీయం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నాయని, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు అందించే బియ్యం ధర రూ.40 అయితే కేంద్రం.. రూ.30 చెల్లిస్తోందని, రాష్ట్రప్రభుత్వం కేవలం రూ.10 మాత్రమే భరిస్తోందని సంజయ్ కనీస అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బీజేపీకి నిజంగా పేదలపై ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. కల్వకుంట కుటుంబం తెలంగాణపై పడి దోచుకోవడం వల్ల వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి పదేళ్ల నీటి పారుదల శాఖ నిధులను మళ్లించారని ఆరోపించారు. కేసీఆర్ తన సొంత జిల్లా మెదక్‌లో కొండ పోచమ్మ, రంగనాయక్ సాగర్, మల్లన్న సాగర్ మూడు రిజర్వాయర్లతో పాటు తన ఫామ్ చుట్టూ సీసీ లైనింగ్‌తో పాటు కాలువల నిర్మాణం చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరానికి ఖర్చు చేసిన లక్ష కోట్లలో కనీసం ఐదు వేల కోట్లు దేవాదుల ప్రాజెక్టుకు ఖర్చు చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు వచ్చేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్ట్ పనులను త్వరితగతిగా పూర్తి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయించి ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు శరత్, కునూరు రాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

వాహన మరమ్మతుల జాప్యంపై మేయర్ సీరియస్


బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డు ఆకస్మిక తనిఖీ



వెహికిల్ షెడ్డులో అధికారులకు సూచనలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలింపు వాహనాల మరమ్మతులో సిబ్బంది చేస్తున్న జాప్యంపై మేయర్ గుండు సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డును మేయర్ సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి రిజిస్టర్ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. రెండు మాసాలుగా శానిటేషన్ విభాగం చెత్త తరలింపు స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతులు చేయకుండా షెడ్డుకే పరిమితమైనట్టు తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా వాహనాలు మరమ్మతు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ మహేందర్, డీఈ శివానందం, ఏఈలు పణికుమార్, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.





చపాట మిర్చికి జియో ట్యాగింగ్ శుభపరిణామం

- అంతర్జాతీయ ఎగుమతులకు అవకాశం
- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- అధికారులతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన



చపాట మిర్చిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 3: (ఆంధ్రజ్యోతి): మన దగ్గర సాగయ్యే చపాట మిర్చి జియో ట్యాగింగ్ గుర్తింపు లభించడం శుభపరిణామమని, మిర్చిని అంతర్జాతీయ ఎగుమతులు చేసుకునేందుకు మంచి అవకాశం లభిస్తోందని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను గురువారం కలెక్టర్ సత్యశారద సందర్శించారు. మిర్చి యార్డును సందర్శించి చపాట మిర్చి రైతులతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? చపాటమిర్చి ఎంత సాగు చేశారు? ఎంత దిగుబడి వచ్చింది? మార్కెట్లో ఎంత రేటు పలికింది? లాంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు, దిగుబడి వివరాలు చెప్పారు. మార్కెట్లో మిర్చికి ధరలు చాలా తక్కువగా ఉన్నాయని, మూడేళ్ల కిందట చపాట మిర్చి క్వింటా రూ.లక్ష వరకు పలుకగా ప్రస్తుతం ఇరువై నుంచి ముప్పై వేల మధ్యలోనే ధరలు ఉంటున్నాయని కలెక్టర్‌కు తమ ఆవేదనను చెప్పుకున్నారు. ముప్పై ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్ల కిందట చపాట మిర్చికి మంచి డిమాండ్ పలుకడంతో రూ.లక్ష వరకు పలికిన వాస్తవమేనని కానీ.. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో చపాట మిర్చి ఎగుమతులు తగ్గడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యాపారులు, రైతు సంఘాల కోరిక మేరకు మార్కెట్లో రైతులకు మజ్జిగ పంపిణీ చేపడతామన్నారు. సరుకులను తూకం వేసే పీవోఎస్ మిషన్లు మరిన్ని కావాలని రైతులు అడుగుతున్నారని, వాటిని కూడా తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఈ సందర్భంగా టాయిలెట్స్ అందుబాటులో లేవని, దూరంగా ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే కార్యనిర్వహణ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఒక భవనం కావాలని కలెక్టర్‌ను వ్యాపారులు అభ్యర్థించారు. దీంతో రైతులకు టాయిలెట్స్ అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని మార్కెట్ కార్యదర్శిని ఆదేశించారు. వ్యాపారులకు తాత్కాలికంగా చైనా టెంట్ వేసి కార్యకలాపాలు నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కాగా, అంతకుముందు ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను కలెక్టర్ సందర్శించారు. ఆ తదుపరి మార్కెట్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాట్లను పరిశీలించారు. రైతు విశ్రాంతి భవన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా, తహసీల్దార్ ఎక్బాల్, గ్రేడ్-2 కార్యదర్శి అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్, రాజేష్ డి.కరాణి, చింతపల్లి వీరారావు, సాగర్ల శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలి

- ఎఫ్‌వోబీ, ఆర్‌వోబీలను నిర్మించాలి
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కావ్య వినతి

హనుమకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర రవాణ, రహ దారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. గురువారం కావ్య ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. గనులు, అడవులతో సహజ వనరులు సమృద్ధిగా ఉన్న భూపాలపల్లి జిల్లాలో నిత్యం పెద్దఎత్తున పారిశ్రామిక కార్యకలాపాలు జరుగుతున్నం దువల్ల ట్రాఫిక్ పెరిగిపోయి పెద్ద ఎత్తున ప్రమాదాలు జరు గుతున్నాయని కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి భూపాలపల్లి పట్టణం చుట్టూ బైపాస్ రహదారిని 2024-25 వార్షిక ప్రణాళి కలో చేర్చాలని, దాని నిర్మాణానికి అవసరమైన నిధుల ను కేటాయించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఎంపీ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలి..

జాతీయ రహదారి-163 జనగామ జిల్లా, స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గంలోని నిడిగొండ, రఘునాథపల్లి, ఛాగల్, చినపెండ్యాల, కరుణాపురం గ్రామాల్లో పుట్ ఓవర్ బ్రిడ్జిలు లేకపోవడంతో గ్రామస్థులకు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిని నివారించేందుకు ఆయా గ్రామాల పరిధిలో పుట్ ఓవర్ బ్రిడ్జిలను మంజురుచేయాలని కూడా కోరారు. కొన్ని గ్రామాల్లో సర్వీస్ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య

సంబంధించి భూసేకరణ కూడా పూర్తయిందని వెల్లడించారు. వెంటనే సర్వీస్ రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా జనగామ ఆర్‌వోబీ నుంచి కరుణాపురం వరకు అన్ని గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మించారని, కానీ ఆ డ్రైనేజీల్లోని నీరు బయటకు వెళ్లకుండా గ్రామాల్లోకి వస్తున్నదని, కనుక మురుగు నీరు బయటకు వెళ్లేలా నిర్మాణాలు చేపట్టాలని అభ్యర్థించారు. వరంగల్ - జనగామ ఎంట్రీ పాయింట్ వద్ద నాలుగురోడ్లను కలిపే జంక్షన్ ఉందని, అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కనుక భద్రతా చర్యల దృష్ట్యా జంక్షన్ పాయింట్‌ను అభివృద్ధి చేయాలని డాక్టర్ కావ్య కోరారు. ఎన్‌హెచ్-163 దాటే జనగామ - సూర్యాపేట నేషనల్ హైవే ఆర్‌వోబీ వద్ద ఉన్న అప్రోచ్ రోడ్లు చాలావరకు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకపోవడం వల్ల ఆయా పాయింట్ల వద్ద తరుచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అప్రోచ్ రోడ్ల విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు.

కాజీపేట లోకోరన్నింగ్ డిపోపై పక్షపాత ధోరణి

కాజీపేట : దక్షిణ మధ్య రైల్వేలో అతిపెద్ద డిపోగా ఉన్న కాజీపేట లోకో రన్నింగ్ డిపోపై కొందరు రైల్వే అధికారులు పక్షపాతధోరణి తో వ్యవహరిస్తూ సిబ్బందిని అక్రమంగా ఇతర డివిజన్‌లకు తరలిస్తున్నారని, ఈ చర్యలను నిలిపివేయాలని గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్య పార్లమెంట్‌లో గళమెత్తారు. 15 ఏళ్లుగా 500 మందికి పైగా ఉద్యోగులను వివిధ కారణాలతో విజయవాడకు తరలించారని అన్నారు. కాజీపేట డిపోలో 709 మంది ఉద్యోగుల కావాల్సి ఉండగా 526 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం మంజూరైన 184 కొత్త లోకోపైలెట్ ఉద్యోగాలను ఇతర ప్రాంతాలకు తరలించారని, దీంతో ఇక్కడ పనిచేసే సిబ్బందిపై పనిఒత్తిడి పెరుగుతోం దని చెప్పారు. ఇక్కడి సిబ్బందిని విజయవాడకు తరలించే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. కాజీపేట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లపై పక్షపాతధోరణి ప్రదర్శిస్తున్నారని రైల్వే మంత్రి స్పందించి కాజీపేట రన్నింగ్ డిపోను కాపాడే చర్యలు తీసుకోవాలని కోరారు.


ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 4 నుంచి 7 వరకు జమ్ముకాశ్మీర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ పవర్ లిఫ్టింగ్ మహిళ, పురుషుల జట్టును 2024-25 ఏడాదికి గురువారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో మహిళ విభాగం నుంచి సీహెచ్. రమ (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ), బి. చిన్మయి (యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, వరంగల్), బి.శృతి (వాగ్దేవి వ్యాయామ విద్యా కళాశాల, బొల్లికుంట)లున్నట్లు తెలిపారు. అలాగే పురుషుల విభాగం నుంచి పి.విశాల్ (కిట్స్ కళాశాల, వరంగల్) ఎస్.పోతరాజు (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, వరంగల్), ఎం.అమాన్ (కిట్స్‌కళాశాల, వరంగల్), వి.వెంకటేశ్ (కేడీసీ హనుమకొండ) లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా టీజీటీబ్ల్యూఆర్‌డీసీ గర్ల్స్ కళాశాల, ఖమ్మం ఫిజికల్ డైరెక్టర్ డి.శ్వేత వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

24 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంహెచ్‌ఆర్ఎం పీజీ కోర్సుల రెండో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 26 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 26, 28, 30, మే2, 5, 7తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.ఇతర వివరాలకు వర్సిటీవెబ్‌సైట్‌లోచూడాలని పేర్కొన్నారు.

జాతీయ ఖోఖో క్రీడలకు తండ్రీకొడుకు

గీసుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం పూరిలోని జగన్నాథ స్టేడియంలో జరుగుతున్న 57వ జాతీయ ఖోఖో క్రీడల్లో గీసుగొండ గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కోట రాంబాబు, అతడి కుమారుడు సృజన్ పాల్గొంటున్నారు. నర్సంపేట ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాంబాబు జాతీయ పోటీలకు న్యాయనిర్ణేతగా ఎంపిక కాగా, ఇంటర్మీయట్ చదువుతున్న అతడి కుమారుడు సృజన్ తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికయ్యారు. దీంతో తండ్రీకొడుకులు జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ ఏప్రిల్ 4 వరకు క్రీడలు జరుగుతాయి.


పూరీలోని జరుగుతున్న ఖోఖో క్రీడల్లో పాల్గొంటున్న రాంబాబు, అతడి కుమారుడు సృజన్

దర్భంగా ఎక్స్‌ప్రెస్ రద్దు

కాజీపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైల్వే ఇంటర్‌లాకింగ్, ఇతరత్రా మరమ్మతుల దృష్ట్యా కాజీపేట జంక్షన్ మీదుగా నడిచే దర్బంగ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (17007) సికింద్రాబాద్ నుంచి దర్బాంగ వెళ్ల ఈ రైలును ఈ నెల 8, 12, 15, 19, 22 తేదీలలో తిరిగి (17008) దర్బాంగ నుంచి సికింద్రాబాద్ వైపు ఈ నెల 11, 15, 18, 22, 25 తేదీలలో రద్దు చేస్తున్నామని, ఈ రైల్లో రాకపోకలు సాగించే ప్రయాణీకులు గమనించాలని చెప్పారు.

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన చాపర్తి సాంబయ్యపై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగారా శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు సేషన్స్ జడ్జి జి.ప్రేమలతారెడ్డి గురు వారం తీర్పు చెప్పారు. అదే విధంగా బాధితురాలికి రూ.8లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య. అదే గ్రామానికి చెందిన 6వ తరగతి చదువుతున్న బాలికను బెదిరించి రెండు సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. మైనర్ బాలిక అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆమె గర్భవతి అని నిర్ధారించారు. దీంతో బాలికను విచారించగా చాపర్తి సాంబయ్య (73)అనే వ్యక్తి జామకాయలు ఇస్తానని తన ఇంట్లోకి తీసుకెళ్లి బెదిరించి అత్యాచారం చేశాడని, ఈ విషయం మీ ఇంట్లో చెబితే చంపుతానని బెదిరించాడని బాలిక తెలిపింది. దీంతో నిందితుడిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ బొల్లం యుగంధర్ సాక్షులను ప్రవేశపెట్టగా ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఏసీపీ బి.తిరుపతి కేసు దర్యాప్తు చేశారు. లైజన్ అధికారిగా ఏఎస్సై హరికృష్ణ, భరోసా లీగల్ సలహదారు సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాస్తం రవికిరణ్ కేసు వాదించారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కడియంకు కర్రు కాల్చివాత పెట్టాలి

- రూ.800కోట్లతో అభివృద్ధి పచ్చి అబద్ధం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

రఘునాథపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి, తన ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్‌ను నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని, కడియంకు కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. నిడిగొండ శివారులో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అధ్యక్షత వహించగా, పల్లా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శ్రీహరి రూ.800 కోట్లు మంజూరు చేయించానని చెప్పు కోవడం పచ్చి అబద్దమన్నారు. ఎనిమిది రూపాయల నిధులు కూడా తీసుకురాని దద్దమ్మ కడియం అని ఆరోపించారు. 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గం నుంచి 30 వేల మందికి తగ్గకుండా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చెవెల్లి సంపత్, వై.కుమార్ గౌడ్, మనోజ్ రెడ్డి, బాల్దె సిద్దులు, ఆకుల కుమార్, మారపాక రవి, గాడిపెల్లి ప్రేమలతా రెడ్డి, ఎడవెల్లి కృష్ణా రెడ్డి, మునిపట్ల విజయ్, గూడ కిరణ్ కుమార్, తిప్పారపు బాబురావు, పరుశరాములు, బొంగు అయిలయ్య, గైని శ్రీనివాస్, తిప్పారపు మమత, రమ్యశ్రీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మృతరాలిది వర్ధన్నపేట మండలం దివిటిపల్లి


ఉప్పలమ్మ(ఫైల్)

జఫర్‌గఢ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జఫర్‌గఢ్ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వర్ధన్నపేట మండలం దివిటిపల్లికి చెందిన జోగు ఉప్పలమ్మ(70)మృతి చెందింది. ఎస్ఐ రాంచరణ్ నాయక్ కథనం దివిటిపల్లికి చెందిన జోగు ఉప్పలమ్మ, ఎల్లమ్మతోపాటు ఇదే గ్రామానికి చెందిన కంజర్ల దయాకర్ బైక్‌పై కూర్చుని ముగ్గురు కలిసి జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లులో బంధువుల దశదిన కర్మకు హాజరయ్యేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో జఫర్‌గఢ్ శివారు నల్లబండ సమీపంలో లో లెవల్ డ్యాంవద్ద బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. బైక్‌పై వెనకాల కూర్చున్న జోగు ఉప్పలమ్మ, ఎల్లమ్మ ఎగిరి రోడ్డుపై పడగా, ఉప్పలమ్మకు తల,ఇతర శరీరభాగాల్లో బలంగా దెబ్బలు తగలడంతో అక్కడికక్కడే చనిపోయింది. ఎల్లమ్మకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణంగాతెలుస్తోంది. మృతురాలు ఉప్పలమ్మకు టుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

16 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఏసీపీ, హనుమకొండ పోలీసులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒడిశానుంచి ముంబయికి గంజాయి తరలి స్తున్న యువకుడిని హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి 16 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏపీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. సూరత్‌కు చెందిన తలి తండ్రులు లేని గౌతం భరత్ సిందే అనే యువ కుడు రైళ్లలో సమోసాలు విక్రయి స్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో అర్జున్ అనే మరో వ్యక్తి ఒడిశా నుంచి గంజాయి తీసుకొస్తే డబ్బు లు ఇస్తానని ఆశ చూపగా.. గౌతం ఒడిశా నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తీసుకొస్తున్నాడు. పోలీసులు తనిఖీలు చేస్తున్నారనే సమాచారం మేరకు గురువారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు హనుమకొండ బస్టాండ్‌కు చేరుకు న్నాడు. బస్టాండ్ ఆవరణంలో ఉన్న పోలీసులను చూసి పారిపోయేందు కు ప్రయత్నిస్తుండగా ఎస్సై కిషోర్, సిబ్బంది యువకుడిని అదుపులోకి తీసుకొని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.



అవార్డును అందుకుంటున్న డాక్టర్ అనితారెడ్డి

అనితారెడ్డికి స్వచ్ఛ చాంపియన్ అవార్డు

బాలసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డి స్వచ్ఛ చాంపియన్ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. తన ఇంటితో పాటు నగరంలో అధికంగా మొక్కలు నాటడం, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడం నీటి పొదుపు, ఇంకుడు గుంతలు తవ్వడంపై అవగాహన కార్యక్రమాలు ప్రజలకు నిర్వహిస్తున్నందుకు ఆమెను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు అవార్డుకు ఎంపిక చేశారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే మూడు రోజుల వర్షాలు, ఈదురుగాలులు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. గురువారం డైరెక్టర్లు, సీఈలు, జీఎంలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. 16 సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతికూల వాతావరణంలో బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ సంభవిస్తే త్వరతగిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. ఖరీఫ్‌కాలానికి నాణ్యమైన విద్యుత్‌నందించేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగే చోట అందుకు తగ్గట్లు కార్యాచరణ రూపొందించుకొవాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీఈలు, జీఎంలు పాల్గొన్నారు.

భూపాల్‌రాజ్‌కు జీవిత కాల సాఫల్య అవార్డు


భూపాల్‌రాజ్

హసన్‌పర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్‌కి భూసార పరిశోధనలో జీవిత కాల సాఫల్య అవార్డు లభించినట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దీపక్ గార్గ్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ హసన్‌లో గత నెల 26, 27వ తేదీలలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో భూసార పరిశోధనలో జరిపిన పరిశోధనలకు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భూపాల్ రాజ్‌ను వీసీ దీపక్ గార్గ్, సిబ్బంది అభినందించారు.

ఎక్సైజ్ శాఖ వసూళ్ల పర్వం

- బెల్టు షాపుల నుంచి నెలవారీ మామూళ్లు
- వాహనాల వేలం పాటలో సైతం చేతివాటం
- వర్ధన్నపేటలో కార్యాలయంలో యథేచ్ఛగా అవినీతి

వర్ధన్నపేటరూరల్,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గుడుంబా, బార్లు, వైన్సుల నుంచే కాకుండా, ఇప్పుడు కొత్తగా బెల్టు షాపుల నుంచి సైతం నెలవారీగా మామూళ్ల వసూలు చేసే సరికొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకొచ్చారు. దీనికి తోడుగా వాహనాల వేలంలో కూడా చేతి వాటాన్ని ప్రదర్శిస్తూ ఇక్కడి అధికారులు వాటాలు వేసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఉన్నతాధికారులకు సైతం వాటాలు ఇవ్వాలని, సహకరించి వ్యాపారం చేసుకోండని అభయం ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వెయ్యి కొట్టు.. బెల్టు పెట్టు..

వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పర్వతగిరి, రాయపర్తి, సంగెం, వర్ధన్నపేట మండలాలున్నాయి. ఈ మండలాల్లో బెల్టు షాపులు ఎక్కువగానే కొనసాగుతున్నాయి. ఒక్క వర్ధన్నపేట మండలంలోనే 18 గ్రామాల్లోనే దాదాపు 120 వరకు బెల్టు షాపులు ఉన్నాయి. ఇక వర్ధన్నపేట మునిసిపాలిటీలో 20-30 వరకు ఉంటాయి. అయితే వీటన్నింటి నుంచి రూ.2వేల చొప్పున మామూలు ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాల వారీగా బెల్టు షాపుల నిర్వాహకులు స్టేషన్‌కు వచ్చి అధికారితో చర్చలు జరిపారు. ఎక్కువగా బెల్టు షాపులు ఉన్న గ్రామాలకు రూ.వెయ్యి, తక్కువగా ఉన్న వాటికి రూ.2వేలుగా నిర్ణయించారని సమాచారం. అలాగే మార్చి నెల మామూళ్ల సైతం వసూలు చేసి ఇచ్చేసినట్లు తెలుస్తోంది.

బార్ టూ బెల్ట్

కొంత కాలంగా వర్ధన్నపేట మండల వ్యాప్తంగా బెల్టు షాపుల్లో బార్ షాపుల మద్యమే కనిపిస్తోంది. వైన్స్ షాపుల నుంచి వెళ్లాల్సిన మద్యం బార్ నుంచి వెళ్లడంతో వైన్స్‌షాపుల వ్యాపారం పూర్తిగా పడిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా బార్ నుంచి ఓఆటోలో ఉదయాన్నే బెల్టు షాపులకు మద్యం వెళ్తోందని ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆర్డర్లు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. బార్ షాపుల నుంచి పెద్ద మొత్తంలో మామూళ్ల ముట్టడంతోనే ఈ తతంగమంతా నడుస్తోందని చెపుతున్నారు. ఇటీవల ల్యాబర్తి తదితర గ్రామాల్లో వరంగల్ నుంచి ఎక్సైజ్ సంబంధిత అధికారులు దాడులు చేసి బార్‌షాపు మద్యాన్ని సీజ్ చేసినట్లు సమాచారం. కానీ బయటకు రాకుండానే లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులే చెప్పుకుంటున్నారు.

వాహనాల వేలంలోనూ వసూళ్లే...

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలంలో సైతం వసూళ్ల పర్వం నడుస్తోంది. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తారు. వేలంలో ఏమైనా మంచి వాహనాలు ఉంటే వాటిని అధికారులే కాజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టుబడిన వాహనాల నుంచి కొంత సామగ్రిని సైతం బయటకు అమ్ముకోవడంతో పాటు వాహనాలను తప్పుదారి పట్టిస్తున్నారని సమాచారం. వాహనాల వేలంలో స్క్రాప్ కింద పోయే పలు వాహనాలను ఒకే వ్యక్తికి అమ్మేస్తారు. వేలంలో స్క్రాప్‌ను దక్కించుకున్న వ్యక్తి వాటిని కట్ చేయకుండా ఉండేందుకు అధికారులు రూ.వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఉన్నతాధికారులకు వాటాలు

వర్ధన్నపేట ఎక్సైజ్ పరిధిలో మొత్తం 18 మద్యం షాపులు, రెండు బార్లు ఉన్నాయి. వీటి నుంచి నెలవారీగా రూ.35 వేల వరకు ఒక్కో షాపు నుంచి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇది ఉండగానే బెల్టు షాపుల నుంచి సైతం నెలవారీగా మామూళ్ల వసూళ్ల చేసే పాలసీని గతంలో లేని విధంగా తీసుకొచ్చారు. ఇదేంటని ప్రశ్నించిన నిర్వాహకులతో ఖర్చులు భారీగా పెరిగిపోయాయని, ఉన్నతాధికారులకు సైతం వాటాలు ఇవ్వాలంటే డబ్బులు సరిపోవడంలేదని అధికారులే నేరుగా చెప్పడం గమనార్హం. కేసులు కాకుండా ఉంటాలంటే నెలకు ఎంతో కొంత ఇచ్చుకోకపోతే తప్పదని చెబుతున్నట్లు తెలుస్తోంది. కాగా, వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7300	5300
మక్కలు (బిల్టీ రకం)	2110	1521
కందులు	6716	3022
పెసళ్లు	7506	3022
పల్లికాయ (సూక)	6800	5200
పల్లికాయ (పచ్చిది)	4700	4575
పసుపు (కాడి)	11259	10534
పసుపు (గోల)	11559	9700
తేజ మిర్చి	13150	9500
వండర్‌హాట్	14000	10000
యూఎస్341	11500	9000
దీపిక	13000	10000
దేశీ	28500	18000
సింగిల్ పట్టి	-	-
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

వ్యక్తిత్వ వికాస వేదిక.. సాక్

విద్యార్థుల సృజనకు సాన


వరంగల్ నిట్‌లోని సాక్ సెంటర్

- కళా రంగాల్లో రాణింపునకు శిక్షణ
- సంగీత, సాహిత్య, నృత్య, క్రీడల్లో ప్రోత్సాహం
- వరంగల్ నిట్‌లో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్

హనుమకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైందిగా వరంగల్ నిట్‌కు పేరుంది. అందుకు తగ్గట్టుగానే ఇందులో చదువుతున్న విద్యార్థులు కూడా బహుముఖ ప్రజ్ఞావంతులుగా పేరుతెచ్చుకుంటున్నారు. చదువుతో పాటు సంగీత, సాహిత్య, సాంస్కృతిక, క్రీడా తదితర రంగాల్లో రాణిస్తున్నారు. వరంగల్ నిట్ వేదికగా జరిగే పోటీల్లోనే కాకుండా దేశంలోని ఇతర నిట్‌లలో నిర్వహించే అంతర్ నిట్ పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. పేరున్న కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందుతున్నట్టే.. వివిధ పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు. ఇందుకు కారణం వరంగల్ నిట్ క్యాంపస్‌లోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్). విద్యార్థులను చదువుతో పాటు వారికి ఇష్టమైన ఇతర కళారంగాల్లో రాణించేందుకు ఈ సాక్ వేదికగా నిలుస్తోంది. వారి వ్యక్తిత్వం బహుముఖంగా వికసించడంతో పాటు సృజనాత్మకతను వెలికి తీసి, దానికి సానబట్టి, నిష్ణాతులుగా తీర్చిదిద్దడంతో సాక్ చేయూతనిస్తోంది. వరంగల్ నిట్‌లో ప్రతీ సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే టెక్నోజియాన్, స్ప్రింగ్ స్ప్రీ, స్పిక్‌మేకే, యూత్‌ఫెస్ట్, ఫిల్మ్ ఫెస్టివల్, ఇంటర్ టోర్నీల్లో విద్యార్థులు సత్తాచాటుతుండడం వెనుక స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్, ఇందులో అంతర్భాగమైన టెక్నికల్, అథ్లెటిక్, కల్చరల్, ఫిల్మ్ అండ్ మ్యూజిక్ సొసైటీలే కారణం.

టెక్నికల్ సొసైటీ..

ఈ సొసైటీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న సరికొత్త పరిణామాలు, ఆవిష్కరణలను విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు సెమినార్లు, సింపోజియాలు, వర్క్‌షాపులను నిర్వహిస్తోంది. తద్వారా విద్యార్థుల్లో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. సరికొత్త సాంకేతిక పరికరాలు, భౌతిక నమూనా రూపకల్పన, అభివృద్ధిలో విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తోంది. అంతేకాకుండా సృజనాత్మక సాఫ్ట్‌వేర్, గ్రాఫిక్ ఆధారిత నమూనాలు, గేమింగులు, ఇతర సవాళ్లు, అనువర్తనాలతో సహా కంప్యూటర్ ఆధారిత కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ.. వీటిల్లో పోటీలను నిర్వహిస్తోంది. ప్రధానంగా నిట్‌లోని వివిధ విభాగాల సహకారంతో ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో ఏటా సాంకేతిక పండుగ టెక్నోజియాన్‌ను భారీ ఎత్తున నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో లబ్ధప్రతిష్టులైనవారితో వైజ్ఞానిక ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నది. జాతీయ స్థాయిలో జరిగే పోటీలు, సెమినార్లలో వరంగల్ నిట్ విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా ప్రోత్సహిస్తోంది.

అథ్లెటిక్స్ సొసైటీ

ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులందరిని వారికి నచ్చిన ఆటలు, క్రీడాకార్యకలాపాల్లో పాల్గొనేట్లు అథ్లెటిక్ సొసైటీ ప్రోత్సహిస్తోంది. నిత్యం విద్యార్థులకు ఆటల్లో శిక్షణనిస్తోంది. ఏటా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులను అందిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో వరంగల్ నిట్ విద్యార్థులు భాగస్వాములయ్యేలా చూస్తోంది. క్రీడల, సంబంధిత అంశాలపై సెమినార్లు, వర్క్‌షాపులు, శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది.

ఫిల్మ్ అండ్ మ్యూజిక్...

ఏటా సంగీతం, ఫొటోగ్రఫీ, డ్యాన్స్ ఫెస్టివల్స్‌ను నిర్వహించడం ద్వారా ఈ కళల్లో విద్యార్థుల ప్రతిభకు ఈ సొసైటీ సానబడుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళా బృందాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా బహుళ సంస్కృతుల సమ్మేళనంలో నిట్ విద్యార్థులను భాగస్వాములను చేస్తోంది. ముఖ్యంగా ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో స్పిక్‌మేకే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా వారిలో సంగీత జిజ్ఞాసను పెంపొందిస్తోంది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన సంగీత విద్వాంసులను ఆహ్వానించి వారితో ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తోంది. విద్యార్థులకు సంగీతం, ఫొటోగ్రఫీ, నృత్యాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. సంగీత, నృత్య ఫొటోగ్రఫీ తదితర రంగాల్లో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఏటా యూత్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేరుగాంచిన సినిమాలను తెప్పించి విద్యార్థులు, సిబ్బందికి కాలేజీ ఆడిటోరియంలో ప్రదర్శింప చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ ఏటా చలనచిత్రోత్సవాన్ని నిర్వహిస్తోంది.

స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ ఏర్పాటు వెనుక ఒక మహత్తర లక్ష్యం, దూరదృష్టి ఉన్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలకు చెందిన విద్యార్థుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సెంటర్ ఏర్పాటైంది. నిట్‌లో నిత్యం చదువులో మునిగితేలే విద్యార్థులకు ఆటవిడుపుగా వారు పాఠ్యేతర కార్యకలాపాల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహిస్తారు. అలాగే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పొంపొందించడం, వ్యవస్థాపకత, వినూత్న నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఎంతో సహాయపడుతోంది. కాలేజీలో ఏటా

సాక్ ఏర్పాటు లక్ష్యం...

సాంకేతిక, సాంస్కృతిక, అథ్లెటిక్స్, చలన చిత్ర, సంగీత కార్యక్రమాల్లో ఇంటర్ నిట్ పోటీలను, ఇతర అంతర్, సంస్థాగత కార్యకలాపాలను నిర్వహిస్తోంది. సాక్ ఆధ్వర్యంలో నాలుగు సొసైటీలు విజయవంతంగా పని చేస్తున్నాయి. వేటికవే తమ నిర్దేశిత లక్ష్యాలు, ఉద్దేశాలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ సొసైటీలకు ప్రతినిధులు విద్యార్థులే. సారథ్యంలోనే ఏ కార్యక్రమమైనా నడుస్తుంది. ఈ క్రమంలో నిట్ అధికారులు వారికి మార్గదర్శనం చేస్తారు.


స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా సినీ నేపథ్య గాయని గీతామాధురి మ్యూజికల్ నైట్ (ఫైల్)

కల్చరల్ సొసైటీ

సృజనాత్మక రచన, కవిత్వం, నాటకం, కళ, క్రాఫ్ట్, శిల్పం, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, క్విజ్ తదితర విభాగాల్లో పాఠ్యేతర కార్యకలాపాల్లో భాగంగా విద్యార్థులు పాల్గొనేలా కల్చరల్ సొసైటీ కృషి చేస్తోంది. సృజనాత్మక రచనపై వర్క్‌షాపులు, జాతీయ లేదా ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, కళాశాల దినోత్సవం లాంటి వేడుకలు కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీలను కూడా సొసైటీ నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) వేడుకలు ఈ సొసైటీ నేతృత్వంలోనే జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే సాంస్కృతిక బృందాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా బహుళ సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టించడంలో కల్చరల్ సొసైటీ కీలక భూమిక పోషిస్తోంది.


ఇటీవల నిట్‌లో జరిగిన స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటకం (నుక్కడ్)


నీలి నీలి.. ఆకాశం..



అప్పటివరకు సూర్యుడు సుర్రుమన్నాడు. ఎండతీవ్రతకు జనం అల్లాడిపోయారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు పడగా.. హనుమకొండలో వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. నీలిరంగు మేఘాలతో.. చల్లని గాలులతో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఉపశమనాన్ని పంచింది. ఆ సమయంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఓ వైపు పచ్చని చెట్లు.. వాటి మధ్య ఠీవిగా నిలిచిన కాకతీయ తోరణం.. పైన నీలి మేఘాలు ఆవరించిన ఆకాశం చూపరులను ఎంతగానో అలరించాయి.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

కాళేశ్వరంలో గోదావరి ఒడ్డున జ్ఞానతీర్థం


కాళేశ్వరంలో గోదావరి ఒడ్డున ఏర్పాటు చేయబోయే జ్ఞాన తీర్థం విగ్రహ నమూనా

- ప్రయాగరాజ్ తరహాలో ఏర్పాటుకు సన్నాహాలు
- అబ్బురపరిచేలా సుమారు రూ.20లక్షలతో నిర్మాణం
- సరస్వతి పుష్కరాలకు ముందే పూర్తయ్యేలా కసరత్తు

మహదేవపూర్ , ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రయాగరాజ్ తరహాలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి ఒడ్డున జ్ఞానతీర్థం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏర్పాట్లలో భాగంగా మహా కుంభమేళాలో ఏర్పాటు చేసిన విధంగా కాళేశ్వరం గోదావరి పుష్కర ఘాట్ వద్ద భక్తులను ఆకట్టుకునేలా.. అబ్బురపరిచేలా జ్ఞాన తీర్థం విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రయాగరాజ్‌లో రెండు చేతులతో నమస్కరించే నమూనా విగ్రహాలను ఏర్పాటు చేయగా పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాలలో ప్రయాగరాజ్ విగ్రహాలకన్నా అద్భుతంగా జ్ఞానాన్ని పంచేలా జ్ఞాన సరస్వతి చేతుల్లో తాళపత్రాలు చేతులలో ఉంచి జ్ఞాన తీర్థం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను రూ.20 లక్షలు వెచ్చించనున్నారు. విగ్రహ ఏర్పాటుకు దేవాదాయ శాఖ స్థపతి, ఆర్కిటెక్చర్ అధికారులు మూడు రోజుల పాటు పుష్కర ఘాట్ వద్ద కొలతలు తీసుకొని అందుకు తగిన నమూనా చిత్రాన్ని తయారు చేశారు. పుష్కరాల కన్నా ముందే ఈ విగ్రహాలను పూర్తిచేసేలా కసరత్తు చేస్తున్నారు.


ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలు..

కష్టాలు గట్టెక్కే.. నీటిడ్రమ్ముతో నడిచొచ్చే..

నేటికీ పల్లెల్లో నీటి కష్టాలు కనిపిస్తూనే ఉన్నాయి. చాలామంది గ్రామీణులు ముఖ్యంగా ఆడవిబిడ్డలు నీటికోసం మైళ్ల దూరం నడిచేవారు. బిందెలను నెత్తినపెట్టుకుని ఆపసోపాలు పడుతూ ఇల్లు చేరే వారు. ఆ పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించేలా ములుగు జిల్లాలోని పలు గిరిపల్లెల ఆడబిడ్డలకు నాబార్డ్ అనే స్వచ్ఛంద సంస్థ 2018లో నెట్టుకుంటూ వెళ్లే నీటిడ్రమ్ములను అందజేసింది. వాటిని నేటికీ వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం పరిధిలోని తక్కళ్లగూడెం గ్రామంలో ఓ మహిళ చేతిపంపు ద్వారా ఆ డ్రమ్ములో నీటిని పట్టుకుని ఇదిగో ఇలా ఇంటికి తీసుకుపోతూ కనిపించింది.

ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి



చేతిపంపు వద్ద డ్రమ్ములో నీటిని పట్టుకుని, ప్లాస్టిక్ డ్రమ్మును బండిగిర్రలా సునాయాసంగా ఇంటి తీసుకెళుతున్న మహిళ

ఈశ్వర్.. ఈల వేస్తే!

- అరుదైన కళలో రాణిస్తున్న ఓరుగల్లు బిడ్డ
- మల్టీట్యాలెంటెడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న యువ కళాకారుడు

వడ్డెపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈల పాటలకు పెట్టింది పేరు ఈశ్వర్. ఈలతో అలవోకగా పాటలు పాడుతూ అందరిని ఆకట్టుకుంటున్నాడు. కాజీపేట పట్టణ ప్రాంతంలోని ఫాతిమా నగర్ ప్రాంతానికి చెందిన కీర్తి సుమతి- తిరుపతి దంపతుల కుమారుడు వెంకటరత్నేశ్వర్. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళల విభాగంలో పీజీ పూర్తి చేశాడు. నటనపై మక్కువ, పాటలు పాడే సరదా బాల్యం నుంచే ఉండేది. ఎలాగైనా గాయకుడు కావాలనే పట్టుదలతో నాలుగు సంవత్సరాల పాటు వరంగల్ సంగీత నృత్య కళాశాలలో హిందుస్థాని గాత్రాన్ని అభ్యసించారు. అదే సమయంలో టీవీకి సంబంధించిన పలు పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తున్నా పోటీల్లో నెగ్గక వెనకబడి పోయేవారు. తగిన విధంగా గుర్తింపు రాకపోవడంతో తనకు వచ్చిన కొత్త ఆలోచనకు రత్నేశ్వర్ శ్రీకారం చుట్టారు. ఈల పాటను సాధన చేస్తూ సమయం దొరికినప్పుడల్లా పలు వేదికల్లో ప్రదర్శనలు ఇస్తూ ప్రతిభను కనబర్చే వారు. ఈ క్రమంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో పదేళ్ల క్రితం నిర్వహించిన పాటల పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఈ పోటీలలో గాయనీ గాయకులు గాత్రం ద్వారా పాటలను ఆలపిస్తే రత్నేశ్వర్ ఈల పాట ద్వారా పాటలను ఆలాపించి పలువురి చేత ఔరా అనిపించుకొని అభినందనలు అందుకొని ప్రత్యేక బహుమతిని కైవసం చేసుకున్నారు. ఇక వరంగల్‌లోని రెడ్ ఎఫ్ఎంలో తొలిసారి ఈలతోపాటలు పాడే అవకాశం రత్నేశ్వర్‌కు లభించింది. తన ఈల పాట ప్రస్థానం ద్వారా పలువురు శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఆ తర్వాత వరంగల్‌లోని ఆల్ ఇండియా రేడియోలో వచ్చే యువవాణి కార్యక్రమం, ఈ ఎఫ్ఎం వరంగల్, ఈ ఎఫ్ఎం తిరుపతిలాంటి వాటితో పాటు పలు టీవీచానళ్లలో ప్రసారమయ్యే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. అలా రత్నేశ్వర్ ఈల పాటతో పాటు వివిధ ఈవెంట్స్ చేస్తూ తన ప్రతిభను చాటుకుంటూ మల్టీ ట్యాలెంటెడ్‌గా నిలుస్తున్నాడు.


బుల్లితెరపై ప్రసారమయ్యే ఓ కామెడీ షోలో ఈశ్వర్


ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ఈల పాట ప్రదర్శిస్తున్న ఈశ్వర్ (ఫైల్)

ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో ప్రత్యేకం..

ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 2021 డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్వహించిన టీవీ షోలో రత్నేశ్వర్‌కు ఈల పాట పాడే అవకాశం లభించింది. ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో వచ్చిన చౌరస్తా అనే కామెడీ షోలో నటించి ప్రేక్షకులు , శ్రోతలను మెప్పించి, మైమరిపించారు. ఈల పాట ద్వారా ఈల పాట ఈశ్వర్‌గా పేరును మార్చుకున్న అతడు పలు వేదికలపై ప్రేక్షక సమాజాన్ని మెప్పిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

పర్యాటక ప్రదేశాలకు బస్సులెలా?

నగరంలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలంటున్న ప్రజలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నగరంగా, కాకతీయులు పరిపాలించిన రాజ్యంగా, జైనులు కొలిచిన దేవతల పుణ్య ప్రదేశంగా ప్రసిద్ధికెక్కిన ఓరుగల్లు పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి గాంచింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖ్యాతికెక్కిన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటిని తిలకించడానికి ప్రతీరోజు ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం పర్యాటకులు వస్తుంటారు. వీరు ముఖ్యంగా భద్రకాళి అమ్మవారిని, రుద్రేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ ఆలయాల సందర్శనకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం కష్టంగానే ఉంది. ప్రత్యేక వాహనం ద్వారాగానీ ఆటోల ద్వారా గాని వెళ్లాల్సివస్తోంది. దీనివల్ల పర్యాటకులు ఇబ్బందిపడుతున్నారు. అందువల్ల ఈ ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేక బస్సులను నడిపించాలని పర్యాటకులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్ల నుంచి ఉచిత బస్సులు

కాజీపేట, వరంగల్ ప్రాంతాలకు రైలు మార్గం ద్వారా దేశం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వస్తుంటారు. వీరు వరంగల్‌లో భద్రకాళి అమ్మవారిని, హనుమకొండలో వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శిస్తారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి భద్రకాళి దేవాలయానికి దాదాపు 3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. వేయి స్తంభాల దేవాలయం 5 కిలో మీటర్లు ఉంటుంది. కాజీపేట నుంచి వేయి స్తంభాల దేవాలయం 10కిలో మీటర్లు, భద్రకాళి దేవాలయం 12 కిలో మీటర్ల దూరం ఉంటుంది. హనుమకొండ బస్టాండ్ నుంచి వేయి స్తంభాల దేవాలయం 1 కిలో మీటరు, భద్రకాళి దేవాలయం 3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. భక్తుల కోసం రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల నుంచి ఈ ఆలయాలకు దేవస్థానం నుంచి గాని లేక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గాని రెండు బస్సులు ఉచితంగా నడపాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు..

వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన ఆత్మకూరు పంచలింగ శివాలయం, కాళేశ్వరం, రామప్ప దేవాలయం, లక్నవరం చెరువు, మేడారం సమ్మక్క- సారలమ్మ గద్దెలు, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలు తిలకించడానికి హనుమకొండ, వరంగల్ బస్టాండ్ల నుంచి ప్రతీ రోజు బస్సులు నడుపాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఖిలా వరంగల్, జూపార్కు, గోవిందరాజుల గుట్ట, మ్యూజికల్ గార్డెన్, భద్రకాళి దేవాలయం, వేయిస్తంభాల గుడి, కలెక్టర్ ఆఫీస్, కాకతీయ యూనివర్సిటీ, మెట్టు రామలింగేశ్వర ఆలయం, నిట్ ప్రాంగణం, భద్రకాళి బండ్ ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల భక్తులు కోరుతున్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి వేడుకలు గురువారం 5వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం స్వామి వారికి పంచరాత్ర ఆగమానుసారం వైష్ణవ ఆగమ పండితుడు విజయకుమారచార్యుడు పురుషసూక్త విధానంతో శ్రీ సీతారామచంద్ర ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన గులాబీ, కనకాంబరాలు, మల్లెపూలతో నేత్ర పర్వంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మణికంఠశర్మ ఇతర అర్చకులు పాల్గొన్నారు. అదేవిధంగా యాగశాలలో మహాసుదర్శన హోమం కుడా 5వ రోజు కొనసాగింది.


సీతారాములకు పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు


సీతారామచంద్ర స్వామికి కల్యాణ వస్త్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ ఆవాల రాధికానరోత్తంరెడ్డి దంపతులు

మడికొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపుకొట్టడం, మంత్రపుష్పం, తీర్థగోష్ఠి, సాయంత్రం సహస్రనామార్చనలు జరిగాయి. ఈ సందర్భంగా 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికానరోత్తంరెడ్డి దంపతులు, కుందూరు విజయనరోత్తంరెడ్డి దంపతులు ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం స్వామి వారికి కల్యాణ వస్త్రాలు, అర్చకులకు దీక్షా వస్త్రాలు సమర్పణ చేశారు. అలాగే ఎ.వెంకటరెడ్డి దంతులు స్వామి వారికి మధుపర్కాలు సమర్పణ చేశారు. ఈవో శేషభారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, రాజరాజేశ్వరి సేవా సమితి భక్త బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

6న గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ

వడ్డెపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గద్దర్‌పై తూటాలు పేల్చిన ఏప్రిల్ 6ను పురస్కరించుకొని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6న గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభను నిర్వహిస్తున్నట్లు గద్దర్ విగ్రహ కమిటీ జిల్లా అధ్యక్షుడు కోండ్ర నర్సింగరావు తెలిపారు. గురువారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశం లో వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజాస్వామిక వాదులు, కళాకారులు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గద్దర్ విగ్రహ కమిటీ ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఎబినైజర్, కన్నం సునిల్, నలిగంటి చంద్రమౌళి, కన్నాల రవి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీహర్ష అవధానం


అష్టావధానంలో పాల్గొన్న అవధాని, పృచ్ఛకులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హనుమకొండ లష్కర్ బజార్‌లోని శ్రీలక్ష్మి కల్యాణ మండపం వేదికగా బుధవారం రాత్రి జరిగిన తిరుక్కోవళులు శ్రీహర్ష అవధానం ఆద్యంతం అలరింపజేసింది. శ్రీవైష్ణవ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటగిరిధరకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హరిపురం సునంద, రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుణగిరి రవికుమార్, పద్మాకర్ సునంద, హరితజ్యోతి, నిర్మల, తాడూరి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరస్వామి, భార్గవి సాత్విక తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కవి డాక్టర్ టి.శ్రీరంగస్వామి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో టి.అరుణదేవి, పీతవరం శ్రీమన్నారాయణ, అంజనీదేవి, వకుళవాసు, చందన, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసయ్య, రవీంద్రనాథ్‌లు పృచ్ఛకులుగా వ్యవహరించారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


కుమ్మరిగూడెంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

మడికొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం కుమ్మరిగూడెంలోని శివాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని స్థానికులు గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పారుపెల్లి ఉపేందర్‌శర్మ మంత్రోచ్ఛారణలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ సర్పంచ్ భాస్కర్, ఆలయ చైర్మన్ కోడం కైలాసం, దేవరుప్పుల సాంబయ్య, ముచ్చు సాంబయ్య, మాతంగా రవి, పైడిపాల రవి, బత్తిని బాబు, కొప్పుల నవీన్, మానుపాటి రాజు, జిట్ట చంటి, ఇల్లందుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్‌ను అడ్డుకునేందుకు అనుమతించండి


ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు వినతి పత్రం అందజేస్తున్న అఖిలపక్షం

మడికొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డు నిర్మూలన కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో గురువారం మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్‌ను కలిశారు. ఈనెల 7న చెత్త డంపింగ్ వాహనాలను డంపింగ్ యార్డుకు వెళ్లకుండా అడ్డుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బీఆర్ఎస్ నాయకులు రాసమల్ల వెంకటస్వామి, అరూరి తిరుపతి, పరవస్తు రఘు పాల్గొన్నారు.

భూములమ్మితే ప్రభుత్వానికి పరాభవం తప్పదు


కేయూ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న విద్యార్థి జేఏసీ నేతలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములను కార్పొరేట్, ప్రైవేట్ వ్యక్తులకు అమ్మితే కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి పరాభవం తప్పదని కేయూ విద్యార్థి జేఏసీ నేతలు హెచ్చరించారు. గురువారం కేయూ విద్యార్థి సంఘాల నేతలను హైదరాబాద్ సెక్రటేరియట్ ముట్టడి పిలుపు నేపథ్యంలో ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థి సంఘాల నేతలు మంద నరేశ్, హాకీం నవీద్, వడ్డెపల్లి మధు, మున్న గణేశ్, రోహిత్, రాచకొండ రంజిత్, కొమలపల్లి శివ, చెట్టుపల్లి శివకుమార్, అడ్డూరి గణేశ్, అరెపల్లి తిలక్, యూ.గణేశ్, ఆర్.ఆదిత్య పాల్గొన్నారు.

'సేవ్ హెచ్‌సీయూ' సంతకాల సేకరణ

హనుమకొండ టౌన్: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సేవ్‌హెచ్‌సీయూ కార్యక్రమాన్ని బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన చేస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ కేయూ నాయకులు గొల్లపల్లి వీరస్వామి, పస్తం అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భూములను భవిష్యత్ తరాలకు అందించాలి

మడికొండ: చలో హైదరాబాద్ సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ అరూరి రంజిత్‌ను గురువారం మడికొండ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ 400 ఎకరాల భూములను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు.భూముల అమ్మకం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి నాయకులను విడుదల చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లోని సెక్రటేయట్‌లో అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడిలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. 400 ఎకరాల వర్సిటీ భూములను ప్రభుత్వం అమ్ముకోవడం సరికాదని తెలిపారు. వేలం నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే విరమించుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన పిచ్చిపాలన పద్ధతిని మార్చుకోకపోతే నిరసన సెగలు తప్పవని హెచ్చరించారు.

వివాహిత అదృశ్యం



హసన్‌పర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలో జరిగింది. కేయూ ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన వివాహిత బండి రాధిక భీమారంలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్య నభ్యసిస్తోంది. ఆమె బుధవారం భర్తతో కలిసి కళాశాలకు ఫీజు కట్టేందుకు వచ్చింది. ఈ క్రమంలోనే కొన్ని కాగితాల జిరాక్స్ కాపీలు అవసరం ఉండగా, భర్త ఆమెను కళాశాల వద్దే ఉంచి సమీపంలోని మీసేవా కేంద్రానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఆమె కనిపించకపోవడంతో భార్య కోసం వివిధ ప్రదేశాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త కేయూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు కేయూ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివాహిత ఆచూకీ తెలిసిన వారు కేయూ ఎస్సై సెల్:8712685089, కేయూ పీఎస్ సెల్:8712685004 నెంబర్లను సంప్రదించాలని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఉపాధి హామీ పథకంతో
రైతులకు మెరుగైన సేవలు

ముఖాముఖి


విజయలక్ష్మి
ఏపీవో

ఆంధ్రజ్యోతి: మండలంలో జాబ్ కార్డులు ఎన్ని ఉన్నాయి?
ఏపీవో: 6,102 కార్డులు ఉన్నాయి.
ఆంధ్రజ్యోతి: ఎటువంటి పనులు చేపడుతున్నారు?
ఏపీవో: రైతుల భూముల్లో మట్టి రోడ్లు, కందకాల తవ్వకం, మామిడి తోటల పెంపకం, ఆయిల్‌పామ్ మొదలైన పనులు చేపడుతున్నాం.
ఆంధ్రజ్యోతి: కూలీలకు ఎన్ని పని దినాలు కల్పించారు?
ఏపీవో: 1,52,627 పని దినాలు కల్పించాం.
ఆంధ్రజ్యోతి: మండలంలో ఏ పనులకు ఎంత ఖర్చు చేశారు?
ఏపీవో: కూలీలకు రూ.3.38 లక్షలు ఖర్చు చేశాం.
ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంత శాతం పనులు పూర్తి చేశారు?
ఏపీవో: 100 శాతం పనులు పూర్తి చేశాం.

- హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో
పాముల సంచారం

హసన్‌పర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చర్ల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చీమలు చేసిన పుట్టలో పాముల సంచారం పెరిగింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు భయానికి గురవుతున్నారు. గురువారం ఒంటిపూట బడి ముగిసిన తరువాత ముచ్చర్ల జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో ఓ విషసర్పం తిరుగుతుండడాన్ని గమనించిన స్థానికుడు వెంటనే అప్రమత్తమై పక్కనే ఉన్న దుడ్డు కర్రతో చంపివేశాడు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాలఆవరణలో సంచరిస్తున్న విషసర్పాల కాటుకు విద్యార్థులు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్సైలు జనార్ధన్, ప్రేమలతను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గురువారం సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సురేశ్ కుమార్, ఏఓ రామకృష్ణ , సూపరింటెండెంట్ రమాదేవి, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా రహమాన్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఎంఎస్ రహమాన్ నియమితు లయ్యారు. ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ కాంట్రాక్టు అధ్యాపకుడిగా పని చేస్తున్న రహమాన్ ఏడాది పాటు వైస్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతారు.

వైద్య పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించిన జడ్జి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జి రమేష్‌బాబు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ న్యాయవాదుల సౌకర్యార్థం జిల్లా కోర్టు ప్రాంగణంలో వైద్య పరీక్షా కేంద్రాన్ని గురువారం జిల్లా జడ్జిలు నిర్మల గీతాంబ, సీహెచ్.రమేష్‌బాబులు ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది ఎల్.అయోధ్య రామయ్య స్మారకార్థం న్యాయవాది కొండూరు పశుపతి ఆర్థిక సహకారంతో ఈ కేంద్రాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సొసైటీ అధ్యక్షుడు కె.విజయ్ భాస్కర్‌రావు, ఉమ్మడి జిల్లా బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, బార్ కౌన్సిల్ సభ్యులు సిరికొండ సంజీవరావు, బైరపాక జయాకర్, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం ఇరువురు జిల్లా జడ్జిల చేతుల మీదుగా న్యాయశాఖ ఉద్యోగుల అసోసియేషన్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు.

సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య


కేయూలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వల్లూరి రామచంద్రం తదితరులు


బీఆర్ఎస్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

▸▸ కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మొదటి సాయుధ తెలంగాణ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య అని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ పరిపాలన భవనం వద్ద కేయూ బీసీ సెల్ నేతృత్వంలో దొడ్డి కొమురయ్య 98వ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, అకూట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

హనుమకొండ టౌన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నయీమొద్దీన్, సల్వాజి రవీందర్‌రావు, తుమ్మ ఆనంద్, రాజు యాదవ్, కోటేశ్వర్‌రావు, పి.రాజ్‌కుమార్, దేవమ్మ, రఘు, ఖలీల్ పాల్గొన్నారు.

డ్రాయింగ్‌లో
గురుకుల విద్యార్థుల ప్రతిభ

మడికొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యారు. అమ్మ బన్నీ ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించారని, అలాగే గంగారపు ప్రణయ్, ఆరెపల్లి క్రిష్ణ కౌశిక్, సుర నిశాంత్, సన్నూరు విఘ్నేష్, గాదె శివకుమార్, నాంపల్లి సాయివర్ధన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు గురువారం ప్రిన్సిపాల్ బత్తుల కుమారస్వామి తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన చిత్రకళా ఉపాధ్యాయుడు పడాల రాజేందర్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, వెంకన్న, టెన్‌సింగ్, శ్రీను, శ్రీనివాస్, వీరస్వామి, జ్యోతి, స్వాతి, భావన, హారతి, రోజారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కుమారస్వామి

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలుశిక్ష

కాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలుశిక్ష పడింది. కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టగా మద్యం సేవించి ఐదుగురు పట్టుబడ్డారు. పట్టుబడ్డవారిని వారిని గురువారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ఫాతిమా చిన్నప్ప ఎదుట హాజరుపర్చగా ఐదుగురికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగబాబు తెలిపారు.

జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడంతోపాటు ఉద్యమ వార్తలను అందించిన తెలంగాణ జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలని తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ అధ్యక్షుడు మోహన్ బైరాగి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంపెల్లి మత్తేష్ ఆధ్వర్యంలో ఈనెల 13న హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేయనున్న తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగంలో వస్తున్న పెను మార్పులతో వేల సంఖ్యలో జర్నలిజంలోకి వస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియర్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాజేంద్రప్రసాద్, ఎల్.రాజు, బొడ్డు అశోక్, చార్వాక, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు వేముల యాదగిరి, బాబన్న, యారా సాంబయ్య, గంగారపు విజయ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పశువైద్యాధికారి

హసన్‌పర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పశువైద్యాధికారిగా టి.మాలవిక గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది వీఎల్‌వో బింగి సురేష్, ఎల్ఎస్ఏ అబ్దుల్ నబీ, ఓస్‌లు సాధిక్, రాహుల్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


సన్మానంలో పాల్గొన్న గ్రామస్థులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ ముచ్చర్ల జడ్పీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గోవింద రంగనాథ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై హెచ్ఎం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాజిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రామక్రిష్ణ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీరాజ్యం, శ్రీధర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన బల్దియా టీపీబీవోలు

- 13 మంది ఉద్యోగులు బల్దియాకు నియామకం
- సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు జారీ



వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బల్దియాకు 13 మంది టీపీబీవో (టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్స్)లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కాగా, గురువారం బల్దియా కార్యాలయంలోని సీ-1 సెక్షన్ సూపరింటెండెంట్ రావుల ఆనంద్‌ను కలిసి వారి నియామక పత్రాలను అందించారు. ప్రస్తుతం 10మంది ఉద్యోగులు రిపోర్టు చేశారని, ఇంకా ముగ్గురు రావాల్సి ఉందని ఆనంద్ వెల్లడించారు. కాగా,వీరు టౌన్ ప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న సీనియర్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు కొద్దిరోజుల పాటు సహాయకులుగా పని చేస్తారు. 13 మందికి గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో తలా కొన్ని డివిజన్‌లను కేటాయిస్తారు. వీరు 2023లో నిర్వహించిన టీఎస్‌పీఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. మెరిట్ ప్రకారం 13 మంది టీపీబీవోలను నియమించారు. 2024లో ఉద్యోగ నియామక జాబితా వెల్లడించగా, గత నెల మార్చి 24న హైదరాబాద్ రవీంద్రభారతీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందించినట్లు జూనియర్ ఉద్యోగులు వెల్లడించారు.

అభయాన్నిచ్చే శ్రీరామనామం!

వాల్మీకి రామాయణాన్ని అనుసరించి శ్రీరామచంద్రుడు మధుసూదన మాసము (చైత్ర మాసం)లో జన్మించాడు. ఆయన జన్మించిన శుక్లపక్ష నవమి తిథిని అందరూ శ్రీరామ నవమి మహోత్సవంగా జరుపుకుంటారు.

హరేకృష్ణ



6న శ్రీరామ నవమి

భగవన్నామాన్ని జపిస్తే భగవంతుడు మనవద్దనున్నట్టే. రామ నామాన్ని జపించేవారికి ఆ నామమే అభయాన్ని ప్రసాదిస్తుంది. శ్రీరామచంద్ర ప్రభువు నేటికీ తన నామ రూపంలో ఈ లోకంలోనే వున్నాడు!

భగవద్గీతలో ఉద్బోధించినట్లు దుష్ట శిక్షణకు.. శిష్ట రక్షణకు.. ధర్మ సంస్థాపనకు భగవంతుడు యుగ యుగాన అవతరిస్తాడు. జీవుడు భగవంతుణ్ణి శరణు పొందే మార్గాన్ని సుగమం చేస్తాడు. అలాంటి అవతారమే శ్రీరామచంద్రుడు. దేవదేవుడిని శరణు పొందిన వారెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్న సత్యాన్ని లోకానికి నిరూపించటమే శ్రీరామ అవతరణలోని ముఖ్యఉద్దేశం. శ్రీమద్రామాయణ, భాగవతాదుల్లో పొందుపరచిన శ్రీరాముని లీలల్లో తరచూ ఈ సూత్రమే గోచరిస్తుంటుంది. భగవంతుడు అవతరించటం అంటే తన స్వధామం నుండి ఈ భూలోకానికి దిగివచ్చే ప్రక్రియ. శ్రీరాముడు ఆధ్యాత్మిక లోకంలోని అయోధ్య ధామం నుండి భూలోకంలోని అయోధ్యలో అవతరించాడు. మానవ జన్మలు కర్మఫలానుసారం జరుగుతాయి. కానీ భగవంతుడి అవతరణ ఆయన సంకల్పం ఆధారంగానే జరుగుతుంది. ఇక్కడ ఒక విషయాన్ని చెప్పుకోవాలి. భగవంతుడు శాశ్వతుడు. ఈ కోణం నుంచి చూస్తే రాముడు త్రేతా యుగానికే పరిమితం కాదు. ఆయన సర్వకాలాలలో సర్వజీవులకు పూజనీయుడు.

లీలా మహత్యం...

సూర్యుడు ఒకచోట అస్తమిస్తే, మరోచోట ఉదయిస్తాడు. అలాగే భగవంతుడి వేడుకలు కూడా ఈ ప్రపంచంలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంటాయి. ఈ వేడుకను మనం జరుపుకోవటం ద్వారా నిత్యలీలల్లో పాల్గొనే భాగ్యం లభిస్తుంది. భగవంతుని అనుగ్రహానికి పాత్రులం కాగలుగుతాం. సాధారణంగా భగవంతుడు తన లీలలను ప్రదర్శించేది జీవులకు సేవాభాగ్యాన్ని కల్పించటం కోసమే. అంతే కాకుండా ప్రతి లీలలో ధర్మం నిబిడీకృతమై ఉంటుంది. వీటిని అర్థం చేసుకున్నప్పుడు... జీవితంలో ఏ మార్గాన్ని అనుసరించాలనేది తెలుస్తుంది. సంప్రదాయక ఆచార్యుల ద్వారా ఈ లీలలను తెలుసుకుంటే వాటికి ప్రామాణికత ఉంటుంది. లేకపోతే తప్పుగా అర్థం చేసుకొనే అవకాశమూ ఉంటుంది.

శ్రీరామ రక్ష...

"ఎవరైనా నన్ను ఒక్కసారైనా నిజముగా శరణువేడి స్వామీ! ఈ రోజు నుండి నేను నీ వాడను అంటూ తనకు అభయమొసగమని ప్రార్థిస్తే, అట్టివానికి ఆ క్షణము నుండి అభయమిచ్చి సర్వదా సంరక్షించెదను" అని రాముడే స్వయంగా ప్రకటిస్తాడు. ఈ ధోరణి శ్రీరామచంద్రుడి లీలా వైభవంలో అడుగడుగునా దర్శనమిస్తుంది. రావణాసురుని నుండి తమను రక్షింపమని దేవతలే అడిగినా లక్ష్మణుని తల్లికి.. సుగ్రీవునికి లేదా విభీషణుడికి ఇచ్చిన మాటైనా.. ఇలా ప్రతి సందర్భంలోనూ అందరికీ రాముడు అభయమిస్తాడు. అలాంటి రాముడిని చేరుకోవటానికి ఉత్తమమైన మార్గం... భగవన్నామ జపం. "భిన్నత్వాన్ నామ నామినో" అంటుంది పద్మపురాణం. భగవన్నామానికి మరియు భగవంతునికి మధ్య ఎట్టి వ్యత్యాసమూ లేదని దీని అర్థం. భగవన్నామాన్ని జపిస్తే భగవంతుడు మనవద్దనున్నట్టే. రామ నామాన్ని జపించేవారికి ఆ నామమే అభయాన్ని ప్రసాదిస్తుంది. శ్రీరామచంద్ర ప్రభువు నేటికీ తన నామ రూపంలో ఈ లోకంలోనే ఉన్నాడు.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

స్థితప్రజ్ఞత అదే

భారతీయులకు శ్రీరాముడు ఆరాధ్యదైవం. మన దేశంలో రామాలయం లేని గ్రామమే ఉండదు. భారతీయులందరూ శ్రీరాముడిని ఎందుకు కొలుస్తారు? ఈ ప్రశ్న అనేక మందిలో తలెత్తుతూ ఉంటుంది. దీని వెనకున్న కారణాలు చూద్దాం.

జాగ్రత్తగా గమనిస్తే శ్రీరాముడి జీవితమంతా విపత్తుల విలయంలో చిక్కుకున్నట్లు కనిపిస్తుంది. రాజ్యాన్ని కోల్పోయి అడవుల పాలవుతాడు. తన భార్యను అపహరించిన రావణుడితో తనకు ఏ మాత్రం ఇష్టంలేని యుద్ధం చేస్తాడు. రాజ్యానికి తిరిగి వచ్చిన తర్వాత తన భార్య గురించి తన రాజ్య ప్రజలే తక్కువ చేసి మాట్లాడటం విని నొచ్చుకుంటాడు. తప్పనిసరి పరిస్థితుల్లో విషాద హృదయంతో.. తనకు అత్యంత ప్రాణప్రదమైన సీతను.. నిందచూలాలని కూడా చూడకుండా అడవిలో వదిలిపెడతాడు. ఇవన్నీ చాలవన్నట్లు తెలియకుండానే.. పుత్రులతో యుద్ధం చేస్తాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అనర్థాలు. ఇలాంటి సమయంలో రాముడు ఎలా ప్రవర్తించాడు? ఇతరులకు ఎలా ఉదాహరణగా నిలిచి స్థితప్రజ్ఞుడనిపించుకున్నాడనేదే ముఖ్యమైన విషయం.


అన్నింటినీ తట్టుకొని...

ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల వ్యక్తిత్వం రాముడి సొంతం. ఎంతటి విపత్తు వచ్చినా.. దానికి కారణమైన ఇతరులను ఆయన ఎప్పుడూ దూషించలేదు. ఎందుకంటే- బాహ్య పరిస్థితులు మన చేతులో ఎప్పుడూ ఉండవు. అవి తారుమారు అవుతూనే ఉంటాయి. వాటిని ఎదుర్కోగలగటమే రాముడి వ్యక్తిత్వం. ఒక ఉదాహరణ చూద్దాం. తుఫాను వస్తుందని మీకు ముందే తెలుసు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ ఊహించిన దాని కన్నా పెద్ద తుఫాను వచ్చి ఇంటిని ఊడ్చుకుపోతే? 'నాకు ఇలాంటి దుర్ఘటనలు జరగవు' అనుకోవటం అవివేకుల లక్షణం. 'ఎలాంటి దుర్ఘటనలు జరిగినా నేను ఎదుర్కొంటాను' అనుకోవటం వివేకవంతుల లక్షణం. ఇలాంటి వివేకాన్ని పంచగలిగాడు కాబట్టే రాముడు అందరికీ ఆరాధ్యుడయ్యాడు. రాముడు ఎంత విపరీతం ఎదురయినా.. చెక్కు చెదరకుండా.. సత్యమార్గాన్ని వీడకుండా.. స్వధర్మాన్ని ఆచరిస్తూ వచ్చాడు. ఇక్కడ మనం ఒక విషయాన్ని చెప్పుకోవాలి. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే కొందరు విపత్తులను కావాలని.. జీవితం సజావుగా సాగకూడదని కోరుకుంటారు. భగవంతుడు తమకు సమస్యల ద్వారా పరీక్షలు పెడితే.. మరణించే ముందు తమకు తాము తెలుసుకొనే అవకాశముంటుందని వారు నమ్ముతారు. సాధనా క్రమంలో ఎంత పరిపక్వత సాధించామనే విషయాన్ని తెలుసుకోవటానికి ఎలాంటి విపత్తులనైనా ఆనందంగా ఎదుర్కొంటారు. మరణం ఆసన్నమయినప్పుడు ఏ మాత్రం తొణకకుండా దానిని హుందాగా అక్కున చేర్చుకోవాలనేది వీరి తపన.

అవలీలగా...

మీ జీవితంలో మీరేం చేశారు.. ఎంత సంపాదించారు.. ఏం జరిగిందీ.. ఏం జరగలేదు.. వంటి విషయాలకు ఎటువంటి విలువా లేదు. సంకటస్థితుల్లో ఉన్నప్పుడు మీరు ఒడ్డుకు ఎలా చేరారనేదే ముఖ్యం. శ్రీరాముడిలా అన్ని కష్టాలను అవలీలగా.. హుందాగా ఎలా ఎదుర్కొన్నారన్న విషయంపైనే జీవిత సాఫల్యం ఆధారపడి ఉంటుంది. మన దేశంలో అనేక ప్రాంతాల్లో ఇంద్రభవనం లాంటి ఇంటిని ఆనుకుని.. ఓ పూరి గుడిసె కూడా ఉంటుంది. పొరిగింటివాడంత ఐశ్వర్యం లేకపోయినా.. పూరి గుడిసెలో ఉన్నవాడూ అంత గర్వంగానూ ఉంటాడు. దీనికి కారణం అతనికి ఉన్న స్వాభిమానం. దీనికి సిరిసంపదలతో సంబంధం లేదు. ఈ స్వాభిమానం ఉంటే ఉరికంబం వైపు కూడా హుందాగానే నడుస్తారు. అయితే కేవలం స్వాభిమానం ఉంటే సరిపోదు. మన చుట్టూ ఉన్న బాహ్య పరిస్థితులను తప్పకుండా చక్కదిద్దుకోవాలి. ఎందుకంటే దానిలో మనతో పాటుగా ఇతరుల హితం కూడా ఉంది. రాముడే దీనికి ఉదాహరణ. ఆయన తన బాహ్యపరిస్థితులను చక్కదిద్దుకోవటానికి ప్రయత్నించాడు. కొన్ని సార్లు విఫలమయ్యాడు. కొన్ని సందర్భాలలో పరిస్థితులు చేయి జారిపోయినట్లు కనిపిస్తాయి కూడా. అయినా ఆయన శాంతాన్ని కోల్పోలేదు. తనకు అనుకూలంగా పరిస్థితులను సృష్టించుకున్నాడు. ఇది ఆధ్యాత్మిక ప్రయాణంలో ఉన్నవారికి ఒక ముఖ్యమైన పాఠం. మీ అంతరంగా పరిమళాలు వెదజల్లే పుష్పాలుగా వికసించాలంటే.. దానికి అనువైన వాతావరణాన్ని మీరే సృష్టించుకోవాలి.


పొరిగింటివాడంత ఐశ్వర్యం లేకపోయినా.. పూరి గుడిసెలో ఉన్నవాడూ అంత గర్వంగానూ ఉంటాడు. దీనికి కారణం అతనికి ఉన్న స్వాభిమానం. దీనికి సిరిసంపదలతో సంబంధం లేదు. ఈ స్వాభిమానం ఉంటే ఉరికంబం వైపు కూడా హుందాగానే నడుస్తారు.



ప్రేమాశీస్సులతో
సద్గురు



యుగయుగానికి ఓ రాముడు



పుట్టిన ప్రతి మనిషి మరణించక తప్పదు. ఇది తెలిసిన రాముడు మరణిద్దామనుకున్నాడు. "యమ! నువ్వు వచ్చి నన్ను వైకుంఠానికి తీసుకువెళ్ళు" అని కోరాడు. కానీ యముడు అయోధ్యకు వచ్చి రాముడిని తీసుకువెళ్లటానికి ఇష్టపడలేదు. కారణం హనుమంతుడు. ఆయన ఎప్పుడూ అయోధ్యను, రాముడిని కాపలా కాస్తూ ఉంటాడు. ఇది రాముడికి తెలిసింది. యముడు రావాలంటే హనుమంతుడు అయోధ్యలో ఉండకూడదు. దీనికి రాముడు ఉపాయం ఆలోచించాడు. తన ఉంగరాన్ని తీసి తన మందిరంలోని ఒక చీలికలో పడేశాడు. హనుమను పిలిచి "ఉంగరం పడిపోయింది. సూక్ష్మ రూపంలో వెళ్లి తీసుకురా" అని ఆజ్ఞాపించాడు. హనుమ చిన్న కందిరీగలా మారి చీలికలో దూరాడు. ఆ చీలిక ఒక సొరంగంలా మారింది. ఆ సొరంగం నాగలోకానికి నేరుగా చేరింది. హనుమంతుడు నాగలోక రాజైన వాసుకి దగ్గరకు వెళ్లి "నా రాముడి ఉంగరం పడిపోయి నీ లోకానికి చేరింది. దానిని తీసుకువెళ్లటానికి వచ్చా" అన్నాడు. వాసుకి చిరునవ్వు నవ్వి హనుమంతుడిని నాగలోకం మధ్యలోకి తీసుకువెళ్లాడు. అక్కడ కొన్ని వేల ఉంగరాలు గుట్టగా ఉన్నాయి. "ఈ గుట్టలో రాముడి ఉంగరం పడి ఉంటుంది. వెతుకు" అన్నాడు. 'ఈ గుట్టలో రాముడి ఉంగరం ఎలా వెతికాలి?' అనుకుంటూ హనుమ గుట్టపైకి వెళ్లాడు. అక్కడ రాముడి ఉంగరం కనిపించింది. హనుమంతుడికి విపరీతమైన ఆనందం కలిగింది. ఆ ఉంగరాన్ని తీసుకొని.. మరో ఉంగరం వైపు చూశాడు. అది కూడా రాముడి ఉంగరమే! ఒక్కొక్కటి చూస్తుంటే- అన్నీ రాముడి ఉంగరాలే! హనుమంతుడికి ఏం చేయాలో తెలియలేదు. అప్పుడు వాసుకి- "హనుమ! నువ్వు చూస్తున్నది నిజమే. కానీ ఇదంతా ఒక మాయ. ఈ ప్రపంచం చావు-పుట్టుకలనే చక్రంలో తిరుగుతూ ఉంటుంది. ఒక సారి చక్రం తిరిగితే దానిని కల్పం అంటారు. ఒకో కల్పంలోను నాలుగు యుగాలు ఉంటాయి. ఇది త్రేతా యుగం. దీనిలో రాముడు అయోధ్యలో పుట్టాడు. ఆయన చేతి ఉంగరం జారి సర్పలోకానికి వచ్చింది. దానిని వెతుక్కుంటూ ఒక వానరం వచ్చింది. ఈ లోపులో భూమిపై రాముడు మరణిస్తాడు. ఇలాంటి లక్షల కల్పాలు తిరుగుతూ ఉంటాయి. గుట్టలో ఉన్న ఉంగరాలే దీనికి నిదర్శనం. ఇది ఎంత కాలం జరుగుతుందో నాకు తెలియదు.." అన్నాడు. అప్పుడు హనుమంతుడికి రాముడు తనను ఉంగరం వెతకమని ఎందుకు పంపాడో అర్థమయింది. రాముడు మరణిస్తాడు. ప్రపంచం అంతమయిపోతుంది. మళ్లీ కొత్త ప్రపంచం పుడుతుంది. దానిలో మళ్లీ రాముడు పుడతాడు. ఈ సృష్టి రహస్యం హనుమంతుడికి అర్థమయిన తర్వాత మనసుకు ప్రశాంతత కలిగింది.

(కాలచక్రం మన భారతీయ తాత్విక చింతనలో ఒక ముఖ్యమైన అధ్యాయం. రాముడు ఒక ప్రాంతానికో.. ఒక ప్రాంత చరిత్రకో సంబంధించినవాడు కాదు. రాముడి పుట్టుపూర్వోత్రాలు కనుగొనటం కన్నా ఆ అవతారం వెనుకున్న తాత్విక చింతనను తెలియజేయటానికి ఈ కథను చెబుతారు.)

రక్షించేది విశ్వాసమే

సద్బోధ

జపాన్‌లో బహుళ ప్రచారంలో ఉన్న ఈ కథను యదార్థమైనదని చెబుతారు. యుద్ధవీరుడైన (సమురై) ఒక యువకుడు ఉండేవాడు. అతను ఎక్కడికి వెళ్ళినా... ఒరలో కత్తి ఉండేది. అతనికి వివాహమైన తరువాత.. కొన్ని రోజులపాటు ఎక్కడైనా ఆనందంగా గడిపి వద్దామని ఆ దంపతులు అనుకున్నారు. సమీపంలో ఉన్న ఒక అందాల దీవిని దాని కోసం ఎంచుకున్నారు. ఒక పడవలో వారిద్దరూ బయలు దేరారు. కబుర్లు చెప్పుకుంటూ, హాయిగా, సంతోషంగా వారు ప్రయాణిస్తున్నారు. కొంతదూరం ఈ ప్రయాణం బాగానే సాగింది. కానీ హఠాత్తుగా తుపాను మొదలయింది. రానురానూ వాతావరణం భీకరంగా మారింది. వారు ప్రయాణిస్తున్న పడవ అటూ ఇటూ ఊగడం మొదలుపెట్టింది. గాలి, వాన తీవ్రమయ్యాయి. పడవ ఏ క్షణంలోనైనా మునిగిపోయే పరిస్థితిలో ఉంది.



ఆ యువకుని భార్యకు భయం వేసింది. తీవ్రంగా వణుకుతోంది. అయితే తన భర్తలో ఎలాంటి ఆందోళన లేకపోవడాన్ని ఆమె గమనించింది. తాము చావు కోరల్లో ఉన్నా అతను ప్రశాంతంగా... పడవ ఎక్కినప్పుడు ఉన్నట్టే ఉండడం చూసి "ఏమండీ! ఏమైంది మీకు? ఏ ఊహాలోకంలో విహరిస్తున్నారు? ఈ లోకంలోకి వచ్చి చుట్టూ ఎలా ఉందో చూడండి. భయంకరమైన తుపానులో మనం ఇద్దరం చిక్కుకుపోయాం. మన పడవ ఎప్పుడైనా మునిగిపోవచ్చు. మనకు ఇవే ఆఖరి క్షణాలు కావచ్చు. మన తొలి ప్రయాణం ఇలా విషాదాంతం అవుతుందనుకోలేదు. ఇలాంటి భయంకరమైన క్షణాల్లో... మనం ప్రాణాలతో ఎలా బయటపడాలో ప్రయత్నించకుండా, కనీసం ఆలోచించకుండా ఊరకే ప్రశాంతంగా కూర్చున్నారేమిటి?" అంది నిష్ఠూరంగా.

వెంటనే ఆ యువకుడు తన ఒరలోని కత్తిని తీసి ఆమె మెడ మీద పెట్టాడు. అలాంటి వాతావరణంలో కూడా ఆమె నవ్వడం మొదలుపెట్టింది.

"ఎందుకు నవ్వుతున్నావు? నీకు భయంగా లేదా? కత్తి ఎంత పదునుగా ఉందో నీకు తెలీదా? ఇలాంటి కత్తి నీ కంఠం దగ్గర ఉందనే విషయం మరచిపోయావా? ఒక్కసారి దాన్ని కదిలిస్తే చాలు, నీ కంఠం తెగుతుంది. నీ పంచప్రాణాలూ పంచభూతాల్లో కలిసిపోతాయి. అంత పదునైన కత్తి ఇది" అన్నాడు.

అప్పుడు ఆమె "అది ఎంత పదునైన కత్తి అయినా, ఎంత భయంకరమైన కత్తి అయినా మీ చేతిలో... అంటే నన్ను అమితంగా ప్రేమించే నా భర్త చేతిలో ఉంది. కాబట్టి నాకెందుకండీ భయం" అంది.

ఆ యువకుడు తన కత్తిని ఒరలో పెట్టేసి... "ఆ కత్తి నా చేతిలో ఉంటే నీకు భయం కలగనట్టే... ఈ తుపానును చూసి నాకూ భయం వేయడం లేదు. పదునైన కత్తి కన్నా ఈ తుపాను ఎంతో భయంకరమైనది, ప్రమాదకరమైనదీ కావచ్చు. కానీ అది నేను ప్రేమించే, నన్ను అంతకన్నా అమితంగా ప్రేమించే నా తండ్రి అయిన దైవం అధీనంలో, ఆయన ఆజ్ఞకు లోబడే ఉంటుంది. అలాంటప్పుడు నాకు, నా అర్థాంగికి ఏ ప్రమాదమైనా ఎలా సంభవిస్తుంది?" అని ప్రశ్నించాడు. భక్తులను రక్షించేది భగవంతుడి పట్ల ఉండే ఇలాంటి దృఢమైన విశ్వాసమే. అదే ప్రహ్లాదుణ్ణి ఎన్నో ఆపదల నుంచి రక్షించిందని భాగవతం చెబుతోంది.

• రాచమడుగు శ్రీనివాసులు

తెలుసుకుందాం

తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాలతో సహా పది (దశ) దిశలున్నాయి. అలాగే గోవు, భూమి, ధాన్యం, వస్త్రాదులతో కలిపి దశవిధ దానాలూ ఉన్నాయి. ఇలాంటివే దశ నా ద ధ్వనులు. ఈ దశ నాద ధ్వనుల అంతరార్థం మనో నివేదన. నాదమైనా.. నినాదమైనా దైవారాధనలోని ప్రధాన భాగమే. మనసును కేంద్రీకరించడంలోని అంతర్భాగమే ఈ నాద ఆరాధన ! అలాంటి ఆరాధనలేమిటో తెలుసుకుందాం.

దశ నాద ఆరాధన



జల నాదం: దీని ప్రస్తావన 'వర్ణన రత్నాకరం'లో ఉంది. చిన్న నీటి ఊట నుంచి మహాసముద్రం వరకు అంతా జలమే. నీటితో నిండిన పాత్రలతో జల తరంగిణి మన దేశంలో అలనాడు పేరొందిన వాద్యం. దీని ప్రత్యేకతను ఒకప్పటి 'సంగీత పారిజాతం' గ్రంథం వివరిస్తుంది.



చిణి నాదం: ఇది పూర్తి విభిన్న శైలి. గురుశిష్య విద్యానుబంధానికి సంబంధించింది. గురూపదేశం అనుసరించి, చెవులు మూసి వినే విధానం ఇది. ప్రత్యేకించి ఓంకార స్వరం క్రమేణా చిరుగజ్జెల మోతలా పరివర్తితమవుతుంది. మంత్రం లేదా సందేశం వల్ల వీనులకు విందు అందుతుంది. అది 'చిణి' శబ్దాన్ని పోలి ఉంటుంది.



భేరీ నాదం: పెద్ద పెద్ద వాయిద్యాలతో మోతే భేరీ నాదం. దీని ప్రత్యేకతను 'శివ పురాణం'లో వినవస్తుంది. ఆలయ బ్రహ్మోత్సవాల తరుణంలో ఢమరుక శబ్దాలు, నినాదాలు మామూలే. పోతన తెలుగు భాగవతంలో ఒకచోట 'భేరీ భాంకారాలు' అనే పద ప్రయోగం ఉంది. గుర్రాల గిట్టల తాకిడి, రథ చక్రాల ఒరిపిడితో పాటు భటుల పాద ఘట్టనల తీవ్రత గురించి కూడా వివరం ఉంటుంది. ప్రద్యుమ్నుడు ధనుష్టంకారంతో శత్రు సేనలను భయభ్రాంతం చేశాడన్నది ఉత్కంఠను పెంచే ఘట్టం. అదే విధంగా కురుక్షేత్ర సమరంలో విజయభేరి 'ఫెళఫెళ' మోగిందని, 'ధణం ధణం' శబ్దం భీకరంగా ధ్వనించిందని ఇతిహాస కథనం. అలాంటి సందర్భంలో భేరీనాదం అరివీర భయంకరం.



కంకణి నాదం: ఇది మువ్వల సవ్వడి. దీనికే అందె, మంజీరం, పాదపట్టంగా పేర్లున్నాయి. గండపెండేరం తాలూకు శబ్దంగా పరిగణించవచ్చు. కాలి అందెలు ధరించి నడిచినప్పుడు 'ఘల్లు ఘల్లు' శబ్దం వస్తుంది. 'ఘల్లు ఘల్లున కాలిగజ్జెలు మోగుతుంటే కలికి కలహంస నడకతో వచ్చింద'న్నది కవి హృదయం.




కాహళ నాదం: 'ధ్వనులు పిక్కటిల్లగ శంఖ పటహ కాహళ' అనేదీ తెలుగు భక్తి కావ్య వర్ణనే. ఇదీ వాద్య విశేష అనుసంధానమే. బాకాను బిగ్గరగా ఊదినంత శబ్ద తీవ్రత ఇది. పెద్ద ఢంకా, బూరగొమ్ము శబ్దాలను 'కాహళ'తో సరిపోలుస్తుంటారు. ఈ నాద ధ్వని చాలా దూరం వ్యాపిస్తుంది. రామాయణ కావ్యంలోని యుద్ధ కథనంలో దీని విశదీకరణ గమనార్హం. ధనుష్టంకారం, బాణాల వర్షం, ప్రచండంగా విజృంభించడం, సింహనాదం చేస్తూ శత్రుసేనను ఓడించడం... వీటన్నింటి నేపథ్యాన సమరసీమలో కాహళ ధ్వని మిన్ను ముట్టిందనడం... ఆ శబ్ద ధాటికి సూచికలు. నటరాజును స్తుతించే వేళలో 'ఢమఢమ డమరుక నాదం, భంభం శంఖారావం, ధిమింధిమిత మంగళ మృదంగం' అంటున్నపుడే కాహళ నాద తరంగ ధాటి మన చెవికి సోకుతుంది.




మృదంగ నాదం: మద్దెల, తప్పెట లాంటి చర్మవాయిద్యాల విశేషమిది. 'మోత', 'దరువు', 'మేళం'గా అందరికీ విదితం. మృదంగం సర్వ సాధారణంగా సహ-వాయిద్యం. తబలా, డోలక్ రూపాల శబ్దాలు శ్రోతలను అలరిస్తుంటాయి. శివ, గణేశ, నంది రూపాలకు అత్యంత ప్రీతి పాత్రం మృదంగమే. నంది వాయించే మృదంగం మహేశునికి ఇష్టం కాబట్టే అది దైవిక వాద్యంగా ప్రత్యేకత అందుకుంది.



భ్రమర నాదం: భ్రమరం అంటే తుమ్మెద. అది చేసే సడినే 'భ్రమర నాదం'గా భావిస్తుంటాం. 'తుమ్మెద ఝుంకారం' అనేది తరచుగా మనం వినే మాట. ఆ నల్ల రెక్కల ప్రాణిని కావ్యభాషలో 'చంచరీకం', 'భృంగం'గా పిలుస్తుంటాం. పురుగును తెచ్చి, మట్టి గూటిలో ఉంచి, చుట్టూ కప్పిన తర్వాత చిన్న రంధ్రాన్ని చేసి, ఆ చుట్టూతా శబ్దం చేస్తూ తిరుగుతుంటుంది భ్రమరం. దాని నిరంతర నాదం కొనసాగుతుండగానే, లోపలి కీటకానికి తుమ్మెద రూపు రావడమన్నది సహజసిద్ధ పరిణామం. ఇక్కడి సందర్భంలో 'భ్రమర నాదం' అనేది నిరంతర దైవ నామ స్మరణకు గుర్తు.




ఘంటానాదం: ఆలయాన గంటను మోగించినప్పుడు కలిగే శబ్దం పరమాత్మ ప్రతిరూపమని ప్రతీతి. భక్తులను, పరిసర ప్రాంతాల్లోని ఇతరులనూ ప్రభావితం చేసేది ఘంటా నాదమే. ఏ శబ్దమైనా ఆగకుండా సాగడమే నాదం అనుకుంటే, అందులో కీలకమైనది ఘంటానాదం. గంటను భక్తి భావంతో మోగించడంతో, మనసు కేంద్రీకృతమై దైవం మీదనే లగ్నమవుతుంది. మోగే ఘంటిక కారణంగా మనో సంబంధమైన అనుభూతి అంతటా నిండుతుంది.



వేణునాదం: వేణు అనే పదం వినడంతోనే గీతా గానం మన చెవిన పడినట్లవుతుంది. వెదురు గొట్టం ఒకవైపు తెరిచి, మరోవైపు మూసి ఉండి, పై భాగాన గాలి ఊదేలా రంధ్రం కానవస్తుంది. దాని ఆధారంగానే వేణుగాన మాధుర్యం మనం అనుభవించగలుగుతాం. మురళీ గాన రవళిని కావ్యాలెన్నో ప్రస్తావించాయి. 'మందారమూలే మదనాభిరామం, బింబాధరాపూరిత వేణునాదం' అనేది ఆ శబ్ద మధురిమను తేటతెల్లం చేస్తుంది. గోపాల మురళీరవానికి గోపికలు పరవశించారన్న అభివర్ణన ఉంది.

ప్రణవ నాదం: అన్నింటికన్నా మిన్న ప్రణవనాద భక్తి. 'ప్రణామయతి ఇత్యేస్మాత్ ప్రణవః' అనేది ఒక శ్లోక భాగం. 'సర్వం పరమాత్మే' అనేంత అనుభవ రూపసారమే ప్రణవం. నుతి, కైవారం, ప్రణుతి, సాధువాదం... అన్నీ ఇందులోనివే. విష్ణు పదానికి పర్యాయం ప్రణవమే! 'ఓం' అని మొదలవుతుంది ప్రణవనాదం. ప్రాణనాడులకు స్పందన అందిస్తుంది.




• జంధ్యాల శరత్‌బాబు, 9948345013









చిత్రజ్యోతి
SINCE 1965

రోజుకో సిద్ధాంతం మార్చడం పవన్‌కు అలవాటే

ప్రకాశ్‌రాజ్



"ఏడాది క్రితం వరకు 'మా తండ్రి దేవుడిని నమ్మలేద'ని చెప్పిన పవన్ కల్యాణ్ మాటమార్చి 'మా తండ్రి రాముడి బోధనలతో నన్ను పెంచాడ'ని ఇప్పుడు చెబుతున్నాడు. నువ్వు మారుతుంటే నీతోపాటు అందరూ మారాలనుకోవడం సమంజసం కాదు. పవన్ కల్యాణ్‌కి ఓ సిద్ధాంతం అంటూ లేదు, కేవలం నోటికొచ్చినట్లు మాట్లాడటం, రోజుకో సిద్ధాంతం మార్చడం ఆయనకు అలవాటే' అని ప్రకాశ్ రాజ్ అన్నారు. జస్ట్ ఆస్కింగ్ అంటూ తరచుగా సోషల్ మీడియాలో ప్రశ్నలు సంధిస్తూ సెన్సేషన్ క్రియేట్ చేసే ప్రకాశ్‌రాజ్...తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విమర్శల వర్షం కురిపించారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. 'నేను సనాతన ధర్మానికి, హిందూ ఇజానికి వ్యతిరేకిని కాను. కానీ సనాతని అని చెప్పుకునే పవన్ కల్యాణ్ మాత్రం కేవలం రాజకీయ అవసరాల కోసమే మతాన్ని వాడుకుంటున్నాడు. తిరుపతి లడ్డు కల్తీ అయిందంటూ రాజకీయం చేశారు. అధికారం తన చేతిలో ఉంచుకొని, పవన్ కల్యాణ్ నిందితులను పట్టుకోకుండా ఎందుకు ప్రకటనలకే పరిమితమయ్యారు. లడ్డులో కల్తీ నెయ్యి కలిపినట్లు ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీం కోర్టు సైతం వ్యాఖ్యానించింది. లడ్డు అంశాన్ని రాజకీయం చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవడం మంచిది. ఇది సున్నితమైన అంశం. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడుతున్నావు. నీకు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే టీటీడీ బోర్డు మెంబర్ల నియామకం వెనుక ఉన్న అవినీతి గురించి విచారించు. ఎందుకు పేద భక్తులు దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిల్చోవాలి. వీఐపీ దర్శనాలు ఎందుకు? తొక్కిసలాటకు కారణాలేమిటో గుర్తించు. నువ్వు డిప్యూటీ సీఎంవి..మాట్లాడే ముందు ఆలోచించు. ఆవేశంగా ఆలోచన లేకుండా మాట్లాడుతున్నావంటే.. నీ మాటల వెనుక ఏదో ఎజెండా ఉందని అర్థం. మీ రాజకీయ అవసరాల కోసం ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయవద్దు. నాది ఆగ్రహం, ఆక్రోశం కాదు. ప్రజల నమ్మకాలతో చెలగాటం ఆడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా" అంటూ ప్రకాశ్‌రాజ్ అన్నారు. లడ్డు వివాదం విషయంలో గతంలోనూ పవన్ కల్యాణ్‌ను ప్రశ్నిస్తూ ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే.

మాస్ ప్రేక్షకులకు విందు భోజనంలా...

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. విజయశాంతి కీలక పాత్ర పోషించారు.



ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ నెల 18న సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించారు. కల్యాణ్‌రామ్, విజయశాంతి నటన.. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకే ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అన్నారు. మాస్ ప్రేక్షకులకు విందుభోజనంలా ఉంటూనే కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న చిత్రమిదని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



నటిగా మరో మెట్టు ఎక్కిస్తుంది



హీరోయిన్ హెబ్బా పటేల్ నటించిన తాజా చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి సీక్వెల్‌గా అశోక్ తేజ తెరకెక్కించారు. తమన్నా భాటియా ముఖ్య పాత్ర పోషించారు. దర్శకుడు సంపత్ నంది సమర్పణలో మధు నిర్మించారు. ఈనెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు హెబ్బా పటేల్. "ఇదో సూపర్ నేచురల్ థ్రిల్లర్. ఇందులో నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. మొదటి భాగం చేసేటప్పుడు ఆ సినిమా ఘన విజయం సాధిస్తుందని.. దానికి సీక్వెల్ ఉంటుందని అస్సలు ఊహించలేదు. ఒక నటిగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది. అశోక్‌తేజకు మంచి విజన్‌తో పాటు అపారమైన ప్రతిభ ఉంది. తమన్నా ఇందులో నా సోదరి పాత్రలో కనిపిస్తారు. శక్తిమంతమైన నాగసాధువు పాత్రలో ఆమె నటన సినిమాకే ప్రధానాకర్షణగా ఉంటుంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం చిత్రాన్ని మరోస్థాయికి తీసుకెళ్తుంది. ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతినిస్తుంది" అని చెప్పారు.

ఆసక్తికరమైన మలుపులతో...

సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' ఉపశీర్షిక. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. ప్రకాశ్‌రాజ్, వీకే నరేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 10న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ప్రేమకథల స్పెషలిస్ట్, దర్శకుడు భాస్కర్ తన పంథా మార్చి తెరకెక్కించిన ఈ చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. సినిమా చాలా వేగంగా సాగుతూ ఆసక్తికరమైన మలుపులతో అలరిస్తుంది" అని అన్నారు. "సిద్ధు అద్భుతమైన వ్యక్తి. ఆయనతో సినిమా చేయడం చాలా సులభం. ప్రతీ ఒక్కరిలో ఓ జాక్ ఉంటాడు. ఆ జాక్ ఎవరు అనేది ఎవరికి వాళ్లే తెలుసుకోవాలి. నన్ను నమ్మి థియేటర్లకు వచ్చే ప్రేక్షకులను ఈ సినిమా నిరాశపరచదు" అని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ చెప్పారు. "సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. అన్ని రకాల ప్రేక్షకులూ చూడదగ్గ చిత్రమిది. తప్పకుండా ఘన విజయం సాధిస్తుంది" అని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. "దర్శకుడు భాస్కర్‌తో పని చేయడం మరిచిపోలేని అనుభవం. సిద్ధు నుంచి సెట్స్‌లో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఇందులో నా పాత్ర చాలా బాగుంటుంది" అని వైష్ణవి చైతన్య అన్నారు.

భామతో రాముడి ప్రేమగీతం



సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటుణ్ణి తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవికా మనోజ్ కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్ దర్శకత్వంలో హరీశ్ నల్ల నిర్మించారు. నటుడు రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. గురువారం చిత్రబృందం టైటిల్ సాంగ్‌ను విడుదల చేసింది. 'ఎలాగుండే వాణ్నే ఎలా అయిపోయానే' అంటూ హీరోయిన్ ప్రేమ కోసం హీరో పడే ఇబ్బందులను వివరిస్తూ సాగే ఈ గీతానికి శ్రీహర్ష ఈమని సాహిత్యం అందించారు. రథన్ స్వరకల్పనలో శరత్ సంతోష్ ఆలపించారు. ప్రేక్షక హృదయాలను దోచుకొనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దామని నిర్మాత చెప్పారు. సినిమాలోని ఆరుపాటలు ప్రేక్షకులను అలరించేలా ఉంటాయని దర్శకుడు చెప్పారు.

ఈక్విటీ మార్కెట్ దారెటు..?

సుంకాల దెబ్బకు మళ్లీ పుంజుకోనున్న విదేశీ పెట్టుబడులు!

న్యూఢిల్లీ: ట్రంప్ పరస్పర సుంకాలతో స్టాక్ మార్కెట్ పయనమెటు అని చిన్న మదుపరులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. సుంకాల కారణంగా అంతర్జాతీయంగా పెరగనున్న ఆర్థిక అనిశ్చితితో దేశీయ మార్కెట్ సూచీలు స్వల్పకాల దిద్దుబాటుకు లోనుకావచ్చని, మార్కెట్లో ఒడుదుడుకులు పెరగనున్నాయని ఈక్విటీ నిపుణులు అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలంలో మాత్రం మార్కెట్ వృద్ధి పథంలోనే కొనసాగనుందని వారు పేర్కొన్నారు. అమెరికా సుంకాలు ఆందోళనకరమే అయినప్పటికీ, ఏయే రంగాలపై ప్రభావమెంత అనే స్పష్టత వచ్చిందన్నారు. సుంకాల ప్రభావంతో అమెరికా, చైనాలో ఆర్థిక అనిశ్చితి పెరగనున్నందున విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆనంద్ రాఠీ గ్రూప్ చీఫ్ ఎకనామిస్ట్ సుజన్ హజ్రా అన్నారు. కార్పొరేట్ కంపెనీల ఆదాయ వృద్ధి, దేశీయ సంస్థాగత పెట్టుబడులు, బలమైన దేశీయ ఆర్థిక మూలాలు మధ్య-దీర్ఘకాలంలో మన మార్కెట్లకు సానుకూలంగా పరిణమించనున్నాయని అన్నారు.

- మార్కెట్ ప్రస్తుత ఒడుదుడుకులను మదుపరులు అవకాశంగా మల్చుకోవాలని, సూచీలు దిద్దుబాటుకు లోనైన సమయాల్లో ఆకర్షణీయ ధరలకు లభిస్తున్న నాణ్యమైన స్టాక్స్‌లో పెట్టుబడులు పెంచుకుంటూ పోతే దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలను పొందవచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ సూచిస్తోంది.
- ఈక్విటీ ఇన్వెస్టర్లు, ముఖ్యంగా చిన్న మదుపరులు జాగ్రత్తగా ఉండాల్సిన సమయమిదని.. వైట్ రీసెర్చ్ పీఎంఎస్ వ్యవస్థాపకులు, ఫండ్ మేనేజర్ సోనమ్ శ్రీవాస్తవ అన్నారు. నాణ్యమైన కంపెనీల స్టాక్స్‌లో పెట్టుబడులపై దృష్టిసారించాలని, స్థూల ఆర్థికాంశాలను నిశితంగా గమనిస్తుండాలన్నారు.

భారత జీడీపీకి 0.5 శాతం గండి

రూపాయి మారకం విలువకు మాత్రం సానుకూలం

న్యూఢిల్లీ: ట్రంప్ సుంకాల ప్రభావం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో దేశీయ వృద్ధికి గరిష్ఠంగా 0.5 శాతం మేర గండిపడవచ్చని, యూఎస్‌కు మన ఎగుమతులు 2-3 శాతం మేర తగ్గే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. అమెరికా సుంకాలపై భారత్ ప్రతీకార చర్యలు చేపట్టని పక్షంలో, మన జీడీపీ వృద్ధిపై 0.5 శాతానికి మించి ప్రభావం ఉండకపోవచ్చని ఈవైకి చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాస్తవ అన్నారు. "2025-26లో జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదు కావచ్చని గతంలో అంచనా వేశాం. ట్రంప్ సుంకాల ఫలితంగా ఈ సారి వృద్ధి 6 శాతానికి పరిమితం కావచ్చు" అని ఆయన పేర్కొన్నారు. ఔషధాలు సహా మరికొన్ని వస్తువులపై మినహాయింపులను పరిగణనలోకి తీసుకుంటే భారత ఎగుమతులపై నికర సుంకం పెంపు 20 శాతంగా ఉండనుందని, ఫలితంగా ఈ సారి వృద్ధిరేటు గత అంచనాల కంటే 0.35-0.40% మేర తగ్గవచ్చని స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఇండియా హెడ్ అనుభూతి సహాయ్ అభిప్రాయపడ్డారు. అమెరికా-భారత్ మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరాక ఈ విషయంపై తుది అంచనాకు రావచ్చన్నారు. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో ధరలు మళ్లీ పెరిగి డాలర్ బలహీనపడవచ్చని.. ఇది మన రూపాయి మారకం విలువకు సానుకూలంగా పరిణమించవచ్చని ఈవైకి చెందిన డీకే శ్రీవాస్తవ అన్నారు.

ఎగుమతులపై పరోక్ష ప్రభావమే ఎక్కువ.. : ట్రంప్ సుంకాలతో ఈసారి భారత జీడీపీ వృద్ధి 0.30-0.60% మేర తగ్గవచ్చని మోర్గాన్ స్టాన్లీ ఆర్థికవేత్తలు ఉపాసన చాచ్ర, బానీ గంభీర్ అన్నారు. భారత్‌పై సుంకాలు అంచనాల కంటే అధికంగా విధించినప్పటికీ, మన పోటీ దేశాలతో పోలిస్తే మాత్రం తక్కువేనన్నారు. అమెరికాకు ఎగుమతులు భారత జీడీపీలో కేవలం 2.1 శాతమే కావడంతో సుంకాల ప్రత్యక్ష ప్రభావం అంత తీవ్రంగా ఉండదని వారు అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా ఆర్థిక వృద్ధి మందగించడంతో పాటు అంతర్జాతీయంగా వాణిజ్యం బలహీనపడితే మన ఎగుమతులపై పరోక్షంగా అధిక ప్రభావం చూపవచ్చన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	131	విజయవాడ	140
వరంగల్	131	గుంటూరు	135
కరీంనగర్	131	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	131	చిత్తూరు	100
కర్నూలు	131	నెల్లూరు	105
విశాఖపట్నం	124	అనంతపురం	105
గోదావరి	140		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ

హైదరాబాద్	400	విజయవాడ	430
వరంగల్	402	గోదావరి	425
చిత్తూరు	495	విశాఖపట్నం	440

డజను గుడ్లు రూ. 60

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	93,380 ▲	85,600 ▲	1,12,000 ▼
విజయవాడ	94,000 ▼	87,500 ▼	1,03,000 ▲
విశాఖపట్నం	89,330 ▲	81,890 ▲	94,510 ▼
రాజమండ్రి	93,380 ▲	85,600 ▲	1,00,400 ▼
ప్రొద్దుటూరు	93,450 ▲	85,970 ▲	99,800 ▲
ముంబై	90,340 ▼	82,760 ▼	95,960 ▼

స్పోర్ట్స్

వరంగల్ ● శుక్రవారం 4 ఏప్రిల్ 2025

ఐపీఎల్‌లో నేడు

	వేదిక
	లఖ్‌నవూ
లఖ్‌నవూ x ముంబై	రా.7.30

మరో ముగ్గురు సెమీస్‌కు

- ప్రపంచ బాక్సింగ్ కప్

న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్‌లో మనోళ్ల జోరు కొనసాగుతోంది. బ్రెజిల్‌లో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో మరో ముగ్గురు భారత బాక్సర్లు మనీష్ రాథోడ్ (55 కిలోలు), హితేశ్ (70 కిలోలు), అభినాష్ జమ్వాల్ (65 కిలోలు) తమ విభాగాల్లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకాలకు చేరువయ్యారు. క్వార్టర్‌ఫైనల్ బౌట్లలో డెనిస్ బ్రిల్ (బ్రిటన్)పై అభినాష్, గ్రాబియెల్ గూడీ రోన్‌టాని (ఇటలీ)పై హితేశ్, యూసుఫ్ చోతియా (ఆస్ట్రేలియా)పై మనీష్ విజయం సాధించారు.

సూర్య ముంబై వెంటే..



ముంబై: డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ముంబై జట్టును వీడడం లేదని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్పష్టం చేసింది. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ మాదిరి సూర్యకుమార్ కూడా గోవా తరఫున రంజీ మ్యాచ్‌లను ఆడబోతున్నట్టు కథనాలు వెలువడ్డాయి. ఈనేపథ్యంలో ఎంసీఏ స్పందిస్తూ.. 'సూర్య తమ జట్టును వీడనున్నాడనే పుకార్ల గురించి తెలిసింది. అందుకే నిజానిజాల గురించి ఎంసీఏ అధికారులు సూర్యతోనే నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా అతను ముంబైకి ఆడడాన్నే గౌరవంగా భావిస్తున్నట్టు మాతో స్పష్టం చేశాడు' అని ఎంసీఏ సూచించింది. మరోవైపు తన నేతృత్వంలో ముంబై జట్టు నుంచి మరికొంత మంది ఆటగాళ్లను గోవాకు ఆడించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు వచ్చిన కథనాలను సూర్యకుమార్ ఖండించాడు. 'మీరు స్క్రిప్ట్ రైటర్లా? జర్నలిస్టులా? హాస్యం కోసం ఇక కామెడీ సినిమాలు చూడడం మానేసి ఇలాంటి ఆర్టికల్స్ చదువుతా' అని ఎక్స్‌లో పేర్కొన్నాడు.

గోవా నాకు అద్భుత అవకాశం ఇచ్చింది

జైస్వాల్

దేశవాళీల్లో ముంబై నుంచి గోవాకు తరలడంపై యశస్వీ జైస్వాల్ స్పందించాడు. 'నా జీవితాంతం ముంబై క్రికెట్ సంఘానికి రుణపడి ఉంటా. ఆ జట్టు వల్లే నేనిలా ఉన్నా. కానీ గోవా నాకు జట్టును నడిపించే అద్భుత అవకాశం ఇచ్చింది. టీమిండియాకు ఆడనప్పుడు కచ్చితంగా గోవాకు అందుబాటులో ఉంటా' అని జైస్వాల్ వివరించాడు.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
వైభవ్ అరోరా (4-1-29-3)

1 ఐపీఎల్‌లో రైజర్స్‌కిదే భారీ పరాజయం (80 రన్స్ తేడా).

కోల్‌కతా.. వైభవంగా

80 రన్స్‌తో ఘన విజయం

- సన్‌రైజర్స్‌కు హ్యాట్రిక్ ఓటమి
- చెలరేగిన వెంకటేశ్ అయ్యర్

వైభవ్ ఆరోరా, వరుణ్‌లకు మూడేసి వికెట్లు

కోల్‌కతా: భారీ స్కోర్లకు మారుపేరుగా నిలిచే సన్‌రైజర్స్ హైదాబాద్‌కు ముచ్చటగా మూడో ఓటమి. ఎప్పటిలాగే మరోసారి బ్యాటర్ల వైఫల్యం రైజర్స్‌ను దెబ్బతీసింది. అటు ముంబై చేతిలో ఘోర ఓటమి తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) మాత్రం ఘనంగా పుంజుకుంది. అన్ని విభాగాల్లో అద్భుతంగా రాణించిన ఈ జట్టు గురువారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 80 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రైజర్స్‌పై కేకేఆర్‌కు ఇది వరుసగా ఐదో గెలుపు. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60), రఘువంశీ (32 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 50) అర్ధసెంచరీలతో సత్తా చాటగా, కెప్టెన్ అజింక్యా రహానె (27 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 38), రింకూ సింగ్ (17 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 32 నాటౌట్) అదరగొట్టారు. ఛేదనలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/22), పేసర్ వైభవ్ అరోరా (3/29)ల ధాటికి సన్‌రైజర్స్ 16.4 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. క్లాసెన్ (33), కమిందు మెండిస్ (27) పర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా వైభవ్ అరోరా నిలిచాడు.

వికెట్లు టపటపా..: భారీ ఛేదనలో సన్‌రైజర్స్ బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. వరుస విరామాల్లో వికెట్లు తీసిన కేకేఆర్ బౌలర్లు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ధనాధన్ హిట్టింగ్‌తో చెలరేగే ఓపెనర్లు హెడ్ (4), అభిషేక్ (2)లతో పాటు ఇషాన్ కిషన్ (2) తొలి మూడు ఓవర్లలోనే పెవిలియన్ చేరారు. అప్పటికి జట్టు స్కోరు 9 పరుగులు మాత్రమే. తొలి మ్యాచ్ ఆడిన పేసర్ వైభవ్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే హెడ్‌ను అవుట్ చేయగా.. తన తర్వాతి ఓవర్‌లోనే ఇషాన్ పని బట్టాడు. రెండో ఓవర్‌లో అభిషేక్‌కు హర్షిత్ రాణా షాకిచ్చాడు. ఈ దశలో నితీశ్ (19), కమిందు నాలుగో వికెట్‌కు 35 పరుగులు జోడించారు. ఏడో ఓవర్‌లో కమిందు 6,4,6తో చెలరేగినప్పటికీ నితీశ్ వికెట్‌ను కోల్పోయింది. కుదురుకున్నట్టు కనిపించిన కమిందు స్పిన్నర్ నరైన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఇక, వరుణ్ రాకతో రైజర్స్ ఇబ్బందులు పెరిగాయి. ముందుగా అనికేత్ (6)ను వరుణ్ అవుట్ చేశాడు అయితే క్రీజులో క్లాసెన్ ఉండడంతో రైజర్స్ ఆశలు వదులుకోలేదు. అందుకు తగ్గట్టే అతడు కూడా భారీ షాట్లతో చెలరేగాడు. 14వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో జోరు చూపాడు. కానీ వైభవ్ అతడిని కూడా వెనక్కి పంపి కేకేఆర్ విజయాన్ని ఖాయం చేశాడు. ఆ తర్వాత 16వ ఓవర్‌లో వరుణ్ వరుసగా రెండు వికెట్లు తీయగా.. ఆ వెంటనే రస్సెల్ చివరి వికెట్‌ను పడగొట్టి 20 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

చివర్లో జోరు..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు డికాక్ (1), నరైన్ (7) మరోసారి విఫలమయ్యారు. 16 పరుగులకే ఈ జోడీ వెనుదిరిగినా మిడిలార్డర్ ఆదుకునే ప్రయత్నం చేసింది. అయితే 15వ ఓవర్లలో జట్టు 122/4తో ఉన్న దశలో 180 స్కోరు కూడా కష్టమే అనిపించింది. కానీ చివర్లో వెంకటేశ్ అయ్యర్ విధ్వంసానికి జట్టు అద్భుతంగా పుంజుకుని సవాల్ విసిరే స్కోరు సాధించింది. డెత్ ఓవర్లలో రైజర్స్ బౌలర్ల వైఫల్యం కారణంగా ఆఖరి ఐదు ఓవర్లలో కేకేఆర్ 78 పరుగులు రాబట్టింది. ఆరంభంలో కెప్టెన్ రహానె ఎదురుదాడికి దిగి బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అతడికి యువ బ్యాటర్ రఘువంశీ చక్కటి సహకారం అందించడంతో కేకేఆర్ స్కోరు గాడిన పడింది. రహానె వీలుచిక్కినప్పుడల్లా అద్భుత సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. వీరి జోరుకు పవర్‌ప్లేలో 53/2 స్కోరుతో పర్వాలేదనిపించింది.

11వ ఓవర్‌లో రఘువంశీ వరుసగా 6,4 బాదినా.. రహానె వికెట్‌ను కోల్పోయింది. దీంతో మూడో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన రఘువంశీని స్పిన్నర్ కమిందు అవుట్ చేశాడు. ఐపీఎల్‌లో అతడికిదే తొలి వికెట్. అంతకుముందే అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను నితీశ్ జారవిడిచాడు. ఈ స్థితిలో వెంకటేశ్ అయ్యర్-రింకూ సింగ్ జోడీ బాధ్యత తీసుకుంది. అయితే పిచ్‌ను అర్థం చేసుకునేందుకు వీరు కాస్త సమయం తీసుకోవడంతో 12-15 ఓవర్ల మధ్య 25 పరుగులే వచ్చాయి. కానీ 16వ ఓవర్‌లో చెరో ఫోర్‌తో పరుగుల వేట మొదలైంది. హర్షల్ వేసిన ఆ ఓవర్‌లో రింకూ హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. 18వ ఓవర్‌లో అయ్యర్ 4,4.. రింకూ సిక్సర్‌తో 17 రన్స్ వచ్చాయి. కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లోనైతే అయ్యర్ 4,6,4,4తో 21 రన్స్ రాబట్టాడు. అటు 25 బంతుల్లోనే ఎస్‌ఆర్‌హెచ్‌పై వరుసగా మూడో ఫిఫ్టీని కూడా పూర్తిచేశాడు. అలాగే చివరి ఓవర్‌లో తొలి రెండు బంతులను 6,4గా మలిచినా మూడో బంతికి అనికేత్ క్యాచ్‌తో అయ్యర్ వెనుదిరిగాడు. అప్పటికే ఐదో వికెట్‌కు 41 బంతుల్లోనే 91 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేరింది. ఇదే ఓవర్‌లో రస్సెల్ (1) రనౌటైనా 13 రన్స్ చేసిన కేకేఆర్ 200 మార్క్‌ను అందుకోగలిగింది.



వెంకటేశ్ అయ్యర్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	2	2	0	0	4	1.485
ఢిల్లీ	2	2	0	0	4	1.320
బెంగళూరు	3	2	1	0	4	1.149
గుజరాత్	3	2	1	0	4	0.807
కోల్‌కతా	4	2	2	0	4	0.070
ముంబై	3	1	2	0	2	0.309
లఖ్‌నవూ	3	1	2	0	2	-0.150
చెన్నై	3	1	2	0	2	-0.771
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
హైదరాబాద్	4	1	3	0	2	-1.612

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: డికాక్ (సి) జీషన్ (బి) కమిన్స్ 1, నరైన్ (సి) క్లాసెన్ (బి) షమి 7, రహానె (సి) క్లాసెన్ (బి) జీషన్ 38, రఘువంశీ (సి) హర్షల్ (బి) కమిందు 50, వెంకటేశ్ (సి) అనికేత్ (బి) హర్షల్ 60, రింకూ (నాటౌట్) 32, రస్సెల్ (రనౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 200/6; వికెట్ల పతనం:** 1-14, 2-16, 3-97, 4-106, 5-197, 6-200; **బౌలింగ్:** షమి 4-0-29-1, కమిన్స్ 4-0-44-1, సిమర్‌జీత్ 4-0-47-0, జీషన్ 3-0-25-1, హర్షల్ 4-0-43-1, కమిందు 1-0-4-1.

సన్‌రైజర్స్: హెడ్ (సి) హర్షిత్ (బి) వైభవ్ 4, అభిషేక్ (సి) వెంకటేశ్ (బి) హర్షిత్ 2, ఇషాన్ (సి) రహానె (బి) వైభవ్ 2, నితీశ్ (సి) నరైన్ (బి) రస్సెల్ 19, కమిందు (సి/సబ్) అనుకూల్ (బి) నరైన్ 27, క్లాసెన్ (సి) అలీ (బి) వైభవ్ 33, అనికేత్ (సి) వెంకటేశ్ (బి) వరుణ్ 6, కమిన్స్ (సి) హర్షిత్ (బి) వరుణ్ 14, హర్షల్ (సి అండ్ బి) రస్సెల్ 3, సిమర్‌జీత్ (బి) వరుణ్ 0, షమి (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 16.4 ఓవర్లలో 120 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-9, 3-9, 4-44, 5-66, 6-75, 7-112, 8-114, 9-114, 10-120; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-1-29-3, హర్షిత్ రాణా 3-0-15-1, వరుణ్ చక్రవర్తి 4-0-22-3, రస్సెల్ 1.4-0-21-2, నరైన్ 4-0-40-1.

ఘనంగా విదిత్ వివాహం

ముంబై: భారత చెస్ గ్రాండ్ మాస్టర్ విదిత్ గుజ్‌రాతీ ఓ ఇంటివాడయ్యాడు. మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన 30 ఏళ్ల విదిత్.. హోమియోపతి వైద్యురాలైన నిధి కటారియాను మనువాడాడు. ఈ వేడుకలో చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, ప్రపంచ చాంపియన్ గుకేష్ సందడి చేశారు. వరుడు విదిత్‌తో కలిసి విషీ, గుకేష్ బాలీవుడ్ పాటలకు ఉత్సాహంగా స్టెప్పులేశారు.




ఐపీఎల్‌ను వీడిన రబాడ

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా పేసర్ రబాడ స్వదేశానికి తిరిగి వెళ్లినట్టు అతడి ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్ ప్రకటించింది. వ్యక్తిగత కారణాలతోనే అతడు ఐపీఎల్‌ను వీడినట్టు గురువారం పేర్కొంది. కానీ, తిరిగి వస్తాడా? లేదా? ఒకవేళ వస్తే ఎప్పుడు? అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఈ సీజన్‌లో రబాడ రెండు మ్యాచ్‌లే ఆడాడు. బుధవారం బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో అతడి స్థానంలో అర్షద్ ఖాన్‌ను తుది జట్టులోకి తీసుకొన్నారు. రబాడ గైర్హాజరీలో సౌతాఫ్రికాకు చెందిన గెరాల్డ్ కొట్జీ లేదా అఫ్ఘాన్ ఆల్‌రౌండర్ కరీమ్ జనత్‌పై గుజరాత్ ఆధారపడే చాన్సుంది. కాగా, లీగ్‌లో పిచ్‌లపై విమర్శలు చేయడంతో.. బీసీసీఐ అతడిని టార్గెట్ చేసిందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రబాడ లీగ్‌ను వదలి వెళ్లాడని అనుకొంటున్నారు.

ఆ అందమైన అమ్మాయే.. నా గాళ్‌ఫ్రెండ్: ధవన్



న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ శిఖర్ ధవన్ లవ్‌లో పడినట్టు చెప్పాడు. కానీ, ఆమె పేరును వెల్లడించలేదు. ఓ మీడియా చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ధవన్ మాట్లాడుతూ.. 'ఇప్పుడు ప్రేమలో ఉన్నా. ఆమె పేరు చెప్పలేను కానీ.. ఆ అందమైన అమ్మాయే నా గాళ్‌ఫ్రెండ్' అని చెప్పాడు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ధవన్.. ఐర్లాండ్‌కు చెందిన సోఫీ షైన్ అనే అమ్మాయితో కనిపించాడు. ఈమే గబ్బర్ గాళ్‌ఫ్రెండ్ అని కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే.



ఆసియా క్రికెట్ చైర్మన్‌గా నఖ్వీ

న్యూఢిల్లీ: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కొత్త చైర్మన్‌గా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీ ఎంపికయ్యాడు. శ్రీలంక క్రికెట్ చీఫ్ షమ్మి సిల్వ స్థానంలో నఖ్వీ బాధ్యతలు చేపట్టనున్నాడు. రొటేషన్ విధానంలో ఈసారి అవకాశం పాక్‌కు దక్కింది. గురువారం జరిగిన వార్షిక సర్వసభ్య భేటీలో ఏసీసీ చైర్మన్‌గా మొహిసిన్‌ను ఖరారు చేశారు. రెండేళ్లపాటు అతడు ఈ పదవిలో ఉంటాడు.

బిజినెస్

అమెరికా మార్కెట్లు క్రాష్!

డౌజోన్స్ 3 శాతానికి పైగా డౌన్

- 9% క్షీణించిన యాపిల్ షేరు
- బంగారం, వెండి, క్రూడ్ సైతం..

ట్రంప్ సుంకాలు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న ఆందోళనలతో అమెరికా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. డౌజోన్స్ ఒకదశలో 1,278 పాయింట్లు (3.03 శాతం) క్షీణించగా.. ఎస్ అండ్ పీ 500 సూచీ 3.81 శాతం, నాస్‌డాక్ 4.88 శాతం నష్టపోయాయి. అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ షేరు ఒకదశలో 8.75 శాతం క్షీణించగా.. ఎన్‌విడియా 6.75 శాతం, గూగుల్ 3.15 శాతం, టెస్లా 4.72 శాతం తగ్గాయి. యూరోపియన్ మార్కెట్లు సైతం 3.60 శాతం వరకు నష్టపోయాయి. అంతేకాదు, ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ బంగారం సైతం 42 డాలర్ల మేర తగ్గి 3,123 డాలర్ల స్థాయికి, సిల్వర్ 32 డాలర్ల వద్దకు జారుకోగా.. బ్రెంట్ ముడిచమురు పీపా ధర 70 డాలర్లకు పడిపోయింది.

ఐటీ కుదేల్.. ఫార్మా జిగేల్

ముంబై: ట్రంప్ పరస్పర సుంకాలు భారత స్టాక్ మార్కెట్‌పై మిశ్రమ ప్రభావం చూపాయి. ఔషధాలకు ఈ సుంకాల నుంచి మినహాయింపునివ్వడంతో ఫార్మా రంగ షేర్లు భారీగా పుంజుకోగా.. సుంకాల కారణంగా అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చని, వాణిజ్య యుద్ధాలకు దారితీయవచ్చని, అది దేశీయ ఐటీ కంపెనీల ఆదాయాలకు ప్రతికూలంగా పరిణమించవచ్చన్న ఆందోళనతో ఇన్వెస్టర్లు ఆ రంగానికి చెందిన షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో బీఎస్ఈలోని ఫోకస్డ్ ఐటీ సూచీ 4.13 శాతం క్షీణించగా.. ఐటీ 3.78 శాతం, టెక్ ఇండెక్స్ 2.85 శాతం తగ్గాయి. ఫార్మా కంపెనీల ప్రాతినిధ్య సూచీ హెల్త్‌కేర్ 1.82 శాతం పెరిగింది.

సెన్సెక్స్ 322 పాయింట్లు డౌన్ : ట్రంప్ సుంకాల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఆరంభంలో సెన్సెక్స్ 809.89 పాయింట్లు క్షీణించి 75,807.55 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 322.08 పాయింట్ల నష్టంతో 76,295.36 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభ ట్రేడింగ్‌లో 186.55 పాయింట్ల వరకు పతనమైనప్పటికీ, చివర్లో 82.25 పాయింట్ల నష్టంతో 23,250.10 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని నాలుగు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా 3.98 శాతం వరకు నష్టపోయి సూచీ టాప్ లూజర్లుగా మిగిలాయి. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.35,170 కోట్ల మేర పెరిగి రూ.413.33 లక్షల కోట్లకు చేరింది.

ఐటీ

షేరు	నష్టం(%)
పెర్సిస్టెంట్ సిస్టమ్స్	9.92
కోఫోర్జ్	7.77
కేపీఐటీ టెక్నాలజీస్	7.66
ఎంఫసిస్	4.05
టీసీఎస్	3.98
టెక్ మహీంద్రా	3.79
హెచ్‌సీఎల్ టెక్	3.71
ఎల్‌టీఐమైండ్‌ట్రీ	3.51
ఇన్ఫోసిస్	3.41
విప్రో	2.75
సైయెంట్	2.67

ఫార్మా

షేరు	లాభం(%)
జుబిలియెంట్ ఫార్మా	6.82
ఇప్కా ల్యాబ్స్	5.77
లుపిన్	4.24
నాట్కో ఫార్మా	3.73
సన్ ఫార్మా	3.26
సిప్లా	2.92
సువెన్ ఫార్మా	2.89
దివీస్ ల్యాబ్స్	1.90
గ్లెన్‌మార్క్ ఫార్మా	1.89
గ్లాండ్ ఫార్మా	1.75
గ్రాన్యూల్స్ ఇండియా	1.72
అరబిందో ఫార్మా	1.50
టొరెంట్ ఫార్మా	1.09
డాక్టర్ రెడ్డీస్	0.13

ట్రంప్ సుంకాల భేరీ

ఫార్మా, ఇంధన పరిశ్రమకు ఊరట

ఆటో, ఐటీ ఎగుమతులకు కష్టాలు
రొయ్యల ఎగుమతులూ ఢమాల్ !
పారిశ్రామిక రంగం గగ్గోలు
అమెరికాకు అక్కరకు వచ్చే పరిశ్రమలపై కనికరం

న్యూఢిల్లీ: ప్రచ్ఛన్న యుద్ధం ముగిసింది. వాణిజ్య యుద్ధం ప్రారంభమైంది. దీన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరింత నిజం చేశారు. మిత్ర దేశం, శత్రు దేశం అనే తేడా లేకుండా 60కి పైగా దేశాల ఉత్పత్తులపై ప్రతీకార సుంకాల పేరుతో 27 శాతం సుంకాలు విధించారు. అమెరికాను మళ్లీ ప్రపంచంలోనే గొప్ప దేశంగా తీర్చి దిద్దాలన్నా, లక్ష కోట్ల డాలర్లకు (సుమారు రూ.85.30 లక్షల కోట్లు) చేరువైన వాణిజ్య లోటును పూడ్చాలన్నా ఈ సుంకాలు తప్పవని తేల్చి చెప్పారు. అయితే ఇదే సమయంలో అమెరికాకు ముఖ్యంగా అమెరికా పశ్రమ, వినియోగదారులకు కీలకమైన ఫార్మా, సెమీకండక్టర్లు, ఇంధన దిగుమతులను సుంకాల నుంచి పూర్తిగా మినహాయించారు. ఈ నెల 5 నుంచి 10 మధ్య రెండు విడతలుగా ఈ సుంకాలు అమల్లోకి రానున్నాయి.



కొన్ని రంగాలకు మాత్రం కష్టమే

ట్రంప్ పోటుతో మన దేశానికి చెందిన కొన్ని రంగాలు పూర్తిగా డీలా పడ్డాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) లేదా అమెరికా స్థాయిలో సుంకాలు తగ్గించి ఆదుకోండని ప్రభుత్వాన్ని కోరాయి. లేకపోతే అమెరికా మార్కెట్‌లో ప్రవేశించడం మా వల్ల కాదని చేతులెత్తేస్తున్నాయి. ట్రంప్ సుంకాలతో ఈ కింది రంగాలు బాగా దెబ్బ తింటాయని భావిస్తున్నారు.



మత్స్య ఎగుమతులు

ట్రంప్ తాజా సుంకాలతో మత్స్య పరిశ్రమ బెంబేలెత్తి పోతోంది. అమెరికా ఇప్పటికే మన మత్స్య ఎగుతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ పేరుతో 3.88 శాతం, కౌంటర్ వయలింగ్ డ్యూటీ పేరుతో 5.77 శాతం సుంకాలు విధిస్తోంది. ఇపుడు ప్రతీకార సుంకాల పేరుతో అదనంగా మరో 26 శాతం సుంకాలు మోపింది. దీంతో మన మత్స్య ఎగుమతులపై అమెరికా విధించే సుంకాల భారం 35.65 శాతానికి చేరింది. దగ్గర్లోనే ఉన్న ఈక్వెడార్ నుంచి వచ్చే మత్స్య దిగుమతులపై మాత్రం 13.78 శాతం మాత్రమే వసూలు చేయనుంది. మన దేశం నుంచి జరిగే మత్స్య ఎగుమతుల్లో 40 శాతం అమెరికాకే ఎగుమతవుతాయి. అందులో రొయ్యలదే పెద్ద వాటా. మన రొయ్యలకు ఇప్పటికే అమెరికా మార్కెట్‌లో ఈక్వెడార్, ఇండోనేషియాల నుంచి గట్టి పోటీ ఉంది. ఇపుడు ఈ సుంకాల పోటుతో మన మార్కెట్‌ను ఈ రెండు దేశాలు తన్నుకుపోయే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ రొయ్యల ఎగుమతిదారు బీఎంఆర్ గ్రూపు ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ బీద మస్తాన్ రావు 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. అమెరికా నుంచి మన దేశానికి దిగుమతయ్యే మత్స్య ఉత్తత్తులపై విధిస్తున్న 30 శాతం సుంకాన్ని జీరోకి తగ్గించడం ద్వారా ఆదుకోవాలని పరిశ్రమ వర్గాలు ప్రభుత్వాన్ని కోరాయి.



స్టీలు పరిశ్రమ బెంబేలు

మన స్టీలు ఎగుమతులపై ట్రంప్ సర్కా రు ఇప్పటికే 25 శాతం సుంకం వసూలు చేస్తోంది. ఇపుడు ప్రతీకార సుంకాల నుంచి మాత్రం మినహాయించింది. చైనా, యూరప్, జపాన్, దక్షిణ కొరియాల నుంచి దిగుమతయ్యే స్టీలుపై మాత్రం భారీగా ప్రతీకార సుంకాలు విధించింది. దీంతో దాదాపుగా ఈ దేశాలకు అమెరికా మార్కెట్ మూసుకుపోయినట్టే. దాంతో ఈ దేశాలు తమ మిగులు స్టీలును మరింత జోరుగా భారత మార్కెట్‌లో డంప్ చేసే ప్రమాదం ఉందని పరిశ్రమ వర్గాలు భయపడుతున్నాయి. మన దేశీయ స్టీలు పరిశ్రమకు పొంచి ఉన్న అతి పెద్ద ప్రమాదం ఇదేనని పేర్కొన్నాయి.



ఆభరణాల ఎగుమతులకూ దెబ్బే

ట్రంప్ ప్రతీకార సుంకాలతో ఆభరణాల పరిశ్రమ సైతం విలవిల లాడుతోంది. మన ఆభరణాల్లో దాదాపు 30 శాతం అమెరికాకే ఎగుమతవుతాయి. ఈ ఎగుమతులపై అమెరికా ప్రస్తుతం జీరో నుంచి ఐదు శాతం సుంకం విధిస్తోంది. మనం మాత్రం అమెరికా నుంచి దిగుమతయ్యే జువెలరీపై సగటున 20 శాతం సుంకం విధిస్తున్నాం. ఇపుడు ట్రంప్ ప్రతీకార సుంకాలతో 27 శాతం భారం పడనుంది. ఇది అమెరికాపై ఎక్కువగా ఆధారపడిన కంపెనీలకు గొడ్డలి పెట్టని పరిశ్రమ పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వీలైనంత త్వరగా అమెరికాతో బీటీఏ కుదుర్చుకోవడం ద్వారా ఈ గండం నుంచి గట్టెక్క వచ్చని ప్రభుత్వానికి సూచించింది. లేకపోతే దాదాపు రూ.లక్ష కోట్ల విలువైన అమెరికా మార్కెట్ మనకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి.

ఆటో బేఫికర్

ట్రంప్ 25 శాతం సుంకంపై దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ పెద్దగా భయపడడం లేదు. ఎందుకంటే మన దేశం నుంచి అమెరికాకు వాహనాల ఎగుమతులు అతి స్వల్పం. కాకపోతే ఆటోమొబైల్ విడి భాగాల తయారీ కంపెనీలు మాత్రం ఈ సుంకంపై కొద్దిగా భయపడుతున్నాయి. ఈ కంపెనీల మొత్తం ఎగుమతుల్లో 27 శాతం అమెరికాకే వెళతాయి. తన హార్లీడేవిడ్‌సన్ వంటి ఖరీదైన బైకులు, తన అనుంగు మిత్రుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా కార్ల దిగుమతులపై సుంకాలు తగ్గించేలా భారత్‌పై ఒత్తిడి పెంచేందుకే ట్రంప్ సర్కారు ఈ రంగంపై 25 శాతం పన్నుల భారం మోపిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పాడి పరిశ్రమ

మన పాడి ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 11.23 శాతం దిగుమతి సుంకాలు విధిస్తోంది. ఇపుడు ప్రతీకార సుంకాలతో ఇది 38.23 శాతానికి చేరింది. తన పాడి ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు భారత్ ససేమిరా అనడంతో అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. అయినా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడిన భారత పాడి పరిశ్రమకు ఈ సుంకాలతో వచ్చిన ముప్పు పెద్దగా ఉండదని పరిశ్రమ వర్గాలు చెబుతునాయి.

బియ్యం ఎగుమతులు

మన దేశం నుంచి అమెరికాకు ఏటా 2.5 లక్షల నుంచి మూడు లక్షల టన్నుల బియ్యం ఎగుమతవుతాయి. అమెరికా బియ్యం దిగుమతులపై మన దేశం 50 శాతం సుంకం విధిస్తోంది. అమెరికా మాత్రం 5.25 శాతం సుంకంతో అనుమతిస్తోంది. భారత్ కూడా అదే స్థాయికి తగ్గించాలని అమెరికా పట్టుబట్టింది. కేంద్ర ప్రభుత్వం అందుకు ససేమిరా అనడంతో ఇపుడు ప్రతీకార సుంకాలతో ఇది 27 శాతానికి చేరింది. దీంతో అగ్రరాజ్యంలోని దక్షిణ భారత ప్రజలు భారత బియ్యం రకాల కోసం మరింత ఖర్చు చేయక తప్పదు.

జౌళి పరిశ్రమకు మేలే

మన జౌళి ఎగుమతులపైనా అమెరికా 28 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లపై ఇంతకంటే ఎక్కువ భారం మోపారు. ఇది భారత వస్త్ర పరిశ్రమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ కృషితోనే మన ఫార్మా ఎగుమతులకు ట్రంప్ ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు లభించింది.
- డాక్టర్ జీ.పార్థసారథి రెడ్డి, చైర్మన్, హెటెరో గ్రూప్

అమెరికా ప్రతీకార సుంకాలు మన మత్స్య ఎగుమతులను ముఖ్యంగా రొయ్యల ఎగుమతులను గణనీయంగా దెబ్బతీస్తాయి.
- బీద మస్తాన్ రావు, చైర్మన్, బీఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్

ట్రంప్‌ది సెల్ఫ్ గోల్!



భారత్ సహా 60 దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు పెంచడాన్ని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ సెల్ఫ్ గోల్‌గా అభివర్ణించారు. ఈ సుంకాల ప్రభావం భారత్‌పై చాలా స్వల్పమేనని ఆయన అభిప్రాయపడ్డారు. "అన్నింటికంటే ముందు ఈ సుంకాలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయి. ఫుట్‌బాల్ ఆటలో ఇది సెల్ఫ్ గోల్ లాంటిది. ఇతర దేశాలపై ప్రభావం విషయానికొస్తే, భారత ఎగుమతులపై సుంకం పెంపు అమెరికా వినియోగదారులపై ధరాభారం పెంచనుంది. ఫలితంగా భారత వస్తువులకు గిరాకీ తగ్గి, వృద్ధిపై ప్రభావం చూపవచ్చు" అన్నారు. ట్రంప్ సుంకాల పెంపు వెనక ఉద్దేశం దీర్ఘకాలంలో అమెరికాలో ఉత్పత్తి పెంచడమే. అది సాధ్యమయ్యేందుకు చాలా సమయం పట్టనుందన్నారు.. అమెరికా సుంకాలతో భారత మార్కెట్లో వస్తు ధరలపై ఎలాంటి ప్రభావం ఉండబోదన్నారు.



కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు మహేశ్‌గౌడ్, పొన్నం, మల్లు రవి, సురేఖ, అయిలయ్య, ఆది శ్రీనివాస్

బీసీ రిజర్వేషన్లకు అనుమతివ్వండి

» కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ చీఫ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్‌ను రాష్ట్ర మంత్రులు కోరారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీ మల్లు రవి తదితరులు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కేంద్ర మంత్రిని గురువారం కలిసి ఓ వినతి పత్రం అందజేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

బీసీల పట్ల బీజేపీది నిర్లక్ష్య వైఖరి: జాజుల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త జనగణనలో సమగ్ర కులగణన చేపట్టి బీసీల రిజర్వేషన్లను పెంచాలని, లేదంటే దేశవ్యాప్తంగా ఉద్యమించకతప్పదని కేంద్రాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించాలని మూడు రోజులుగా తెలంగాణ భవన్‌లో ఆమరణ నిరహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ జేఏసీ నేత బత్తుల సిద్ధేశ్వర్‌కు గురువారం జాజుల మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్ధేశ్వర్ ఆరోగ్యం క్షీణించకముందే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బీసీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, మహిళా బిల్లులో బీసీ మహిళలకు వాటా, కేంద్ర బడ్జెట్‌లో బీసీల వాటా తేల్చకుండా బీసీల పట్ల బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. కాగా సిద్ధేశ్వర్ దీక్షకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాగూర్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మద్దతు తెలిపారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యండి

» బీజేపీ ఓబీసీ మోర్చా డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గందిమళ్ల ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ వంటి వారు ఇంకెంత కాలం బీసీలను మోసం చేస్తారని ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయలేక కేంద్రంపై నెపం పెడుతున్న కాంగ్రెస్ కుట్రలను మండలస్థాయిలో ఎండగడతామని ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు.

'బెట్టింగ్' కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ఫార్మాట్

» సిట్ తొలి సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులపై ఏర్పాటైన సిట్.. దర్యాప్తునకు ప్రత్యేక ఫార్మాట్‌ననుసరించాలని నిర్ణయించింది. అంతేకాదు.. దర్యాప్తు వేగవంతానికి గడువు కూడా విధించుకోవాలని నిశ్చయించింది. గురువారం సిట్ చీఫ్ ఎం.రమేశ్ నేతృత్వంలో ఎస్పీలు సింధుశర్మ, వెంకటలక్ష్మి, అదనపు ఎస్పీ చంద్రకాంత్, డీఎస్పీ శంకర్‌తో.. సీఐడీ చీఫ్ శిఖాగోయల్ భేటీ అయ్యారు. తొలి సిట్ సమావేశంలో బెట్టింగ్ యాప్‌ల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నిర్ణీత కాల పరిమితిలోపు దర్యాప్తు ఓ కొలిక్కి తేవాలని సంకల్పించిన సిట్.. క్షేత్ర స్థాయి దర్యాప్తు అధికారులతో మరోమారు భేటీ అవ్వాలని నిర్ణయించింది.

30 ఏళ్లదాకా బీఆర్ఎస్ ప్రతిపక్షమే: బల్మూరి

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మూడున్నరేళ్లు కాదు, మరో ముప్పై ఏళ్ల వరకూ బీఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీగానే ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తెలిపారు. మూడేళ్ల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుందంటూ ఆ పార్టీ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై వెంకట్ గురువారం ఓ ప్రకటనలో స్పందించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో ఆ పార్టీ సృష్టించిన విధ్వంసాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదని తెలిపారు. గతంలో పలువురికి బీఆర్ఎస్ ధారాదత్తం చేసిన భూములను కూడా ప్రభుత్వం ఎక్కడ స్వాధీనం చేసుకుంటుందోనన్న భయం కేటీఆర్‌లో ఉందని ఆరోపించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే అసత్య ప్రచారాలతో విద్యార్థులను రెచ్చగొడుతున్నాడని పేర్కొన్నారు. ధరణి పేరుతో రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల భూములను మాయం చేసి ఘనత బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. కాళేశ్వరం కోసం 7వేల ఎకరాల అటవీ భూములు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 400 ఎకరాల కంచగచ్చిబౌలి భూములకు సంబంధించి బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

కేసీఆర్‌పై ఉద్యమంనాటి రైల్ రోకో కేసు కొట్టివేత

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ఉద్యమం సందర్భంగా నమోదైన రైల్‌రోకో కేసును హైకోర్టు గురువారం కొట్టేసింది. 2011 అక్టోబర్‌లో ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో భాగంగా రైల్‌రోకో నిర్వహించారు. కేసీఆర్ పిలుపు వల్లే రైల్‌రోకో చేపట్టారని, అందువల్ల ఆయనను సైతం నిందితుడిగా చేర్చి పోలీసులు కేసు పెట్టారు. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి ఎక్సైజ్ కేసుల కోర్టులో విచారణలో ఉంది. దీనిని కొట్టేయాలని, రైల్ రోకో సమయంలో తాను అక్కడ లేనని పేర్కొంటూ కేసీఆర్ 2024లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసును కొట్టేసింది.

దుబ్బాకకు నీళ్లు ఇచ్చాకే హైదరాబాద్‌కు ఇవ్వాలి

» సాగునీటి సాధనకు మరో ఉద్యమం: కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజక వర్గానికి పూర్తి స్థాయిలో సాగు నీరు, తాగు నీరు ఇచ్చాకే హైదరాబాద్‌కు నీళ్లు ఇవ్వాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే సాగు, తాగు నీటి కోసం మరో ఉద్యమం చేపడతామన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి, అప్పనపల్లి, మల్లయపల్లి గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న మల్లన్నసాగర్ కాలువలను పరిశీలించారు. దుబ్బాకలో పొలాలు ఎండిపోయి రైతాంగం అవస్థలు పడుతున్నారని, 8 మండలాల్లో సాగునీటి కాలువలు పూర్తిచేయాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పు రూ.8 లక్షల కోట్లు

» బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా తీయించి ప్రభుత్వ భూములను అమ్ముకుందని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ దారిలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని.. విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం ముందుకెళ్లాలని చూస్తోందని చెప్పారు. భూముల వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

» సామాజిక న్యాయ ఉద్యమాల్లో విద్యార్థులదే కీలకపాత్ర

» ఏఐవోబీసీఎస్ఏ జాతీయ సదస్సులో వక్తలు



బీసీ సంఘాల నేతలకు సంఘీభావం తెలుపుతున్న పొన్నం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కేంద్రం చేపట్టే జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, బిహార్ బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్రం రాజ్యాంగ రక్షణ కల్పించాలన్నారు. గురువారం, కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో అఖిలభారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐవోబీసీఎస్ఏ), బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 'కులగణన, ఓబీసీ రిజర్వేషన్లు, రాజ్యాంగ పరిరక్షణలు: సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ' అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రంపై పోరాటం చేసేందుకు బీసీ సంఘాలకు ఇతర వర్గాలు కూడా సహకరించాలని కోరారు. మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రిజర్వేషన్ల సంరక్షణ, పెంపు కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీల హక్కులను న్యాయపరమైన సవాళ్ల నుంచి రక్షించేందుకు బిహార్, తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లులను తమిళనాడు రిజర్వేషన్ల మాదిరిగా రాజ్యాంగ రక్షణ కల్పించడం అత్యవసరమని రాజ్యసభ ఎంపీ విల్సన్ అన్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలు రాజకీయశక్తిగా బలపడి సామాజిక న్యాయాన్ని సాధించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీపీ మండల్ మనుమడు, ప్రొఫెసర్ సూరజ్ మండల్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయ ఉద్యమాల్లో విద్యార్థుల పాత్ర కీలకం అని విద్యార్థి ఉద్యమాలు ప్రపంచ చరిత్రలో అనేక సామాజిక మార్పులను తీసుకొచ్చాయని అన్నారు. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడంలో మేధావుల పాత్ర ప్రధానం అని, పండితులు, పాలకులు, విద్యార్థులు ఓబీసీల రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో పాలుపంచుకోవాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు సూచించారు. ఏఐవోబీసీఎస్ఏ జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఓబీసీల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు విద్యార్థి సంఘాలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అధికారికంగా ప్రకటిస్తే

24 గంటల్లో బీసీ కోటా అమలు

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రాష్ట్ర మంత్రి పొన్నం సవాల్



రాహుల్‌గాంధీతో నేతలు మహేశ్‌గౌడ్, పొన్నం ప్రభాకర్, బీర్ల అయిలయ్య, ఆది శ్రీనివాస్ తదితరులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వమే బీసీ రిజర్వేషన్లు అమలు చేయొచ్చని చెబుతున్న బండి సంజయ్.. కేంద్ర మంత్రిగా అధికారిక ప్రకటన చేస్తే రాష్ట్రంలో 24 గంటల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపుతామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ చేశారు. ముస్లింలకు రిజర్వేషన్లు వద్దని వాదిస్తున్న బీజేపీ.. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు గురించి మాట్లాడాలని పేర్కొన్నారు. గురువారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం.. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుందని పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఏపీలో ముస్లింలకు రిజర్వేషన్లు తీసేసిన తర్వాతే కేంద్ర మంత్రులు జీ కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్.. తెలంగాణ గురించి మాట్లాడాలని హితవు పలికారు. ఏపీలో రంజాన్ మాసంలో ఉద్యోగులకు రిలీఫ్ ఇస్తే నోరెత్తని బండి సంజయ్.. తెలంగాణలో ఇస్తే మాత్రం రాద్ధాంతం చేశారని అన్నారు. బీజేపీ చేస్తే ఒప్పు.. కాంగ్రెస్ పార్టీ చేస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు 70శాతం ముస్లిం, మైనారిటీలకు ఈబీసీ రిజర్వేషన్లు అమలు చేశామని (వీడియో ప్రదర్శిస్తూ) మంత్రి పొన్నం గుర్తు చేశారు. దీనికి కేంద్ర మంత్రిగా బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీకి కేంద్రంలో, రాష్ట్రంలో వేర్వేరు నాల్కలు ఉన్నట్టు తెలుస్తోందన్నారు. కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి.. బీసీ ప్రధాని అని చెప్పుకునే మోదీని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల గురించి అడగాలని సూచించారు. అందులోనూ మైనార్టీలకు రిజర్వేషన్లు ఎలా ఇచ్చారని నిలదీయాలని డిమాండ్ చేశారు. అలా చేయలేని పక్షంలో ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. ముస్లిం ల పేరుతో తెలంగాణలోని బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా బీజేపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

ప్రజా సంక్షేమానికి పునరంకితం కండి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్‌తో ఉన్నారని, వారి ఆశలకు అనుగుణంగా పనిచేయాలని వారు సూచించారు. జంతర్ మంతర్‌లో బీసీ సంఘాల నేతృత్వంలో జరిగిన 'బీసీల పోరు గర్జన' సభ విషయాలను సోనియా, రాహుల్ లకు మహేశ్ కుమార్ వివరించారు. 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపె ఒత్తిడి తేవాలని కోరారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం: మహేష్ కుమార్ గౌడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో ఆస్తుల ధ్వంసంపై చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, శ్రీహరి ముదిరాజ్, మక్కాన్ సింగ్ ఠాకూర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రభుత్వ భూములను వారి అనుయాయ సంస్థలకు కారుచౌకగా కేటీఆర్ కట్టబెట్టారని ఆరోపించారు. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని, వచ్చే ఎన్నికలకల్లా రాష్ట్ర ముఖచిత్రంలోనే బీఆర్ఎస్ ఉండదన్నారు. హెచ్‌సీయూ భూములు సర్కార్‌వేనని, విపక్షాలు దురుద్దేశంతోనే అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ నేతలు చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ తీసుకుంటే సీఎం రేవంత్ సహా అందరం కలిసి వస్తామన్నారు. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్న మోదీ.. తెలంగాణలో ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.

బీజేపీ తీరుతో దేశానికి వినాశనమే

» భారత భూభాగాన్ని చైనా ఆక్రమించినా పట్టించుకోవడం లేదు: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీల వెన్నెముక లేని రాజకీయాలతో మన దేశానికి వినాశనమేనని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. నాలుగు వేల కిలోమీటర్ల భారత భూ భాగాన్ని చైనా ఆక్రమించినా పట్టించుకోవడం లేదని, ఇప్పుడు మిత్రదేశం అంటూనే అమెరికా 27% ప్రతీకార (రెసిప్రోకల్) టారిఫ్‌లు విధించిందని.. వీటిపై మోదీ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. చైనాతో 75 ఏళ్ల దౌత్య సంబంధాలను పురస్కరించుకుని వేడుకలు జరపడాన్ని తప్పుపట్టారు. కాగా రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ దీటుగా స్పందించింది. ఆక్సాయ్ చిన్ ప్రాంతాన్ని చైనా ఆక్రమించినప్పుడు మన దేశాన్ని పాలిస్తున్నది ఎవరని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ నిలదీశారు. చైనా అధికారుల నుంచి రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌కు విరాళాలు అందుకున్నారా లేదా చెప్పాలని డిమాండ్ చేశారు. మన దేశానికి చెందిన అంగుళం భూమి కూడా ఆక్రమణకు గురికాలేదన్నారు.

ఉత్తమ విశాఖ నిర్మాణమే లక్ష్యం

బాధ్యతల స్వీకారంలో ఆర్చ్ బిషప్ ఉడుముల బాల



విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అందరినీ కలుపుకొని విశాఖపట్నం అభివృద్ధికి తద్వారా ఆంధ్రప్రదేశ్ వికాసానికి కృషి చేయడమే తన లక్ష్యమని విశాఖ ఆర్చ్ బిషప్ ఉడుముల బాల అన్నారు. జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కేథడ్రల్ మైదానంలో గురువారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఆర్చి బిషప్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉడుముల బాల మాట్లాడుతూ.. వరంగల్ తన జన్మభూమి అని, విశాఖపట్నం పుణ్యభూమి అని పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఫొటోలు మార్ఫింగ్

బీఆర్ఎస్‌పై సందేహం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు

ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో ప్రచారం చేస్తున్న వారిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. తెలంగాణ మత్స్యశాఖ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఎస్‌బీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సాయి కుమార్ పోలీసులను కోరారు.

యువ వికాసం దరఖాస్తుల గడువు 14 వరకు పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును 14వతేదీ వరకు పెంచారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు, ఈబీసీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య భట్టు కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న వారు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని చెప్పారు. అలాగే 2016 తర్వాత మీ సేవ కేంద్రాల ద్వారా జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రంతో అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవచ్చని సూచించారు. సమాచారం కోసం హెల్ప్ డెస్క్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మంత్రి పదవికి కులమే అడ్డొస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

» మంత్రి పదవి వచ్చే సామాజిక వర్గ నేతనే గెలిపించుకుంటాం: మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ సారి మంత్రివర్గ విస్తరణలో తనకు అవకాశం వస్తుందని ఆశిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సామాజిక సమీకరణల్లో భాగంగా తనకు రాకపోతే ఎమ్మెల్యే పదవి రాజీనామా చేసి సంబంధిత సామాజికవర్గానికి చెందిన వారిని గెలిపిస్తామని చెప్పారు. అప్పుడైనా రంగారెడ్డి జిల్లా నేతకు మంత్రివర్గంలో చోటు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో జానారెడ్డి పెద్ద దిక్కులాంటివారని, ఆయనతో చర్చించి అధిష్ఠానాన్ని కలిసేందుకు వచ్చామన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రజల మనోభావాలను అధిష్ఠానానికి తెలియజేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఉత్తమ్‌కు చెప్పిన తర్వాతే ఢిల్లీకి వచ్చామన్నారు. కొన్ని జిల్లాలకు ఇద్దరు ముగ్గురు మంత్రులుండి కొన్ని జిల్లాలకు లేకపోవడం ప్రజల్లోకి మంచి సంకేతాలు వెళ్లవన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన నాయకుడిగా తనకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలన్నారు. ఏదైనా పార్టీ నిర్ణయానికి కట్టుబడే తాను నడుచుకుంటానన్నారు.

వేగంగా ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్

జాప్యం చేయవద్దు.. రెండు వారాల్లో పూర్తి చేయాలి: డీటీసీపీ దేవేందర్‌రెడ్డి

» ఇప్పటికే ఫీజు చెల్లించిన సుమారు 4 లక్షల దరఖాస్తులకు మోక్షం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగంగా చేపట్టి, అభ్యంతరాలు లేనివాటికి త్వరగా ప్రొసీడింగ్స్ జారీ చేయాలని డీటీసీపీ దేవేందర్‌రెడ్డి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 4,80,000 మంది ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించగా.. ఇప్పటివరకు సుమారు 70 వేల మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చారని.. ఇంకా నాలుగు లక్షల మందికిపైగా వేచి ఉన్నారని వివరించారు. ఇలాంటి వారికి ఏప్రిల్ నెల మొదటి, రెండు వారాల్లో ప్రొసీడింగ్స్ క్లియర్ చేయాలని డీటీసీపీ సూచించారు.

రాయితీ గడువు పొడిగించడంతో..

ప్రభుత్వం తొలుత నిర్ణయించిన మేరకు మార్చి నెలాఖరులో రాయితీ గడువు ముగుస్తుందన్న ఉద్దేశంతో.. గత నెల చివరి రెండు వారాల్లో సుమారు 4 లక్షల మంది దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించారు. వీరికి సంబంధించి ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వాల్సి ఉంది. ఫీజు చెల్లించిన పది రోజుల వ్యవధిలో ప్రొసీడింగ్ ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొన్నా.. చాలా మందికి ఆ గడువు తరువాత కూడా ప్రొసీడింగ్స్ అందలేదు. దీనితో వారు ఆందోళనలో పడ్డారు. ఫీజు చెల్లించిన దరఖాస్తులకు సంబంధించి ఏదైనా కారణంతో ప్రొసీడింగ్ ఇవ్వలేకపోతే.. ఫీజులో 10 శాతం మినహాయించుకుని విగతా 90 శాతం ఫీజును తిరిగి దరఖాస్తుదారుల ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది.

ఫీజుపైనే సిబ్బంది దృష్టి!

గత రెండు వారాల్లో సిబ్బంది మొత్తం ఎల్ఆర్ఎస్ ఫీజులు జమ చేసుకోవడంపైనే దృష్టి సారించారు. దరఖాస్తుల పరిశీలనలో జాప్యం నెలకొంది. ప్రభుత్వం మొత్తంగా సుమారు 20 లక్షల దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని లేఖలు పంపింది. సిబ్బంది కూడా దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి గుర్తు చేయడం, ఇతర పనుల్లో నిమగ్నం కావడంతో.. క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం జరిగి ప్రొసీడింగ్స్ ఇవ్వలేకపోయారని అధికారులు చెబుతున్నారు. అన్ని పత్రాలు సరిగా ఉంటే ప్రొసీడింగ్ కచ్చితంగా వస్తుందని వివరిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకు రాయితీ గడువు పొడిగించింది. దీనితో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులు కొంత నెమ్మదించే అవకాశం ఏర్పడింది. ఈ సమయంలో ప్రొసీడింగ్స్‌ను వేగవంతం చేయాలని డీటీసీపీ ఆదేశించారు.

బిల్డ్‌నౌపై కమిషనర్లకు అవగాహన

భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న బిల్డ్‌నౌ అప్లికేషన్‌పై మున్సిపల్ కమిషనర్లకు గురువారం అవగాహన కల్పించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన సమావేశంలో పురపాలక శాఖ సంచాలకురాలు టి.కె.శ్రీదేవి మాట్లాడారు. 2024-25లో ఆస్తి పన్ను వసూళ్లలో చూపిన ప్రగతి, 2025-26లో అవలంబించాల్సిన ప్రణాళికలను వివరించారు. 75 నుంచి 85 శాతం పన్ను వసూలు చేసిన 39 మంది మున్సిపల్ కమిషనర్లను అభినందించారు. 85 శాతం కంటే ఎక్కువ పన్ను వసూలు చేసిన 31 మంది మున్సిపల్ కమిషనర్లను, గత రెండేళ్లుగా మెరుగైన పనితీరు కనబర్చిన కమిషనర్లను సత్కరించారు. ఇక ఎల్ఆర్ఎస్ పథకం అమలు, సందేహాలపై, బిల్డ్‌నౌ అప్లికేషన్‌పై డీటీసీపీ దేవేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు.

తల్లీచెల్లి మోసం చేశారు

దొంగ పత్రాలు సృష్టించి సరస్వతీ పవర్ షేర్లు బదిలీ చేసుకున్నారు

వారిపై ప్రేమ, అభిమానాలు పోయాయి

ఇప్పుడు గిఫ్ట్ ఇవ్వాలని అనుకోవట్లేదు

ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసుకున్నాను

ఎన్సీఎల్టీలో జగన్ వాదనలు

హైదరాబాద్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ షేర్ల బదిలీపై తన తల్లి వైఎస్ విజయలక్ష్మి, చెల్లి వైఎస్ షర్మిల మోసగించారని మాజీ సీఎం జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమకు తెలియకుండా షేర్ల బదిలీకి తప్పుడు తేదీలతో దొంగ పత్రాలు సృష్టించారన్నారు. తమకు తెలియకుండానే తమ పేరిట ఉన్న 51% వాటా బదిలీ చేసుకున్నారని, ఈ బదిలీ రద్దుచేసి తమ వాటా తమకే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జగన్, భారతి, వారి కంపెనీ క్లాసిక్ రియాల్టీ హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)లో దాఖలు చేసిన పిటిషన్‌ను రాజీవ్ భరద్వాజ్, సంజయ్ పూరితో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. 'మా మధ్య సంబంధాలు బాగున్నప్పుడు ప్రేమ, అభిమానంతో సరస్వతీ పవర్‌లో షేర్లు బహుమతిగా ఇచ్చేందుకు ఎంవోయూ జరిగింది. సదరు ఎంవోయూ షరతులతో కూడిన ఒక ఒప్పందం. అక్రమాస్తులకు సంబంధించి సీబీఐ, ఈడీ కేసుల్లో భాగంగా ఈడీ ఆస్తులను అటాచ్ చేసింది. సదరు అటాచ్‌మెంట్లపై హైకోర్టు స్టేటస్ కో (యథాతథ స్థితి) విధించింది. సదరు ఆస్తులన్నీ విడుదలయ్యాక షేర్లు గిఫ్ట్‌గా ఇస్తానని ఒప్పందం చేసుకున్న మాట వాస్తవం. ఒప్పందంపై సంతకం పెట్టలేదని నేను వాదించడం లేదు. సంతకం పెట్టాను. కానీ ఒప్పంద షరతులకు విరుద్ధంగా తల్లి, చెల్లి వ్యవహరించారు. షేర్ల పత్రాలు, షేర్ల బదిలీ పత్రాలు అన్నీ ఇప్పటికీ నా వద్దే ఉన్నాయి. భౌతికంగా గిఫ్ట్ ఇచ్చేవారి నుంచి తీసుకునే వారికి అది చేరినప్పుడు చట్ట ప్రకారం గిఫ్ట్ డీడ్ పూర్తవుతుంది. అసలు నేను గిఫ్ట్ ఇవ్వలేదు. బహుమతి నావద్దే ఉంది. ప్రస్తుతం గిఫ్ట్ ఇచ్చే ఉద్దేశం నాకు లేదు. నా తల్లి విజయలక్ష్మి పేరిట సరస్వతీ పవర్ షేర్ల బదిలీ అక్రమం. నా తల్లి చెల్లి పట్ల పక్షపాతం చూపిస్తోంది. నా తల్లి, చెల్లిపై ప్రేమ, అభిమానాలు పోయాయి. అందుకే షరతులతో కూడిన ఎంవోయూను, గిఫ్ట్ డీడ్ రద్దు చేసుకున్నా. ఈ పరిస్థితుల్లో షేర్ల బదిలీ ప్రశ్నే తలెత్తదు. నాకు తెలియకుండా సరస్వతీ పవర్ బోర్డు బదిలీ తీర్మానం ఎలా ఆమోదిస్తుంది? షరతులు ఉల్లంఘించినందున వాటి నిరద్దు చేసుకుంటున్నాను' అని జగన్ తరఫున నిరంజన్ రెడ్డి తెలిపారు.



ఎర్రవల్లి ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో సమావేశమైన కేసీఆర్

ప్రజల చూపు బీఆర్ఎస్ వైపు

» ఏ ఎన్నికలు వచ్చినా మాకే పట్టం: కేసీఆర్

» పార్టీ నేతలతో ఎర్రవల్లి ఫాంహౌస్‌లో భేటీ

గజ్వేల్/మర్కుక్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని, ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు తమ పార్టీకే పట్టం కడతారని ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. అంతా సమన్వయంతో పనిచేయాలని, ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ బాధ్యతలను మాజీ మంత్రి జోగు రామన్నకు, కరీంనగర్ బాధ్యతలను కేటీఆర్‌తో పాటు గంగుల కమలాకర్‌లకు అప్పగించారు. కరీంనగర్ జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేయాలని సూచించారు. 10 లక్షల మందితో నిర్వహించే ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కేసీఆర్ సూచించారు.

సుప్రీంకోర్టు స్టేతో హెచ్‌సీయూలో విద్యార్థుల సంబరాలు

ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించిన విద్యార్థి సంఘాలు

- భూముల విధ్వంసాన్ని పరిశీలించిన హైకోర్టు రిజిస్ట్రార్
- విద్యార్థులకు సంఘీభావంగా బీజేవైఎం ర్యాలీ



హెచ్‌సీయూలో లాఠీచార్జ్‌ను వ్యతిరేకిస్తూ ట్యాంక్‌బండ్‌పై బీజేవైఎం కాగడాల ర్యాలీ

హైదరాబాద్ సిటీ నెట్‌వర్క్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత, చదును చేయడం వంటి పనులను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో తమ ఆందోళనను విరమిస్తున్నట్లు యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ నేతలు ప్రకటించారు. నిరాహార దీక్షను విరమించినట్లు విద్యార్థులు ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని వన్యప్రాణులకు ఆవాసంగా అభివృద్ధి చేయాలన్నారు. అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూకు వచ్చిన హైకోర్టు రిజిస్ట్రార్

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ హెచ్‌సీయూకు వచ్చారు. సుమారు 5 కిలోమీటర్ల మేర కాలినడకన పర్యటించి భూములకు సంబంధించిన వివరాలను సేకరించారు. అంతకు ముందు బారికేడ్లు అడ్డుపెట్టి విద్యార్థులను ఈస్ట్ క్యాంపస్ వైపు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు.. హైకోర్టు రిజిస్ట్రార్ రాకతో వాటిని తొలగించారు. జేసీబీలు కూడా అక్కడి నుంచి మాయమయ్యాయి. విద్యార్థి సంఘం నాయకులు, పలువురు ప్రొఫెసర్లతో కలిసి మష్రూమ్ రాక్స్ ఉన్న భూముల వద్దకు హైకోర్టు రిజిస్ట్రార్ వెళ్లారు. ప్రభుత్వం ధ్వంసం చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు చెప్పిన పలు అంశాలను ఓపికగా విన్న హైకోర్టు రిజిస్ట్రార్ అన్ని విషయాలను నోట్ చేసుకున్నారు. హైకోర్టు రిజిస్ట్రార్ వెళ్లిపోగానే పోలీసులు తిరిగి ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టారు.

హెచ్‌సీయూలో కొనసాగిన నిరసనలు

హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాలు గురువారం కూడా ఆందోళనలను కొనసాగించాయి. యూనివర్సిటీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు నల్లరిబ్బన్లు మెడలో వేసుకొని రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. అఖిలభారత విద్యార్థి పరిషత్ 'ఛలో హెచ్‌సీయూ'కు పిలుపునిచ్చింది. వర్సిటీ చిన్నగేటు నుంచి ఏబీవీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో యూనివర్సిటీలోకి వచ్చారు. హెచ్‌సీయూ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే అసెంబ్లీని, సీఎం ఇంటిని ముట్టడిస్తామని ఏబీవీపీ నేతలు హెచ్చరించారు. రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థులను, ఏబీవీపీ నేతలను అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు బస్సుల్లో తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కాగా, హెచ్‌సీయూ భూముల వేలం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోకపోతే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని బీజేవైఎం నేతలు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ మీర్‌పేట్ చౌరస్తాలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. హెచ్‌సీయూ విద్యార్థులు చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపేందుకు గురువారం బీజేపీ చలో హెచ్‌సీయూకు పిలుపునిచ్చింది. నాగోల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పంగా శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు హెచ్‌సీయూకి వెళ్లేందుకు సిద్ధమవగా, పోలీసులు వారిని హౌస్ అరెస్టు చేసి నాగోల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హెచ్‌సీయు భూముల వ్యవహారంపై వామపక్ష విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల ప్రతినిధులు సచివాలయాన్ని ముట్టడించేందుకు విఫల యత్నం చేశారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య 47మంది విద్యార్థులను అరెస్టు చేసి సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బీఆర్ఎస్ ఐటీసెల్ ఇన్‌చార్జిలపై కేసులు

కంచ-గచ్చిబౌలి భూములపై తప్పుడు వీడియోలు సృష్టించి, వాటిని సోషల్ మీడియాలో పోస్టులు చేసి హెచ్‌సీయూ విద్యార్థులను తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ ఐటీసెల్ ఇన్‌చార్జీలు కొణతం దిలీప్, డాక్టర్ క్రిశాంక్‌లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యుఐ నాయకులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌సీసీ గేట్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనం

హెచ్‌సీయూలో భూముల వేలం ఆపాలని, ఓయూలో ధర్నాలు చేయకూడదని ప్రభుత్వం ఇచ్చిన అప్రజాస్వామిక సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఓయూ వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో గురువారం ఓయూలోని ఎన్‌సీసీ గేటు వద్ద పలువురు విద్యార్థి నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులపై లాఠీచార్జ్‌ను వ్యతిరేకిస్తూ ట్యాంక్‌బండ్‌పై కాగడాల ప్రదర్శన నిర్వహించారు.

మా ఆదేశాలు పాటించకపోతే..

సీఎస్ జైలుకే!



(మొదటిపేజీ తరువాయి)

గంటల్లోపు మధ్యంతర నివేదిక సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను ఆదేశించింది. అయితే, కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో, హైకోర్టు విచారణపై తాము ఎలాంటి స్టే ఇవ్వడం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం.. నివేదిక వచ్చిన తర్వాత దాని గురించి ఆలోచిద్దామంటూ బదులిచ్చింది. గడువులోపు నివేదిక అందడంతో గురువారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. "కంచ గచ్చిబౌలిలో పనులు జరుగుతున్న ప్రాంతం అటవీ శాఖ పరిధిలో లేదు. 30 ఏళ్లుగా ఆ భూమి వివాదంలోనే ఉంది. పిటిషనర్లు గూగుల్ చిత్రాల ఆధారంగా ఆరోపణలు చేస్తున్నారు. అది పారిశ్రామిక ప్రాంతం" అని నివేదించారు. ఆయన వాదనలతో విభేదించిన ధర్మాసనం.. అది అటవీ ప్రాంతమా? కాదా? అన్నది కాదని, అక్కడ చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నించింది. "హైకోర్టు రిజిస్ట్రార్ నివేదికలో తీవ్ర ఆందోళన కలిగించే విషయాలున్నాయి. భారీ ఎత్తున చెట్ల నరికివేత జరిగినట్టు, భారీ యంత్రాలను ఉపయోగించినట్టు తెలుస్తోంది. ఆ విధ్వంసకాండతో అక్కడి నెమళ్లు, జింకలు వేరే ప్రాంతానికి పారిపోయినట్టు చూపించే చిత్రాలను రిజిస్ట్రార్ తన నివేదికలో పొందుపరిచారు. అక్కడ ఒక చెరువు కూడా ఉన్నట్టుంది. రిజిస్ట్రార్ నివేదిక, చిత్రాల ప్రాథమిక పరిశీలన తర్వాత అక్కడ అడవి జంతువులు నివసించేందుకు అనువుగా ఉన్నట్టు అర్థమవుతోంది. అయినా.. అటవీ భూములను గుర్తించడానికి చట్టబద్ధమైన కమిటీని ఏర్పాటు చేయని పక్షంలో ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుందని న్యాయస్థానం మార్చి 4వ తేదీనే తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకనుగుణంగా తెలంగాణలోనూ అటవీ భూమి కోసం మార్చి 15న కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అక్కడింకా అటవీ భూములను గుర్తించే చట్టబద్ధమైన కసరత్తు ప్రారంభం కాకుండానే చెట్లను నరికివేయడంలో ఆంతర్యమేమిటి?" అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లోనే వందెకరాల్లో చెట్ల నరికివేత ఎంతో తీవ్రమైన అంశమని వ్యాఖ్యానించారు. ఎవరు ఎంతటి స్థాయిలో ఉన్నా.. చట్టానికి అతీతులు కాదని వ్యాఖ్యానించారు. సుమోటోగా కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు పిటిషన్ తయారు చేయాలని అమికస్ క్యూరీకి నిర్దేశించింది. మహారాష్ట్రలో చెట్ల నరికివేతపై దాఖలైన పిటిషన్‌పై ఇప్పటికీ విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్దఎత్తున నిరసన తెలుపుతున్నారని విద్యార్థుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణ్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కంచ గచ్చిబౌలిలో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకూడదని ధర్మాసనం ఆదేశించింది. "కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని సీఎస్ సందర్శించాలి. ఈనెల 16లోపు అఫిడవిట్ దాఖలు చేయాలి. అమికస్ క్యూరీ లేవనెత్తిన ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. అటవీ భూమిగా భావిస్తున్న కంచ గచ్చిబౌలిలో చెట్లను తొలగించి అభివృద్ధి కార్యకలాపాలు అంత హడావుడిగా చేపట్టాల్సిన అవసరమేంటి?, దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ మదింపు ధ్రువీకరణ నివేదిక తీసుకుందా?, చెట్ల నరికివేత కోసం అటవీ అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందారా? స్థానిక చట్టాలను అమలు చేశారా!? మార్చి 15న అటవీ భూమి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో అటవీ, పర్యావరణ వ్యవహారాల్లో నిపుణులు కాని అధికారులను నియమించాల్సిన అవసరమేంటి? వారికి అడవుల గురించి ఉన్న అనుభవమేంటి?, అక్కడ నరికిన చెట్లతో, వచ్చిన కలపను ఏం చేస్తోంది? అనే ప్రశ్నలకు సమాధానాలతో కూడిన సమగ్ర నివేదిక సమర్పించాలి" అని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది.

> హైకోర్టు రిజిస్ట్రార్ నివేదికలో ఆందోళన కలిగించే విషయాలున్నాయి. భారీ ఎత్తున చెట్ల నరికివేత జరిగినట్టు, భారీ యంత్రాలను ఉపయోగించినట్టు తెలుస్తోంది. ఆ విధ్వంసకాండతో అక్కడి నెమళ్లు, జింకలు వేరే ప్రాంతానికి పారిపోయినట్టు చూపించే చిత్రాలను రిజిస్ట్రార్ తన నివేదికలో పొందుపరిచారు. అక్కడ ఒక చెరువు కూడా ఉన్నట్టుంది
>
> - జస్టిస్ బీఆర్ గవాయ్

2000 ఎకరాల్లో ఎకో పార్క్!

(మొదటిపేజీ తరువాయి)



తీసుకుంది. వివాదాన్ని పరిష్కరించి, భూముల విషయంలో ముందుకు వెళ్లేందుకు భాగస్వాములందరితో చర్చించడమే ధ్యేయంగా ముగ్గురు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉంటారు. హెచ్‌సీయూ ఎగ్జిక్యూటివ్ కమిటీ, ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు సహా భాగస్వాములందరితోనూ సంప్రదింపులు జరపనుంది. కమిటీని నియమించనున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అయితే, హెచ్‌సీయూ భూములు హైదరాబాద్‌కు అతి పెద్ద 'లంగ్ స్పేస్'గా ఉన్నాయని పర్యావరణవేత్తలు సహా పలువురు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిని అలాగే ఉంచాలనీ వారు సూచించారు. ఈ నేపథ్యంలోనే, దానిని లంగ్ స్పేస్‌గా కొనసాగించడానికి అక్కడి 2000 ఎకరాల్లోనూ ఎకో పార్కును ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇందుకు సింగపూర్‌లోని నైట్ సఫారీ, న్యూయార్క్‌లోని సెంట్రల్ పార్కు తరహాలో ప్రపంచంలో ఉన్న పర్యాటక ఆకర్షణలపై అధ్యయనం చేయించాలని భావిస్తోంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అంగీకరిస్తే.. ప్రభుత్వ భూమి 400 ఎకరాల్లోనే కాకుండా వర్సిటీకి చెందిన 1600 ఎకరాలనూ కలిపి 2000 ఎకరాల్లో ప్రపంచస్థాయి హైదరాబాద్‌కే తలమానికంగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. హెచ్‌సీయూకు ఫోర్త్ సిటీలో స్థలాన్ని ఇవ్వడమే కాకుండా భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించాలని భావిస్తోంది. ఈ అంశాలన్నిటిపై భాగస్వాములతో మంత్రుల కమిటీ సంప్రదింపులు జరపనున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులపై లాఠీచార్జ్ చేయలేదు

- పోలీసులను అడ్డుకున్న వారిని చెదరగొట్టాం
- హెచ్‌సీయూ సంఘటనపై డీసీపీ వివరణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ చేయలేదని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ స్పష్టం చేశారు. పోలీసుల విధులను అడ్డుకున్న కొందరు విద్యార్థులను చెదరగొట్టామని వివరించారు. ఆ చర్య విద్యార్థులను వెనక్కి పంపడమే తప్ప.. లాఠీచార్జ్ కాదని పేర్కొన్నారు. పలు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో విద్యార్థులపై లాఠీచార్జ్ జరిగినట్లు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. "కొందరు విద్యార్థులు అత్యుత్సాహంతో పోలీసులు అడ్డంగా పెట్టిన తాడును లాక్కొన్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు వారిని చెదరగొట్టి, తాడును తిరిగి స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లోనూ ఈ విషయాన్ని గుర్తించవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి రేవంత్ అహాన్ని పక్కనపెట్టాలి

- సుప్రీం ఆదేశాలు అమలు చేయాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూములలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇకనైనా ఆలోచన మార్చుకుని, వ్యక్తిగత అహాన్ని పక్కన పెట్టి సుప్రీం ఆదేశాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని కోరారు.

కేటీఆర్‌వి నంగనాచి కబుర్లు

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు విశ్వవిద్యాలయాల మొహం చూడని బీఆర్ఎస్ యువరాజు ఇప్పుడు నంగనాచి కబుర్లు చెబుతున్నాడంటూ ఆ పార్టీ నేత కేటీఆర్‌ను ఉద్దేశించి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. హెచ్‌సీయూ భూములపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకే లేదని ధ్వజమెత్తారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు యూనివర్సిటీల భూములు ఆక్రమించుకుని డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించిన విషయం అందరికీ తెలుసని రఘునందన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు విద్యార్థుల వద్ద మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. పార్టీలది వీణా-వాణిలా విడదీయరాని బంధమని అన్నారు. కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన స్టే విద్యార్థుల విజయమని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ విద్యార్థులను జుట్టు పట్టుకుని పోలీసులు ఈడ్చుకెళ్లిన దృశ్యాలు రాహుల్ గాంధీకి ఎందుకు కనిపించడంలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అని నిత్యం చెప్పే రేవంత్‌రెడ్డి.. ఇందిరమ్మ హయాంలో ఇచ్చిన భూములను వ్యాపారం కోసం ఎలా వాడతారని ఎంపీ రఘునందన్ అడిగారు.

పోలీసుల దాడిని ఖండిస్తున్నాం

- ఎమ్మెల్సీ కోదండరాం



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తమ టీజేఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే కొట్టివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ యూనివర్శిటీలోనైనా విద్యార్థులపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదన్నారు. చర్చల ద్వారానే ఆందోళనలకు పరిష్కారం లభిస్తుందన్నారు. హెచ్‌సీయూకి సంబంధించి భూముల రక్షణ, పర్యావరణ పరిరక్షణ వేర్వేరు అంశాలన్నారు. ఈ రెండింటిని కలిపేయడం వల్లే సమస్యలు వస్తున్నాయన్నారు. కంచన్‌గచ్చిబౌలి, దామగుండం విషయాల్లోనూ ఇదే జరిగిందని తెలిపారు. మరోసారి అధికారంలోకి వస్తామని కేటీఆర్ కలలు కంటున్నారని, కానీ అదెప్పటికీ జరగదని అన్నారు.

సుప్రీం మమ్మల్ని అడ్డుకోలేదుగా!?

- కొత్తగా దాఖలైన పిటిషన్లలోనూ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- విచారణ ఈనెల ఏడోతేదీకి వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించిందని, అత్యున్నత న్యాయస్థానం జోక్యం నేపథ్యంలో హైకోర్టు ఎదుట ఉన్న కేసుల్లో కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని, విచారణను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదించిన అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోరారు. దాంతో, 'సుప్రీం కోర్టు మమ్మల్ని అడ్డుకోలేదు కదా!?' అని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. అయినా, తమ స్పందనను సమర్పించే వరకూ వాయిదా వేయాలని విజ్ఞప్తి చేయడంతో తమ ఎదుట ఉన్న పిటిషన్లను ఈనెల ఏడో తేదీకి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. కొత్తగా దాఖలైన పిటిషన్లలో సైతం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తున్నామని, అప్పటిలోగా మధ్యంతర దరఖాస్తులతో సహా అన్ని పిటిషన్లలో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. కంచ గచ్చిబౌలిలో అడవిని తొలగించరాదని, సదరు భూ బదిలీ జీవో 54ను కొట్టేసి.. ఆ ప్రాంతాన్ని జాతీయ పార్కుగా గుర్తించాలని హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. దాంతో, గురువారం సాయంత్రం వరకు ఎలాంటి పనులు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది కూడా. ఈ నేపథ్యంలోనే, ఈ పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. సింఘ్వి వాదనలు ప్రారంభిస్తూ.. సదరు భూమిని అటవీ భూమిగా ఎక్కడా పేర్కొనలేదని, గత 30 ఏళ్ల రికార్డు తమ వద్ద ఉందని తెలిపారు. కాగా, 400 ఎకరాల్లో చెట్ల నరికివేతను, భూమి చదును చేసే పనులను ఆపాలని హైకోర్టు స్పష్టంగా ఆదేశించినా.. ప్రభుత్వం అలాగే పనులు కొనసాగించిందని వట ఫౌండేషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి తెలిపారు. హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ప్రభుత్వ తీరుపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ మేరకు మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదిస్తూ.. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై రాష్ట్ర అటవీ శాఖ వివరణను కేంద్ర ప్రభుత్వం కోరిందని తెలిపారు. కాగా ఇదే వ్యవహారంపై పలువురు హెచ్‌సీయూ విద్యార్థులు లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం.. చెట్లను పడగొట్టకుండా సుప్రీంకోర్టు ఇప్పటికే రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసినందున.. తమ ఎదుట ఉన్న పిటిషన్లను ఈనెల ఏడో తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం

న్యాయస్థానం కోరిన సమాచారమిస్తాం.. న్యాయం గెలుస్తుంది: మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సర్వోన్నత న్యాయస్థానం కోరిన సమాచారాన్ని గడువులోపు పంపిస్తామన్నారు. గురువారం ఈ మేరకు వీరిద్దరూ ఓ ప్రకటనను విడుదల చేశారు. సుప్రీంకోర్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి విశ్వాసముందని, న్యాయం గెలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. హెచ్‌సీయూలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించవద్దని ఐజీ (ఇంటెలిజెన్స్), సైబరాబాద్ కమిషనర్లను ఆదేశించినట్లు వివరించారు.

ఉద్యోగాలు రాకుండా చేసే కుట్ర

అధికారంలోకి వస్తే.. హెచ్‌సీయూ భూములను కాపాడతామంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదమని పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల జోలికి వెళ్లడం లేదని, ఆ వర్సిటీకి చెందిన అంగుళం భూమిని సైతం తీసుకోవడం లేదని స్పష్టంచేశారు. హెచ్‌సీయూకు సంబంధం లేని భూముల విషయంలో విద్యార్థులను రెచ్చగొడుతున్నారన్నారని విమర్శించారు. ఫేక్ ఫొటోలు, వీడియోలతో సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ.. విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అలాంటి చర్యలను మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులకు హితవు పలికారు. పారిశ్రామిక అభివృద్ధి జరిపి, ఉపాధి అవకాశాలను పెంచాలన్న తపనతో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తుండగా ఆయనపై కేటీఆర్ వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదన్నారు. ఫేక్ ప్రచారాలతో పారిశ్రామిక అభివృద్ధిని అడ్డుకోవడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు రాకుండా చేసే కుట్రలను మానుకోవాలన్నారు. కంచ గచ్చిబౌలిలోని 400ఎకరాలు ప్రభుత్వానివేనంటూ హైకోర్టు, సుప్రీంకోర్టు స్పష్టం చేశాయన్నారు. పాతికేళ్లుగా నిరుపయోగంగా ఉన్న భూముల్లో పిచ్చిమొక్కలు మొలిచాయని, బీఆర్ఎస్ ఫేక్ వీడియోల్లో ప్రచారం చేస్తున్నట్లుగా అక్కడేమీ లేదన్నారు. 2014-23వరకు 4,28,437 ఎకరాల భూమిని బీఆర్ఎస్ మాయం చేసిందన్నారు. బీఆర్ఎస్ వైఖరి దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. హెచ్‌సీయూ భూముల విషయంలో నాడు కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలను బీఆర్ఎస్ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. ఉస్మానియా వర్సిటీ భూముల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలని బీఆర్ఎస్ ఆలోచన చేసిందన్నారు. 111జీవోను రద్దుచేసి, హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాల పరీవాహక ప్రాంతాన్ని నాశనం చేసింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు.

అక్కడ అంగుళం కూడా కొనకండి

(మొదటిపేజీ తరువాయి)



వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అందరికీ ఆ ప్రాంతంలో జింకలు, తాబేళ్లు, నెమళ్లు కనబడుతుంటే, కాంగ్రెస్ నేతలకు గుంటనక్కలు కనబడుతున్నాయని ఎద్దేవా చేశారు. బుల్డోజర్ల కింద నెమళ్లు, జింకలు చచ్చిపోతున్నాయంటూ విద్యార్థులు బయటపెట్టిన చిత్రాలు కృత్రిమ మేధతో చేసినవని ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. అవన్నీ వాస్తవ చిత్రాలేనని, హెచ్‌సీయూ వెబ్‌సైట్‌లో ఈ చిత్రాలను ఎవరైనా చూడొచ్చని తెలిపారు. రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌లా కాకుండా 15 నిమిషాలు మనిషిలా ఆలోచించాలని రేవంత్‌కు సూచించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూవివాదంలో విద్యార్థులు చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ప్రకటించిందని, స్వయంగా హెచ్‌సీయూకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ చేస్తున్న విమర్శల దృష్ట్యా ప్రత్యక్షంగా పాల్గొనడంలేదని ఆయన వెల్లడించారు. కోర్టులంటే రేవంత్ సర్కార్‌కు లెక్కలేదని.. హైడ్రా విషయంలో పలుసార్లు చివాట్లు పెట్టినా ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. 400 ఎకరాల భూమిలో చెట్లను నరకొద్దని సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది హెచ్‌సీయూ విద్యార్థులు, అధ్యాపకులు సాధించిన విజయమని ఆయన వెల్లడించారు.

సంజయ్.. తంబాకు నమలడం కాదు..!

బీఆర్ఎస్ హయాంలో ప్రకృతి విధ్వంసమంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో హరితహారం ద్వారా 270 కోట్ల మొక్కలునాటి దేశంలోనే కాక అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు ఎన్నో అవార్డులు వచ్చేలా తాము కృషిచేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా తమ ప్రభుత్వంలో చేపట్టిన హరిత విప్లవానికి కితాబునిచ్చిందన్నారు. "తంబాకు నమలడం కాదు.. కేంద్ర ప్రభుత్వం హరిత విప్లవంలో ఇచ్చిన గ్రేడింగ్‌లు, బీఆర్ఎస్ పాలనలో పెరిగిన గ్రీనరీ ఏమిటో తెలుసుకోవాలి" అని బండి సంజయ్‌ను ఉద్దేశించి కేటీఆర్ పేర్కొన్నారు.

ఇక డైవర్షన్ పాలిటిక్స్

హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వ వైఖరిని సుప్రీంకోర్టు తప్పు పట్టడంతో సీఎం రేవంత్ నుద్దేశించి కేటీఆర్ ఎక్స్ వేదికగా పలు వ్యాఖ్యలు చేశారు " హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వ వైఖరిని సుప్రీం కోర్టు విమర్శించింది. అంతేకాక ఎమ్మెల్యేల ఫిరాయింపులపై చేసిన అర్థరహిత వ్యాఖ్యలను కూడా తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో వీటినుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి.. జోకర్ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడతాడు. 3డీ మంత్రా పాటిస్తాడు. 3 డీ అంటే డిసెప్షన్, డిస్ట్రాక్షన్, డిస్ట్రక్షన్" అని కేటీఆర్ పోస్ట్ చేశారు.

రేవంత్ దుందుడుకు చర్యలకు చెంపపెట్టు



హెచ్‌సీయూ భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలకు చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. మొన్న పార్టీ ఫిరాయింపుల విషయంలో, నేడు హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం మొట్టికాయలు వేసిందని ఎక్స్‌వేదికగా ఆయన వెల్లడించారు. ప్రకృతి విధ్వంసాన్ని సుప్రీంకోర్టు అడ్డుకోవడం శుభ పరిణామమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా హెచ్‌సీయూ భూముల విషయంలో వెనక్కు తగ్గాలని కవిత సూచించారు.

ఖురాన్ స్ఫూర్తిని విస్మరించిన వక్ఫ్ బోర్డు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ వ్యాఖ్య
- పాదరక్షలు విడిచి ఖురాన్‌లోని అంశాల పఠనం
- ఇబాదత్‌ఖానా స్వాధీనంలో జాప్యంపై అసహనం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు తీరును హైకోర్టు తప్పుబట్టింది. వక్ఫ్‌బోర్డు దివ్య ఖురాన్ స్ఫూర్తిని విస్మరించిందని, పేదల పక్షాన పనిచేయడం మానేసిందని ఆక్షేపించింది. హైదరాబాద్ పాతబస్తీలోని ఇబాదత్‌ఖానా(ఆధ్యాత్మిక కేంద్రం) నిర్వహణను ప్రత్యక్ష నిర్వహణలోకి తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై అసహనం వ్యక్తంచేసింది. ప్రస్తుతం ఇబాదత్‌ఖానా యాజమాన్యం అక్రమంగా కొనసాగుతోందని, దానిని స్వాధీనం చేసుకుని ప్రత్యక్ష నిర్వహణలోకి తీసుకోవాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. కొత్త కమిటీని వేయాలని సూచించింది. ఆ కమిటీలో షియాఅక్బరీ, ఉసూలీ శాఖల నుంచి సమానంగా సభ్యులను నియమించాలని తెలిపింది. ఈ ఆదేశాలను వక్ఫ్‌బోర్డు అమలు చేయలేదు. కమిటీ సభ్యులు కొందరు రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వక్ఫ్‌బోర్డు ఖురాన్ స్ఫూర్తిని పాటించడం లేదని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఖురాన్‌లోని కొన్ని పేరాలను న్యాయమూర్తి పాదరక్షలు విడిచి చదివి వినిపించారు. రివ్యూ పిటిషన్‌ను కొట్టివేశారు.

'పరిహారం'పై త్రిసభ్య కమిటీని నియమించండి

- హైకోర్టులో 'పిల్' దాఖలు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించే విషయమై త్రిసభ్య కమిటీని నియమించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రైతుస్వరాజ్య వేదికకు చెందిన సామాజిక కార్యకర్త బన్నూరు కొండల రెడ్డి దీన్ని దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈమేరకు ప్రభుత్వానికి నోటీసులు జారీచేసిన ధర్మాసనం తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎస్ఎల్‌బీసీ డిస్ట్రిబ్యూటరీలకు కాంక్రీట్ లైనింగ్

- రూ. 34.17 కోట్లతో టెండర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ)కు చెందిన డిస్ట్రిబ్యూటరీ (పిల్లకాలువ)లకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరద కాలువకు చెందిన ఒకటి నుంచి 27వ డిస్ట్రిబ్యూటరీ దాకా సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని కోసం రూ.34.17 కోట్ల అంచనాతో టెండర్లు పిలుస్తూ గురువారం నోటిఫికేషన్ ఇచ్చింది. టెండర్ దాఖలుకు ఆఖరు గడువు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల దాకా విధించింది. టెండర్ల దాఖలు ప్రక్రియ పూర్తయ్యాక 19న సాంకేతిక బిడ్‌లు తెరవనుండగా, 22న ప్రైస్ బిడ్‌లు తెరవనున్నారు.

మరో నెల 'కాళేశ్వరం' కమిషన్ గడువు పెంపు!

- వచ్చే నెలలో సర్కార్‌కు జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక?

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణకు నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో నెల పొడిగించాలని యోచిస్తున్నది. గడువు ముగియనున్నందున ఈ నెల 20 తర్వాత తుది విచారణ ప్రక్రియ పూర్తిచేసి, వచ్చే నెల తొలి/ రెండోవారంలో నివేదిక సమర్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. తదనుగుణంగా మే ఆఖరు వరకూ ఘోష్ కమిషన్ పొడిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి తుది నివేదిక ఇవ్వడానికి ఘోష్ కమిషన్ కసరత్తు చేస్తోంది.

పోలీసు విచారణకు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- భూవివాదం కేసులో గంటన్నరపాటు ప్రశ్నించిన పోలీసులు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి రెండోసారి పోలీసుల విచారణకు హాజరయ్యారు. మోకిల సీఐ వీరబాబు, ఎస్సై కోటేశ్వర్‌రావు ఆయనను సుమారు గంటన్నర పాటు టంగటూరు భూవివాదం విషయంలో విచారించారు. టంగటూరులోని తన 56 ఎకరాల భూమిని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కబ్జా చేశారని 27 మే 2024న అత్తాపూర్‌కు చెందిన సామ దామోదర్‌రెడ్డి మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో జీవన్‌రెడ్డితో పాటుగా అతని భార్య రజిత, తల్లి రాజుబాయిపై కేసు నమోదైంది. పోలీసులకు సహకరించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో గత శుక్రవారం మోకిల పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. కాగా, రాజకీయ కక్షతోనే తనతోపాటుగా తనపై కేసులు పెట్టారని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు.

అనుబంధ కాలేజీల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలు గుర్తింపు, అదనపు సెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలంగాణ ఇంటర్ బోర్డు కోరింది. ఒక కాలేజీకి జీవోనెం.12 ప్రకారం నాలుగు ఒరిజనల్ సెక్షన్లతో పాటు 5 అదనపు సెక్షన్లకు మాత్రమే అనుమతి ఉంటుందని బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపు/అనుబంధ కాలేజీల వివరాల కోసం టీజీబీఐఈ.సీజీజీ.జీవోవీ.ఇన్, acadtgbie.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లను చూడవచ్చని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే బోర్డు అనుబంధ/గుర్తింపు కాలేజీల జాబితాను ప్రకటిస్తామని, ఈ వివరాలు తెలుసుకున్నాకే కాలేజీల్లో తమ పిల్లలను చేర్చాలని సూచించారు. జూన్ 8వ తేదీ తర్వాత కాలేజీల మార్పు, సొసైటీ మార్పు, కాలేజీల పేరు మార్పు, బాలుర నుంచి బాలిక, కో-ఎడ్యుకేషన్ వంటి మార్పుల ప్రతిపాదనలు స్వీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనుబంధ/గుర్తింపు కోసం మే 4 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, లేట్ ఫీజుతో జూన్ 8వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ కోర్సులో శిక్షణ

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్‌లలో మే 1 నుంచి జూన్ 11వ తేదీ దాకా టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు తెలిపారు. ఈ శిక్షణ 42 రోజుల పాటు ఉంటుందని, 18 ఏళ్లు నిండి... 45 ఏళ్లలోపు వయసు కలిగి... పదో తరగతి తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైన వారు శిక్షణకు అర్హులని తెలిపారు.

49 కిలోల బంగారం స్మగ్లింగ్

- కొన్ని నెలలుగా అక్రమంగా తెచ్చిన రన్యారావు
- దుబాయ్‌కు రూ. 38 కోట్లకుపైగా హవాలా సొమ్ము

బెంగళూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కన్నడ నటి రన్యారావు దుబాయ్ నుంచి మొత్తం 49 కిలోల బంగారాన్ని అక్రమంగా తెచ్చినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారుల విచారణలో స్పష్టమైంది. బంగారం అక్రమ రవాణా, హవాలా వ్యవహారాల గురించి ఈ కేసులో మూడో నిందితుడు సాహిల్ జైన్ అధికారులకు అన్నీ వివరించినట్లు సమాచారం. గత నెలలో దుబాయ్ నుంచి 14.2 కిలోల బంగారాన్ని తెస్తూ బెంగళూరులో పట్టుబడిన రన్యారావు, అంతకు ముందు కూడా భారీగానే బంగారం తీసుకువచ్చినట్లు గుర్తించారు. జనవరిలో 14.568 కిలోలు, ఫిబ్రవరిలో 13.433 కిలోలు తెచ్చినట్లు డీఆర్ఐ అధికారులు నిర్ధారించారు. అక్రమంగా తెచ్చిన మొత్తం బంగారానికి రూ. 38.4 కోట్లు హవాలా రూపంలో దుబాయ్‌కి పంపించారని డీఆర్ఐ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ప్రాథమిక సమాచారాన్ని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. బంగారం స్మగ్లింగ్, నగదు హవాలాలో రన్యారావు, సాహిల్‌జైన్ కీలక పాత్ర పోషించినట్లు డీఆర్ఐ అధికారులు నిర్ధారించినట్లు తెలుస్తోంది. హవాలా సొమ్ము సమకూర్చేందుకు ప్రతి లావాదేవీకి రూ. 55 వేలు చొప్పున కమీషన్ తీసుకున్నట్లు సాహిల్‌జైన్ అంగీకరించినట్లు తెలిసింది.

శంషాబాద్ టూ హాంకాంగ్

- విమాన సర్వీసులను పునరుద్ధరించిన జీఎమ్మార్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హాంకాంగ్‌కు విమాన సర్వీసులను గత నెల 31 నుంచి పునరుద్ధరించినట్లు జీఎమ్మార్ అధికారులు పేర్కొన్నారు. ఈ విమాన సర్వీసులు వారానికి మూడు సార్లు (సోమవారం, గురువారం, ఆదివారం) నడుస్తాయని సీఈవో ప్రదీప్ పణికర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత దేశంలోని ఐదు ప్రముఖ నగరాల్లో హైదరాబాద్ ఒకటని.. దీనికి తమ సేవలు విస్తరించడం చాలా సంతోషంగా ఉందని హాంకాంగ్‌కు చెందిన కాథే పసిఫిక్ ఎయిర్‌వేస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ రైకార్ పేర్కొన్నారు. వ్యాపార, పర్యాటక కేంద్రాలకు అనుకూలంగా ఉండడంతో జీఎమ్మార్‌తో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు ఉండాలనే ఉద్దేశంతో విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించామని పేర్కొన్నారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగానికి అలైన్‌మెంట్ ఖరారు

- భూసేకరణ వ్యయంలో 50 శాతం భరించేందుకు తెలంగాణ హామీ: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ వ్యయంలో 50 శాతాన్ని భరిస్తామని తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చిందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఎంపీలు డీకే అరుణ, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భూసేకరణ వ్యయం పంచుకోవడానికి సంబంధించిన త్రైపాక్షిక ఒప్పందంపై తెలంగాణ ప్రభుత్వం ఇంకా సంతకం చేయలేదని వివరించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అలైన్‌మెంట్ ఖరారైనట్లు తెలిపారు. రూ.34,367.62 కోట్ల అంచనా వ్యయంతో ఆర్ఆర్ఆర్ మంజూరు కోసం తెలంగాణ నుంచి కేంద్రానికి అభ్యర్థన వచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగానికి గత నెల 18న పర్యావరణ అనుమతులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణాభాగం డీపీఆర్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఇక, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, ఉత్తర ప్రాంతీయ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)ను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలేవీ లేవని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

సీఎం సంయమనం పాటించలేరా?

(మొదటిపేజీ తరువాయి)

విధంగా వ్యవహరించాలి కదా?" అని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్లపై గురువారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది ఆర్యామ సుందరం తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశం సబ్ జ్యుడిస్ అని తెలిసినా ఉప ఎన్నికలు ఉండవని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రేవంత్ చెప్పారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

స్పీకర్ తలపై తుపాకీ పెట్టి నిర్ణయం తీసుకోవాలనలేం: సింఘ్వీ

అసెంబ్లీ సెక్రటరీ తరఫున అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపిస్తూ.. అనర్హత అంశంలో స్పీకర్, స్పీకర్ కార్యాలయం స్పందించేందుకు మరికొంత సమయం కావాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. 'సహేతుకమైన కాలం' అనేది స్పీకర్ నిర్ణయించాలని, ఆరు నెలల సమయం ఇవ్వాలని కోరారు. ఈ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. "ఇంకా సమయమా? అసలు మీ దృష్టిలో రీజనబుల్ టైం అంటే ఎంతో ఇప్పటికైనా చెబుతారా? మరో ఆరు నెలలు ఎలా అడుగుతున్నారు?" అని అసహనం వ్యక్తం చేసింది. దీనికి సింఘ్వీ బదులిస్తూ.. స్పీకర్‌పై అనవసర ఒత్తిడి తీసుకురాకూడదని, స్పీకర్ తలపై తుపాకీ పెట్టి నిర్ణయం తీసుకోవాలనలేమని చెప్పారు. అయితే "ప్రతి రోజూ ముఖ్యమైనదే అన్న విషయాన్ని మర్చిపోవద్దు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కోర్టుపై ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.." అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి సింగిల్ బెంచ్ కేవలం నాలుగు వారాల గడువు ఇచ్చిన విషయాన్ని విస్మరించవద్దని జస్టిస్ గవాయి గుర్తు చేశారు. దీనికి సింఘ్వీ బదులిస్తూ.. "రాజ్యాంగం పదో షెడ్యూల్ ప్రకారం స్పీకర్ విధుల్లో జోక్యం చేసుకునే అధికారం న్యాయవ్యవస్థకు లేదు, స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కోర్టు జోక్యం చేసుకోలేదు" అని వివరించారు. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున ఆర్యామ సుందరం కలుగజేసుకుని.. కోర్టు జోక్యం చేసుకునే వరకు ఎమ్మెల్యేలకు నోటీసులు కూడా జారీ కాలేదని, ఇంతవరకు స్పీకర్ నుంచి ఎటువంటి సమాధానం రాలేదని గుర్తుచేశారు. వాళ్లు చెప్పినట్లు వింటే నాలుగేళ్ల సమయం అయిపోతుందేమోనని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం కేవలం అధికారం మాత్రమే కాదని, పూర్తి న్యాయం చేసే బాధ్యత కూడా కోర్టులపై ఉందని తెలిపారు. అయితే 'సహేతుక సమయం'లో స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని సింఘ్వీ పేర్కొనగా.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. "అంటే 2028 జనవరి లేదా ఫిబ్రవరిలో ఎన్నికలు వచ్చే వరకు వేచి ఉండాల్సిందేనా? అసెంబ్లీ పదవీకాలం ముగియడమేనా మీ దృష్టిలో ఉన్న రీజనబుల్ సమయం?" అని ప్రశ్నించింది. ఇటువంటి కేసుల్లో సీనియర్ న్యాయవాదులు వాదిస్తున్న తీరు న్యాయస్థానాలకు ఇబ్బందికరంగా ఉంటోందని అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యంలో ఉన్నామనే విషయాన్ని న్యాయవాదులు మర్చిపోతే ఎలాగని ప్రశ్నించింది.

ఎనిమిది వారాలకు తీర్పు రిజర్వు..

గత విచారణ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యామ సుందరం, శేషాద్రి నాయుడు, స్పీకర్ కార్యాలయం తరఫున సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించగా.. గురువారం అసెంబ్లీ సెక్రటరీ తరఫున అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపించారు. అన్ని వైపుల వాదనలు ముగియడంతో ధర్మాసనం తీర్పును ఎనిమిది వారాలకు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మేడిపల్లిలో తీవ్ర ఉద్రిక్తత

- ఫార్మా భూములకు హద్దుల గుర్తింపు అడ్డగింత
- భూమి కోర్టు వివాదంలో ఉందని రైతుల ఆందోళన
- ఇద్దరు బీఆర్ఎస్ నేతల అరెస్టు

యాచారం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో టీజీఐఐసీ గతంలో సేకరించిన భూములకు హద్దులు గుర్తించేందుకు అధికారులు చేపట్టిన చర్యలు ఉద్రిక్తతకు దారి తీశాయి. ఫార్మాసిటీ కోసం ఏడున్నరేళ్ల క్రితం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మేడిపల్లిలో సుమారు 8వేల ఎకరాల పట్టా అసైన్డ్ భూములను సేకరించింది. ఆయా భూముల హద్దులు గుర్తించేందుకు గురువారం ఉదయం వచ్చిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని రైతులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిలో హద్దు రాళ్లు ఎలా పాతుతారంటూ నిలదీశారు. భూసేకరణ సమయంలో రైతులందరికీ ఇస్తానన్న ఇంటి పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, అధికారులతో వాదనకు దిగిన కలకొండ జంగయ్య అనే రైతును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో రైతులు పెద్దఎత్తున నినాదాలు చేయగా.. స్థానిక తహసీల్దారు, ఏసీపీ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చి అధికారులతో ఘర్షణకు దిగిన బీఆర్ఎస్ నేతలు మేడిపల్లి మాజీ సర్పంచ్ పి.బాషా, సాయిలును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఘటనాస్థలికి చేరుకున్న ఆర్డీవో అనంత రెడ్డి జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని వివరించారు. ఆపై, కలెక్టర్ సూచనల మేరకు కోర్టు వివాదంలో ఉన్న భూమిని వదిలి మిగిలిన భూమిలో హద్దు రాళ్లు పాతారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. భూమి ఇచ్చిన ప్రతి రైతుకు ప్లాట్ ఇవ్వడంతో పాటు అందుకు సంబంధించిన పత్రాలు ఇస్తామని ఆర్డీవో అనంతరెడ్డి, మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి ఆందోళనకారులను సముదాయించారు.

పీజీ మెడికల్ విద్యార్థులకు హైకోర్టులో ఊరట

- మిగిలిన ఫీజుపై ఒత్తిడి చేయొద్దని కాలేజీలకు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఫీజుల విషయమై పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల విద్యార్థులకు హైకోర్టులో కాస్త ఊరట లభించింది. ట్యూషన్ ఫీజుల్లో మిగిలిన మొత్తాన్ని చెల్లించాలంటూ ఒత్తిడి తీసుకురాకూడదని వైద్య కళాశాలలను ఆదేశించింది. అయితే పిటిషన్ వేసిన విద్యార్థులకే ఆ ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. 2023-2026 బ్లాక్ పీరియడ్‌కు మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీటు ట్యూషన్ ఫీజును ఏడాదికి రూ.5.8 లక్షల నుంచి రూ.24 లక్షలకు, కన్వీనర్ కోటా ఫీజును రూ.3.2 లక్షల నుంచి రూ. 7.75 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీన్ని సవాల్ చేస్తూ డాక్టర్ అద్వైత శంకర్ సహా 124మంది మెడికల్ పీజీ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గురువారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. మిగిలిన ఫీజు చెల్లించాలంటూ ఒత్తిడి చేయరాదని, వారిని తరగతులకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను పదిరోజులకు వాయిదా వేసింది.

జేఈఈ మెయిన్ రెండో దశ పరీక్షలు

- గణితం కఠినం.. ఫిజిక్స్ ఓ మాదిరి

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్-2025 రెండో దశ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. రెండో రోజు గురువారం రెండు షిఫ్టుల్లో పరీక్ష జరిగింది. మొదటి షిఫ్ట్‌లో జరిగిన పరీక్ష కొంత కఠినంగా ఉందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ సబ్జెక్టులో అన్ని టాపిక్స్ బాలెన్స్‌డ్‌గా కవర్ చేసినప్పటికీ మెకానిక్స్, ఎలక్ట్రోస్టాటిక్స్, ఆప్టిక్స్, యూనిట్స్ అండ్ మెజర్‌మెంట్స్ అంశాలపై కొంచెం ఎక్కువ ప్రశ్నలు కనిపించాయని, ఫిజిక్స్ ఓ మాదిరిగా ఉందని తెలిపారు. మేథ్స్ కొంచెం కఠినంగా ఉండడంతో సమాధానాలు రాబట్టడానికి ఎక్కువ సమయం పట్టిందని కొందరు విద్యార్థులు అన్నారు. బుధవారం కెమిస్ట్రీ కష్టంగా ఉండగా, గురువారం వచ్చిన ప్రశ్నలు సులువుగా ఉన్నాయని అన్నారు. ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీలో ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని, చాలా వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి నేరుగా అడిగారని తెలిపారు. ఇక గురువారం మొదటి షిఫ్ట్‌తో పోలిస్తే రెండో షిఫ్ట్ పరీక్ష కొంత సులభంగా ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు. కొన్ని ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ దాటి వచ్చినట్లు అనిపించిందని వారు తెలిపారు. ఉదయం సెషన్‌తో పోలిస్తే మధ్యాహ్నం సెషన్ వారికి కొంత ఎడ్జ్ ఉండే అవకాశం ఉందని కోచింగ్ నిపుణులు తెలిపారు. మొత్తంగా చూస్తే లెక్కలు, భౌతికశాస్త్రం నుంచి వచ్చిన ప్రశ్నలు విద్యార్థులను కొంత ఇబ్బంది పెట్టాయని జేఈఈ ఫ్యాకల్టీ చెప్పారు.

హాల్‌టికెట్ల విడుదల

ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న జేఈఈ మెయిన్ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసింది. పరీక్ష రాసే అభ్యర్థులు jeemain.nta.nic.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది.

ఐఐటీ హైదరాబాద్‌కు జాతీయ ప్రతిష్ఠిత సంస్థ హోదా

విరాళాలకు 100 % పన్ను మినహాయింపు

కంది, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రతిష్ఠిత సంస్థ హోదా కల్పించింది. ఇక నుంచి ఐఐటీహెచ్‌కు విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80జి ప్రకారం 100 శాతం పన్ను మినహాయింపు ఉంటుందని ఐఐటిహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు. ఇకపై ఐఐటీహెచ్ ద్వారా పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. దాతలు, కార్పొరేట్ భాగస్వాములు, శ్రేయోభిలాషులు ముందుకు రావాలని బీఎస్ మూర్తి ఆహ్వానించారు.

వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- మూజువాణి ఓటుతో ఆమోదించిన సభ
- ఇందులో ముస్లిమేతరుల ప్రమేయం లేదు
- 284 సంస్థలు అభిప్రాయాలు తెలిపాయి
- అన్ని వర్గాలనూ సంప్రదించాకే బిల్లు
- బిల్లుపై చర్చలో కేంద్ర మంత్రి రిజిజు



రాజ్యసభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రిజిజు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: వక్ఫ్ సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. సుదీర్ఘ చర్చ అనంతరం గురువారం అర్ధరాత్రి దాటాక సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ బిల్లును బుధవారం అర్ధరాత్రి దాటాక లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో 288-232 ఓట్లతో బిల్లుకు ఆమోదం లభించింది. వక్ఫ్ సవరణ బిల్లు(యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ (యూఎంఈఈడీ-ఉమీద్)'కు లోక్‌సభ ఆమోదం తెలపడంతో కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లును చట్టవిరుద్ధమైనదిగా పేర్కొన్న ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లులో ముస్లిమేతరుల ప్రమేయం ఎంత మాత్రం లేదని స్పష్టం చేశారు. ముస్లింల హక్కులను హరిస్తామన్న ప్రతిపక్షాల ఆరోపణలనూ ఖండించారు. ముస్లింల్లోని అన్ని తెగల వారి హక్కులను పరిరక్షించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బిల్లుతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. "బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేముందు మేం రాష్ట్ర ప్రభుత్వాలు, మైనారిటీ కమిషన్లు, వక్ఫ్ బోర్డులతో సంప్రదింపులు జరిపాం. బిల్లు పరిశీలనకు జేపీసీని ఏర్పాటు చేశాం. సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించింది" అని రిజిజు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 8.72 లక్షల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయన్నారు. 2006లో 4.9 లక్షల వక్ఫ్ ఆస్తుల ద్వారా రూ.12 వేల కోట్ల ఆదాయం వస్తుందని సచార్ కమిటీ అంచనా వేసిందని, అంటే ప్రస్తుతం ఆయా ఆస్తుల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో ఊహించుకోవచ్చని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణలో లోపాలను, దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ సవరణ బిల్లును తెచ్చినట్లు చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని, వక్ఫ్ ఆస్తులన్నీ ముస్లింలకు మాత్రమే చెందుతాయని స్పష్టంచేశారు. ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా 284 సంస్థలు తమ అభిప్రాయాలను తెలిపాయని, కోటి మందికి పైగా ప్రజలు వినతిపత్రాలు అందించారని వెల్లడించారు. అందరితో సంప్రదింపులు జరిపిన తర్వాతే మైనారిటీ వ్యవహారాల శాఖ ఈ సవరణ బిల్లును రూపొందించిందని రిజిజు స్పష్టం చేశారు. సభ్యులందరూ బిల్లుకు మద్దతు తెలుపుతారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సభ్యుడు సయ్యద్ నజీర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్వేషాలు రెచ్చగొట్టి, మతపరమైన ఏకీకరణ కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అబద్ధాల ఆధారంగా సవరణ బిల్లును రూపొందించారని, ఆరు నెలలుగా బీజేపీ వక్ఫ్ బిల్లుపై దుష్ప్రచారం చేసిందని ధ్వజమెత్తారు.

ముస్లిం మహిళలను ద్వితీయ శ్రేణి పౌరుల్ని చేసిన కాంగ్రెస్: నడ్డా

కేంద్రంలో చాలా కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశంలోని ముస్లిం మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేసిందని బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా రాజ్యసభలో ఆయన మాట్లాడారు. ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడం ద్వారా మోదీ సర్కారు ముస్లిం మహిళలను ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చిందన్నారు. ఈజిప్ట్, సూడాన్, బంగ్లాదేశ్, సిరియా వంటి ముస్లిం దేశాల్లో చాలా ఏళ్ల కిందటే ట్రిపుల్ తలాక్‌ను నిషేధించగా.. భారత్‌లో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిందేమీ లేదన్నారు. వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం ఏమీ తీసుకోదని, వాటి దుర్వినియోగాన్ని మాత్రమే అడ్డుకుంటుందని చెప్పారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ సర్ఫరాజ్ అహ్మద్, శివసేన (ఉద్ధవ్ వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించారు. ట్రంప్ వేస్తున్న ప్రతీకార సుంకాల నుంచి దృష్టి మరల్చేందుకే మోదీ సర్కారు వక్ఫ్ బిల్లు తీసుకొచ్చిందని.. అందుకే పేద ముస్లింలపై ఎనలేని ప్రేమ చూపుతోందని రౌత్ అన్నారు. ఇండి కూటమి సభ్యులు వక్ఫ్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమైన బిల్లు అని, ముస్లింలను లక్ష్యంగా చేసుకొని రూపొందించారని ఆరోపించారు.

'కర్ణాటకలో పాక్ అనుకూల నినాదాలు'.. సభలో వాగ్యుద్ధం

వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ సభ్యుడు రాధామోహన్ దాస్ అగర్వాల్ చేసిన వ్యాఖ్యలతో రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్యుద్ధం జరిగింది. కర్ణాటకలో కాంగ్రెస్ నేత రాజ్యసభకు ఎన్నికైన సమయంలో ఆ పార్టీ శ్రేణులు పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారని ఆరోపించారు. ఆ నినాదాలపై అభ్యంతరం వ్యక్తం చేసిన బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ ఆరోపణలు తనపైనే చేశారంటూ కాంగ్రెస్ సభ్యుడు నజీర్ హుస్సేన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య వాగ్యుద్ధం జరిగింది.

- వక్ఫ్ బిల్లును ఆమోదించడాన్ని ఆలిండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షాబుద్దీన్ రజ్వీ బరేల్వి స్వాగతించారు. ఈ బిల్లుతో ముస్లింల్లోని అణగారిన వర్గాలకు ఆర్థిక ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిల్లుకు అనుకూలంగా ఓటేసిన లోక్‌సభ సభ్యులకు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.
- వక్ఫ్ బిల్లుపై బీజేడీ మాట మార్చింది. రాజ్యసభలో బీజేడీకి ఏడుగురు సభ్యులున్నారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. గురువారం మాత్రం తమ సభ్యులు మనస్సాక్షి ప్రకారం ఓటు వేయొచ్చని తెలిపింది. ఎంపీలకు విప్ జారీ చేయబోమంది.

నాపై ఆరోపణలను రుజువు చేస్తే రాజీనామా చేస్తా: ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: వక్ఫ్ భూమిని కబ్జా చేశారంటూ బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ బుధవారం లోక్‌సభలో చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తనపై అసత్య ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన ఆయన.. రాజకీయ దాడులకు తాను బెదిరిపోనన్నారు. పుష్ప సినిమాలోని 'తగ్గేదే లే' డైలాగ్ చెప్పారు. గురువారం రాజ్యసభలో ఖర్గే మాట్లాడారు. "బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ నాపై అసత్య ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఎంపీలు ప్రశ్నించడంతో ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు.వక్ఫ్ భూమిపై ఆరోపణలను ఠాకూర్ నిరూపిస్తే నేను రాజీనామా చేస్తా. లేదంటే ఆయన చేయాల్సిందే. ఇలాంటి రాజకీయ దాడులతో బీజేపీ నేతలు నన్ను భయపెట్టాలని చూస్తున్నారు. నేనెవరికీ భయపడను. తల్గొగ్గను" అని ఖర్గే స్పష్టం చేశారు. కాగా, వక్ఫ్ బిల్లు రాజ్యాంగంపై తీవ్ర దాడి అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ విమర్శించారు. గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో ఆమె మాట్లాడుతూ.. సమాజంలో విభజన తీసుకొచ్చేందుకు బీజేపీ వ్యూహంలో భాగమే ఈ బిల్లు అని ఆక్షేపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.